
ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక
4 అణాలు
28-2-'51

విషయానుక్రమణిక

28 ఫిబ్రవరి 1951

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును

Founder: K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 24

శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డిగారు:

1880-1951.

★

ఆంధ్ర విశ్వ కళాపరిషత్తును, సంస్థాపన మొదలు, తీర్చిదిద్ది అభ్యున్నతికి తెచ్చి, ఆంధ్రదేశానికి అపార సేవచేసిన శ్రీ రామలింగా రెడ్డిగారు 1951 ఫిబ్రవరి 24 వ తేదీ శనివారం ఉదయం 8-30 గంటలకు మద్రాసులో కాలధర్మం చెందారు. యూరప్, అమెరికా, జపాన్‌లు పర్యటించి అక్కడ రాజకీయ, విద్యాసంస్థల్ని పరిశీలించి తమ అనుభవాన్ని ఆంధ్రదేశానికి ఆంధ్ర విశ్వ కళా పరిషత్ సేవా రూపంలో సమర్పించారు. రాజనీతి పండితునిగా, విజ్ఞాన వేత్తగా, విద్యావ్యాపకునిగా, వక్తగా ఆంధ్ర దేశానికి శ్రీ రెడ్డిగారు చిరస్మరణీయులు.



పాకిస్తానులో

ఎ. సోఫ్రోనోవ్

[ఒక సోవియట్ రచయిత అనుభవాలు]

★

4. లాహోరులో

పాకిస్తానులోని పెద్ద నగరాలలో లాహోరు రెండవది. అక్కడి జనసంఖ్య 13 లక్షలు.

ఇక్కడ కళాశాలలు చాలా ఉన్నాయి. అభ్యుదయ రచయితల కార్యాలయం ఇక్కడేఉంది. ఇక్కడ నవంబరుమాసంలో కూడా పగలు ఎంతో వేడిగా ఉండి సాయంకాలం తిరిగేసరికి చలి ప్రారంభమవుతుంది. ఇక్కడ ఉన్న కొద్ది రోజులలోనూ ఇక్కడి ప్రజల జీవితం గురించి మేము చాలా తెలుసుకున్నాము.

మాకు అన్నిటికన్నా కొట్టవచ్చినట్టు కనిపించినది అంతులేని బిచ్చగాళ్లు. వీరిలో పిల్లలు హెచ్చు. చింకి పాతలు ధరించి, అశుచిగా ఉండి, బక్క చిక్కిన బిచ్చగాళ్లు చేతులు చాచి వీధులలో మనవెంట పడతారు.

బిచ్చగాళ్లు ఏమూల చూసినా ఉన్నారు. కొన్ని నగరాలలో వీరి సంఖ్య నమ్మశక్యం గానిదిగా ఉంటున్నది. పశ్చిమ పంజాబులోని మూల్తాన్ నగరంయొక్క 3 లక్షల జనాభాలో 30 వేలమంది బిచ్చగాళ్లున్నారు. వీరిలో ఎక్కువమంది పుట్టిన దాది బిచ్చగాళ్ళేనని ఒక పత్రిక వ్రాసింది.

లాహోరులో అందమైన భవనాలూ, ఆకర్షవంతమైన షాపులూ చాలా ఉన్నాయి. కంటికి కొట్టవచ్చే రంగులుగల ప్రకటనలూ, వీధులలో సందడీ, రాత్రి వేళ వింతగా వెలిగి కళ్ళు మిరుమిట్లు గొలిపే "నియాన్ సైన్లూ" ఉన్నాయి. అయితే వీటితో బాటు భయంకరమైన శ్రామిక నివాస ప్రాంతాలు కూడా ఉన్నాయి. వేలకు వేలుగా ఇళ్లు లేనివాళ్లు రోడ్ల పక్కనా, పార్కుల బయటా పడుకుని నిద్రపోతారు.

లాహోరు రేడియోస్టేషను చూశాము. అది కొద్ది స్టూడియోలూ, పాతకాలపు పరికరాలూ గల చిన్న భవనం. రేడియో స్టేషనులో పనిచేసే అతను ఒకడు మాకు స్టూడియోలు చూపుతూ గర్వంగా, మైక్రోఫోనులు తప్ప మిగతా సామగ్రి యావత్తూ లాహోరులోనే తయారుచేయబడిందనీ, మైక్రోఫోనులు మాత్రం ఇంగ్లండు నుండి వచ్చాయనీ చెప్పాడు.

ఒక్క మైక్రోఫోనులే గాక దానిద్వారా జరిగే ప్రసారం యావత్తూ బ్రిటిషువారు నిర్దేశించిన పంపిణీనిబట్టే తయారవుతూ ఉంటుందని మాకు తరువాత తెలియవచ్చింది.

మ్యూజియం సమీపంలో ఎత్తయిన దిమ్మెపైన "జామ్‌జామా" ఫిరంగి ఉన్నది. ఒకప్పుడు హిందువులు (భారతీయులు?) దీనిని బ్రిటిషువారిపై ప్రయోగించారని చెబుతారు. చాలామంది పాకిస్తానీయులకీ సంగతి తెలుసు. ఒక్కొక్కసారి ఫిరంగి ప్రక్కన నిలబడి ఆ దారే కార్లలో వెళ్లే బ్రిటిషు వారికేసి చూస్తారు. ఇవాళ ఆ ఫిరంగి ఉపయోగంలో లేదు. పిల్లలు దానిమీది కెక్కి ఆడుకుంటూ ఉంటారు.

మ్యూజియంలో ఉన్న ఒక ముసలివాడు, ఎర్ర టర్కీటోపి పెట్టుకున్న ముస్లిము, మ్యూజియం ఎందుకు ఖాళీగా ఉన్నదో తెలియజెప్పాడు. ఇండియానుంచి పాకిస్తాను వేరుపడ్డప్పుడు మ్యూజియంలోని వస్తువులు విభజింపబడ్డాయి.

బుద్ధిపూర్వకంగా రెచ్చగొట్టబడే హిందూ, ముస్లిం విద్వేషాన్ని మేము చాలా సార్లు ప్రత్యక్షంగా చూశాము. బ్రిటిషు సామ్రాజ్యవాదులు చేసిన దీర్ఘకృషి ఫలితంగా, ఇండియా విభజనకాలమందు పెద్ద ఎత్తున మతసంఘర్షణ చెలరేగి అంతులేని రక్తం ప్రవహించింది. 1947 లో హిందువులు పాకిస్తానునుండి ఇండియాకూ, ముస్లిములు ఇండియానుండి పాకిస్తానుకూ పారిపోయినారు. ఆ సమయంలో లక్షలాది జనం చిత్రవధ చేయబడ్డారు. ఇవాళ ఈ ముసలి ముస్లిముకళాసంపదను ఆకాశాని కెత్తి హిందూ చిత్రాలను హేయమైన వాటికింద తోసి పారేశాడు.

పాకిస్తాను,ఇండియాలకు రెంటికీ బ్రిటిషు వారు చేసిన అపకారాన్ని మేము గుర్తించ గలిగాము.

మ్యూజియముకు దగ్గరలోనే ఆర్టుస్కూలున్నది. ఇక్కడ గొప్ప ధనికుల పిల్లలూ, భూస్వాముల పిల్లలూ పెద్దపెద్దజీతాలు కట్టి కళాభ్యాసం చేస్తారు. పిల్లలు తయారు చేసిన శిల్పాలనూ, రచించిన చిత్రాలనూ ప్రదర్శించే హాలు చూశాము. వీటిలో రకరకాల కరసామగ్రి ఉన్నది. చిత్తరువులలో జీవమూ, జాతీయతా మృగ్యంగా ఉండటం మాకు విస్మయాన్ని కలిగించింది. బొద్దుగా ఉన్న ప్రాచ్య స్త్రీల చిత్తరువులూ, "స్టిల్ లైఫ్" చిత్తరువులూ హెచ్చుగా ఉన్నాయి. చిత్రలేఖనం అభ్యసించే యువకులను చూడాలని మాకు కుతూహలం కలిగింది. ఇద్దరు పెద్దమనుష్యులు తమలో తాము రహస్యంగా ఏదో మాట్లాడుకుని తమ విద్యార్థులను మాకు చూపించటానికి సాహసించ నిర్ణయించారు. మమ్మల్ని క్లాసు రూముకు తీసుకు వెళ్లారు. నల్లనికళ్లూ, పాలిపోయిన ముఖాలూ కలిగిన విద్యార్థులు గోడలవెంబడి నిలబడి, కొట్టవచ్చే రంగులతో, అర్ధనగ్న యువతుల చిత్రాలతో విలసిల్లే అమెరికను పత్రికలు "కాపీ" చేస్తున్నారు. లాహోరు ఆర్టుస్కూలుకు ఉద్దీపన ఈ విధంగా లభిస్తోంది! విద్యార్థుల కృషిలో జాతీయతగాని, వాస్తవికతగాని ఉండమంటే ఎట్లా ఉంటుంది? ఈ యువక కళాకారులకూ,పాకిస్తాను ప్రజాజీవితానికీ మధ్యగా తళతళలాడే "లైఫ్" పత్రిక ముఖచిత్రం అడ్డంగాఉండి, వారి ఆత్మలను ధ్వంసంచేసి నీరసమై, క్షుద్రమైన అడ్వర్టయిజు మెంటు శిల్పాన్ని చిన్నతనంనుంచీ మప్పుతూ, వాస్తవికతకు రంగులుపూస్తూ విజాతీయ భావాలనూ, దృశ్యాలను నేర్పుతున్నది.

17వ శతాబ్దంనాటి అపూర్వ శిల్పమైన జహంగీర్ గోరీ చూసిన తరవాత మాకీ విషయం మరింత గట్టిగా తెలిసివచ్చింది. మా పాదరక్షలను బయట విడిచి ఈ భవనంలో ప్రవేశించి గోరీ సందర్శించాము. దానిలో రంగురంగు రాళ్లు పొదగబడి ఉన్నాయి. భవనంమీద నాలుగు "స్తంభా" లున్నాయి. అందులో ఒకదాని శిఖరానికి ఎక్కి, పార్కులమధ్యా, చెట్లమధ్యా శోభించే లాహోరు నగరాన్ని చూశాము.

కొద్ది నేత మిల్లులుతప్ప లాహోరులో చెప్పుకోదగిన పరిశ్రమలు లేవు. అది పెద్ద రైలు కూడలి కావటంచేత లాహోరులోని

శ్రామికులలో హెచ్చుమంది రైల్వేలో పని చేస్తూ ఉన్నారు.

విభజనమూలంగా, ప్రపంచ నారలో నూటికి 80 వంతులు ఉత్పత్తిచేసేపాకిస్తానుకు, ఒక్క మిల్లుకూడా లేకుండా పోయింది. జాతీయ విద్వేషాలు రెచ్చగొట్టి, చరిత్రలో అపూర్వమైన మతరాజ్యం ఏర్పాటు చేసిన ఆంగ్లోఅమెరికనుల విధానం ధర్మమా అంటూ పాకిస్తానుకు పరిశ్రమలు లేవు. రెండో వైపున అనేక నారమిల్లులు కలిగిఉన్న ఇండియాకు ముడి సరుకు లేదు.

ఎత్తునుంచి చూస్తే లాహోరు అందమైన నగరంగా కనిపిస్తుంది గాని అది కేవలం భ్రమ.

జహాంగీర్ గోరీ నుంచి తిరిగి వస్తూ మేము రానీ నది మీదగల వంతెనను దాటాము. మంచి రంగులుగల అమెరికను బస్సులు మా పక్కగా వెళ్లాయి. అవతలితట్టు అస్తమించే సూర్యుడికాంతిలో నదిలోని మురికినీరు ఎర్రగా మెరుస్తున్నది. ఆకస్మికంగా వంతెనమీద ఎక్కడి వాహనాలక్కడ ఆగిపోయాయి. వచ్చేపోయే బళ్లకు మధ్యగా చిన్న గాడిద ఒకటి ఆగింది. ప్రయాణీకుల బళ్లూ, బస్సులూ, ఎద్దుబళ్లూ నిలిచిపోయాయి. ఏమిచేసినా గాడిద కదల్లేదు. గాడిదను కాళ్లూ, తోకా పట్టుకుని ఒక పక్కకు ఈడ్చిన తరవాతగాని మళ్లీబళ్లు కదలటానికి లేకపోయింది.

సుప్రసిద్ధ పాకిస్తానుకవి ఇక్బాల్ గోరీ చూడవెళ్లాము. ఇంకా కట్టడం పూర్తిగాని ఆ ఎర్రరాతి భవనంవద్దకు పోయేసరికి దాని పక్కగా ఒకడు పడుకుని ఉండటం కనిపించింది. వాడిమీద గోనెపట్టా కప్పారు. వాడు కుష్కించిపోయినాడు. కళ్లు గుంటలు పడిపోయాయి. వాడు తీవ్రమైన మలేరియాతో బాధపడుతున్నాడు. ఒక యువకుడు వాడి పక్కన కూచుని ఈగలు తోలుతున్నాడు. పడుకుని ఉన్నమనిషి రాళ్లు కొట్టేవాడనీ, ఈ భవనం కట్టటానికి నియోగించబడ్డాడనీ మాకు తెలిసింది. ఈఆరు బయట పడుకోకపోతే ఇంటికిపోగూడదా అని రోగిని గురించి యువకుణ్ణి ప్రశ్నించాము. యువకుడు విచారంగా తల ఆడించి, "కూలివాడు. ఇల్లెక్కడుంది?" అన్నాడు.

అందుచేత ఈ పనివాడు ఇక్కడే, ఈ చలవరాళ్లమధ్యా, రాతిపెళ్లల మధ్యా, పూర్తికాని ఇక్బాల్ గోరీ సమీపంలో పడుకొని ఉన్నాడు.

ఎట్ట ఎదురుగా కోట గోడ ఉన్నది. దాని మీద తెల్లని ఆకుపచ్చని రంగులు గల పాకిస్తాను జెండా నీలాకాశంలో ఎగురుతున్నది. ఇది లాహోరు దుర్గం. ఈ దుర్గాన్ని ఎందుకుపయోగిస్తున్నారు. ఈ పెద్ద వాకిళ్ల వద్ద సాయుధ పహరావాళ్లు ఏం చేస్తున్నారు అని అడిగాము.

"ఇది జైలు," అని సమాధానం వచ్చింది. "లోపల కొట్లలో కమ్యూనిస్టులు కూచుని ఉన్నారు. కమ్యూనిస్టుపార్టీపై పశ్చిమ పంజాబులో నిషేధం లేకపోయినప్పటికీ ప్రజారక్షణ చట్టం కింద కమ్యూనిస్టులు ఖైదీ చేయబడ్డారు."

ఈ చౌకులోనే సిక్కు దేవాలయం ఉన్నది. దేవాలయం మూసి ఉండటంచేత మేము దాని అంతర్భాగం చూడలేదు. ఇండియాకు పారిపోలేకపోయిన సిక్కులందరూ లాహోరులో చంపివేయబడ్డారు. నగర వీధులగుండా వెళుతూంటే మాకు ఎన్నో భవనాలు దగ్ధమయీ, ధ్వంసమయీ కనిపించాయి. ఇవి 1947 సంఘటన తాలూకు చిహ్నాలు.

ఒకనాటి ఉదయం మేము కేకలు విని నిద్ర లేచాం. బాల్కనీలోకి వెళ్లి చూస్తే కొద్దిమంది స్త్రీ పురుషులు జాతీయపతాక పట్టుకుని నినాదాలు చేస్తూ, రెండు ఎర్రటి పోస్టర్లు ధరించి ఊరేగింపుగా నడుస్తూ, వీధి వెంబడి పోతున్నారు. వీరు లాహోరు హోటలు పనివారు. తమ జీతాలు తగ్గించినందుకు ఆక్షేపణపూర్వకంగా ప్రదర్శనం చేస్తున్నారు.

ఎర్రటోపీ పెట్టుకుని పోలీసువాడొకడు వారికేసి సానుభూతితో చూస్తున్నాడు. తక్కువ వేతనాలతో పోలీసులకుకూడా అసంతృప్తి కలిగినట్టు కనబడింది.

మాస్కోనుంచి వెలువడే ఇంగ్లీషుభాషా పత్రికలు "సోవియట్ లిటరేచర్", "న్యూ టైమ్స్" విక్రయించే పుస్తకాలషాపు లాహోరులో ఒకటి ఉన్నది.

ఇక్కడ మాకు లియొనోవ్, పాస్తోవ్ స్కీ, ఎహ్రెన్‌బర్గ్, గులియా మొదలైన సోవియట్ రచయితల పుస్తకాలు కనిపించాయి. ఇక్కడ అభ్యుదయ రచయితలు మాకు, ఉర్దూభాషలోకి అనువదించబడిన లెనిన్, స్టాలిన్ గ్రంథాలు బహూకరించారు.

లాహోరులో నాటకశాల ఒక్కటైనా లేదు. కాని సినిమా హాలులు చాలా ఉన్నాయి. వీటిలో అమెరికను చిత్రాలు ప్రదర్శిస్తారు. అవి ఊహించలేనంత జుగుప్సాకరంగానూ, భావరహితంగానూ ఉంటాయి.

మేము అంతో ఇంతో ఆనందించిన చిత్రం "షబ్నం" అనే భారతీయ చిత్రం ఒకటే.

ఒక సినిమాలో అమెరికను వార్తాచిత్రం ఒకటి చూశాము. చాంగ్ కైషేక్ బలాలకు అమెరికా ఏవిధంగా తోడ్పడిందీ ఈ చిత్రంలో బహిరంగంగా చూపబడింది. హాంకాంగుపై ఎగిరే అమెరికన్ విమానాలనూ, పశ్చిమ జర్మనీలో అమెరికను, బ్రిటిషు, ఫ్రెంచి బలాలు చేసే విన్యాసాలనూ, టాంకులనూ, ఫిరంగులనూ, బాంబర్లనూ కొండశిఖరాలమీద నిలబడిఉన్న సేనానాయకులనూ, భయపడుతూ దొడ్డి కంచెల వెనకనుంచి వీటన్నిటినీ తిలకించే జర్మనులనూ చూశాము. బ్రిటిష్ కామన్వెల్తుకు చెందిన దేశాలలోని ప్రజలను చెదరగొట్టటానికై ఈ చిత్రాలు ప్రత్యేకంగా తయారుచేయబడ్డవనటానికి సందేహం లేదు.

ఒక వారంపాటు వారినీ, వీరినీ కలుసుకుని, బహిరంగసభలలో ప్రసంగించి ఆదివారంనాడు నగర సందర్శనార్థం బయలుదేరాం. దుకాణాలన్నీ మూసిఉన్నాయి. నగరం నిర్జనంగా కనిపించింది. అప్పుడప్పుడూ "టాంగా"లు తోలేవాళ్లు మమ్మల్ని కేక పెట్టారు. నెత్తిమీద తట్టలు పెట్టుకుని పేడ పోగుచేస్తూ వీధులవెంట పిల్లలు కనిపించారు. బజారు సమీపంలో దర్జీలు నేలపై కూచుని పాత దుస్తులు బాగుచేస్తున్నారు. నగర మధ్యంలోగల మైదానం మధ్యను ఒక ముసలివాడు పడుకొని ఉన్నాడు. వాడి చర్మం ఎండుటాకులాగా ఉన్నది. అది ప్రార్థనల సమయం కావటం చేత వాడి చుట్టూ ముస్లిములు మోకరిల్లి తూర్పువైపు మాస్తున్నారు ఆ చచ్చిపోయేవాణ్ణి గురించి ఆలోచించేవారు లేరు.

(ఇంకా ఉంది)

కొడుకు:—నాన్నా! బి. ఏ. రిజల్ట్సు ఇవ్వాళ పేపర్లో పడ్డాయి. సెకండు క్లాసులో పాసయ్యాను. వచ్చే ఏడు ఏం చదవమంటావ్?

తండ్రి—'వాంటెడ్ కాలమ్సు' చదువు.

కాశ్మీర్ సమస్య

★

కాశ్మీర్ సమస్య తిరిగి భద్రతా మండలిలో చర్చకువచ్చింది. ఈ మారుకూడా చర్చ జరిగే ముందు ఒక తీర్మానం ప్రవేశపెట్టబడింది. చీనా రష్యాల సామీప్యందృష్ట్యా బ్రిటన్ అమెరికాలు కాశ్మీర ప్రాంతాన్ని గురించి చూపుతున్నందు శ్రద్ధవల్ల ఇది ఇలా జరిగిందికాని, ఈ ప్రాధాన్యమే లేకపోతే, ఆ ఖ్చేచర్చతో నిమిత్తంలేకుండా మధ్యవర్తి సర్ ఓవెన్ డిక్సన్ నివేదికను భద్రతామండలి ఆమోదించి, అక్కడికి విడిచి పెట్టేసేదే. మధ్యవర్తిత్వానికి ప్రయత్నించి విఫలుడైన డిక్సన్ తన నివేదికలో, ఇక మీదట ఈ తెగని సమస్యని పరిష్కరించుకునే భారాన్ని ఉభయపక్షాలకీ (ఇండియా, పాకిస్తాన్లకి) విడిచిపెట్టెయ్యాలని సూచించాడు. బ్రిటన్, అమెరికాలకు ప్రత్యేక శ్రద్ధలేకపోతే, డిక్సన్ సూచించినట్లు ఇక్కడికి వొదిలెయ్యవలసిందే. ఇప్పుడు విడిచి పెట్టనూలేదు, డిక్సన్ నివేదికను చర్చించనూలేదు. ఒక తీర్మానం ప్రవేశపెట్టి, దీని ఆధారంతో డిక్సన్ నివేదికను చర్చించాలన్నారు..

నచ్చకపోయినా, ఇదివరలో యుద్ధనివారణ కోసం ఇండియా పాకిస్తాన్లు ఆమోదించిన రెండు తీర్మానాలూ బ్రిటన్ అమెరికాల ప్రమేయంవల్ల ప్రతిపాదించబడినవే.

ఈ మూడు తీర్మానాల్నీ మొత్తంగా పరిశీలించి నట్లయితే బ్రిటన్ అమెరికాల ధోరణిలో రీతిబద్ధమైన ఒక విధానం గోచరిస్తుంది. బ్రిటన్ అమెరికాలు ఒకలక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరిస్తున్నాయని స్పష్టపడుతుంది. (ఇప్పుడు భద్రతామండలిలో ఆంగ్లో-అమెరికన్ వర్గం, ఏదిప్రవేశపెట్టినాసరే, మంచిచెడ్డలతో నిమిత్తం లేకుండా కనీసం ఎనిమిదివోట్లు లభిస్తాయి. తీర్మానం ఆమోదానికి మొత్తం పదకొండు రాజ్యాలలో ఏడు రాజ్యాల వోట్లుచాలు.)

బ్రిటన్ అమెరికాలు అవలంబిస్తున్న విధానాన్ని వివరించేముందు, జరిగినదాన్ని వివరించడం అవసరం.

1947 అక్టోబర్ ఆరంభంలో పశ్చిమదిశనుంచీ, దక్షిణశనుంచీ కాశ్మీరంపైకి కొండజాతిపరాన్లు, పాకిస్తానీలు దండయాత్ర ప్రారంభించారు. అప్పటికి కాశ్మీర్ ప్రభుత్వం భారతదేశంతో చేరాలో, పాకిస్తాన్‌తో చేరాలో నిర్ణయం చేసుకోలేదు. దండయాత్ర ప్రారంభమై శ్రీనగరానికి ముప్పురాగానే కాశ్మీర్ మహారాజు భారతదేశంతో చేరుతున్నట్లు ప్రకటించి, భారత సైన్యసహాయాన్ని అర్థించాడు. భారత ప్రభుత్వం ఈ అభ్యర్థనకి తాత్కాలికంగా సమ్మతించి, శాంతిస్థాపన అనంతరం కాశ్మీర్ ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకోవాలనీ, ప్రజల అనుమతిపైనే కాశ్మీరాన్ని భారతదేశంలో చేర్చుకోగలుగుతారనీ తెలియపరిచారు. వెంటనే ప్రజాప్రతినిధుల ప్రభుత్వాన్ని స్థాపించాలని షరతుకూడా పెట్టారు. కాశ్మీర్ జాతీయ ముస్లిం సమావేశానికి ప్రభుత్వం ఒప్పగించబడింది. భారతసైన్యాలు అక్టోబర్ మాసాంతంలో కాశ్మీర్ ప్రవేశించి దాడిమూకల్ని నిరోధించాయి. దీనితోపాటు పాకిస్తాన్ దురాక్రమణ గురించి భారతప్రభుత్వం భద్రతా మండలికి ఫిర్యాదుచేసింది.

ఫిర్యాదులోని ముఖ్యాంశాలేమిటంటే
1. దాడిమూకలు పాకిస్తాన్‌నుంచే వచ్చాయి.
2. పాకిస్తానీలుకూడా దాడిలో పాల్గొన్నారు. 3. దురాక్రమణ పరులికి ఆయుధాలు, లారీలు వగైరా అన్నిటినీ పాకిస్తాన్ ప్రభుత్వం సప్లైచేసింది. 4. పాకిస్తాన్ సైనికాధికారులు దాడిమూకలికి నాయకత్వం వహించారు. పాకిస్తాన్ ప్రభుత్వం మొదట ఈ ఆరోపణలు అసత్యమని వాదించింది. తరవాత 1948 మే లో తమ సైన్యాలు కూడా చేరినట్లు ఒప్పుకుంది.

ఇండియా పాకిస్తాన్లు ఆమోదించిన భద్రతామండలి మొదటితీర్మానం ప్రకారం (ఇది 1949 జనవరి 5 న ఆమోదించ బడింది. 1948 ఆగస్టు 13 తీర్మానంలో కొన్ని అంశాల్ని ఉభయదేశాలూ నిరాకరించాయి. దానిని సవరణచేసి ఈ తీర్మానం చివరికి ఆమోదించబడింది) అయిదుగురు సభ్యులుకల ఒక కమిషన్ నియమించబండిది. ముందు యుద్ధవిరమణ, తరవాత సైన్యాల ఉపసంహరణ, ఆ పైన ఎడ్మిరల్ నిమిట్జ ఆధ్వర్యంకింద ప్లెబిసైట్ నిర్వహణ ఈ విధంగా ఒక కార్యక్రమాన్ని మొదటి తీర్మానం నిర్ణయించింది.

ఈ తీర్మానంలో పాకిస్తాన్ దురాక్రమణ జరిపినట్లు చెప్పబడలేదు. కాని ముందు పాకిస్తాన్ ఆక్రమించిన ప్రాంతంలో సైన్యాల్నీ, పఠాన్లని ఉపసంహరించాలనీ, ఆ తరవాత భారతసైన్యాలలో కనీసావసరమైనవానిని మాత్రం ఉండనిచ్చి మిగతా సైన్యాన్ని ఉపసంహరించాలనీ నిర్ణయించ బడింది. సైనికోపసంహరణ జరిగిన తరవాత శాంతి ఏర్పడిందని స్థిరపడినప్పుడు, కాశ్మీర్ ప్రభుత్వమే ఎడ్మిరల్ నిమిట్జ్‌ను నియమించాలి. నిమిట్జ్ తన అధికారాల్ని కాశ్మీర్ ప్రభుత్వంతరఫునే నిర్వహిస్తాడు.

ఇంతవరకూ కాశ్మీర్ ప్రభుత్వం పరిపాలనాధికారాన్ని, సంస్థాన ఐక్యతని, కాశ్మీర్ దేశ సంరక్షణలో భారతప్రభుత్వ బాధ్యతని భద్రతామండలి మన్నించింది. యుద్ధం 1949 జనవరి 1 వ తేదీన విరమించబడింది. కమిషన్‌వచ్చి సైనికోపసంహరణ నిమిత్తం ఉభయదేశాలమధ్యనూ రాయబారాలు నడిపింది. సమాధానం కుదరలేదు.

తరవాత మధ్యవర్తిత్వాన్ని ఏర్పాటుచేస్తూ రెండోతీర్మానం (1950 ఏప్రిల్) చెయ్యబడింది. సర్ ఓవెన్‌డిక్సన్ రాయబారాలు జరిపివిఫలుడైనాడు. డిక్సన్ పాకిస్తాన్ దురాక్రమణకు బాధ్యత వహించాలని మాటవరసకైనా ఒప్పుకున్నాడు. కాని సైనికోపసంహరణ గురించి సమాధానం కుదరడం అసంభవం కాబట్టి, ఎవరిప్రాంతంలోవారి సైన్యాన్ని కొద్దిగా తగ్గించి ఉంచవచ్చునన్నాడు. పాకిస్తాన్ ఆక్రమించిన ప్రాంతంలో పాకిస్తాన్ సైన్యం ఆధ్వర్యం కింద ఆప్రాంతంసంరక్షించ బడాలన్నాడు. సంస్థానాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి, రెండు ప్రాంతాల్నీ, అనగా జమ్మూని భారతదేశంతోనూ, పూంచ్ పశ్చిమ ప్రాంతాన్ని పాకిస్తాన్‌తోనూ ఉంచి, మిగతా కాశ్మీర్ లోయలో తాత్కాలికంగా షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని తొలగించి, ప్లెబిసైట్ ఎడ్మినిస్ట్రేటర్‌కి ఒప్పగించి, ఆ ప్రాంతంలోమాత్రమే ప్లెబిసైట్ జరపాలన్నాడు.

రెండో తీర్మానం వచ్చేసరికి బ్రిటన్ అమెరికాల వైఖరిలో ఒక మార్పు కనిపిస్తుంది. కాశ్మీర్ సంరక్షణలో భారత సైన్యాల కెంత బాధ్యతుందో, పాకిస్తాన్ సైన్యాలకీ అంతే బాధ్యతుందన్నట్లు వాదించాయి. సమాధానం కుదరని పక్షంలో మధ్యవర్తి అన్యమార్గాలు అన్వేషించి రాయబారాలు జరపవచ్చని తీర్మానం సూచించింది. అన్యమార్గాలు అంటే, సంస్థాన విభజన, మధ్యే మార్గాలవంటివి — అంటే బ్రిటన్, అమెరికాలు ఇక్కడ ఒక మెట్టు ముందుకి వెళ్ళాయన్న మాట. అసలు ఈ కారణంవల్లనే డిక్సన్‌మధ్యవర్తిత్వం విఫలమయింది.

[సూర్యనారాయణ]

ఇప్పుడీ మూడో మెట్టు కొత్త తీర్మానంలో, కాశ్మీర్‌లో షేక్ అబ్దుల్లా ప్రభుత్వబాధ్యతని, భారతసైన్యాల దేశ సంరక్షణ బాధ్యతని నిరాదరిస్తున్నారన్న మాట. దీనితో బ్రిటన్ అమెరికాల అసలు లక్ష్యం వ్యక్తమౌతోంది.

1951 జనవరిలో లండన్ కామన్వెల్త్ ప్రధానుల కాశ్మీర్ చర్చలలో ఆంగ్లో–అమెరికన్ వర్గం ఆంతర్యం బైటపడింది. లండన్‌లో ప్రతిపాదించబడినవి స్థూలంగా మూడు మార్గాలు:-1. కాశ్మీర్ దేశరక్షణకి ఆస్ట్రేలియన్, న్యూజీలాండ్ సైన్యాల్ని నియోగించి, ప్లెబిసైట్ ఎడ్మినిస్ట్రేటర్ ఆధ్వర్యంలో ప్లెబిసైట్ జరపడం. దీనివల్ల షేక్ అబ్దుల్లా ప్రభుత్వాధికారాన్ని, భారతసైన్యాల సంరక్షణ బాధ్యతనీ తొలగించడం జరుగుతుంది. చీనా రష్యాల సమీపంలో కల కాశ్మీర్‌లో ఆంగ్లో-అమెరికన్ వర్గరాజ్యాలకు చెందిన సైన్యాలు నిలవరించటంవల్ల కమ్యూనిస్టుదేశాలు సందేహిస్తాయనీ, అసలు విదేశసైన్యాల్ని తిరిగి భారతదేశానికి తీసుకురావడానికి భారతీయులు ఎన్నటికీ సమ్మతించబోరనీ నెహ్రూ స్పష్టపరిచారు. 2. భారతసైన్యాలు, పాకిస్తాన్ సైన్యాలు సమిష్టిగా కాశ్మీర్‌లో శాంతిని కాపాడుతూ, 'అన్యదేశాల దురాక్రమణ" నించి కాపాడాలని రెండో సూచన చెయ్యబడింది. దీనివల్ల పాకిస్తాన్ దురాక్రమణ చేసిందని అంగీకరించకపోవడమే కాకుండా, కాశ్మీర్ సంరక్షణకి పాకిస్తాన్‌కికూడా బాధ్యతుందని అంగీకరించినట్లవుతుంది. అంటే భారత సైన్యాలు ఎవరితో పోరాడి కాశ్మీర్‌ని రక్షించాయో, ఆ పాకిస్తాన్ సైన్యాల్ని ఇప్పుడు ఆహ్వానించడమన్న మాట. దీనికి నెహ్రూ సమ్మతించలేదు.

3. ప్లెబిసైట్ ఎడ్మినిస్ట్రేటర్ (ఎడ్మిరల్ నిమిట్జ్, అమెరికన్ నౌకాదళాధిపతి) ఆధ్వర్యంకింద స్థానికంగా ఒక సైనిక దళాన్ని నిర్మించి, దాని సహాయంతో ప్లెబిసైట్ జరపాలి. అంటే షేక్ అబ్దుల్లా పరిపాలిస్తోంటే, నిమిట్జ్ సైన్యాన్ని నిర్మించి శాంతిసంరక్షణ బాధ్యత తీసుకుంటాడన్న మాట. ఈ సైన్యంలో ఎవరిని చేర్చుకుంటారో తెలియదు. పశ్చిమ పూంచ్ ప్రాంతంలో పాకిస్తాన్ నిర్మించిన సైనిక దళాన్ని ఉపయోగించుకున్నా కాదనడానికుండదు. ఈ మూడో సూచనని కొన్ని మార్పులతో అయితే షేక్ అబ్దుల్లా ప్రభుత్వంతో చర్చించడానికి వీలుండవచ్చని నెహ్రూ చెప్పారు.

ఇప్పుడు బ్రిటన్ - అమెరికాలు ప్రవేశపెడుతున్న తీర్మానం ప్రకారం సంస్థాన ఐక్యతా భావానికీ, భారత సైన్యాల దేశ సంరక్షణ బాధ్యతకీ పూర్తిగా స్వస్తిచెప్పినట్లవుతుంది.

బ్రిటన్ అమెరికాలు ఇంతవరకూ అవలంబిస్తున్న విధానంలోని కొన్ని అంశాలు స్పష్టపడుతున్నాయి:—

1. పాకిస్తాన్ దురాక్రమణ చెయ్యలేదు. 2. కాశ్మీర్ మహారాజు భారతదేశంతో చేరినట్లు చేసిన ప్రకటనను అంగీకరించకూడదు. 3. భారతసైన్యాల సంరక్షణకింద కాశ్మీర్‌లో ప్లెబిసైట్ జరపకూడదు; ఉభయదేశాల సైన్యాలూ ఉపసంహరించబడాలి. అప్పుడే ప్లెబిసైట్ జరపాలి. అంటే కాశ్మీర్‌పైన మళ్లీ ఏ దాడైనా జరిగితే ఏమౌతుందో చెప్పలేరు. వీలైతే విదేశసైన్యాల్ని తీసుకొచ్చి ప్లెబిసైట్ జరపాలి 5. ప్లెబిసైట్ జరిపేటప్పుడు షేక్ అబ్దుల్లా ప్రభుత్వం ఉండకూడదు.

ఈ తత్వానికి మూలం రెండు ముఖ్యభావాలున్నాయి:—1. మహమ్మదీయులు అధికంగా గల కాశ్మీర్‌లో ప్లెబిసైట్ జరిగితే, భారతదేశంలో చేరడం అసంభవం. షేక్ అబ్దుల్లా ప్రభుత్వం కేవలం భారత ప్రభుత్వం చేతి కీలుబొమ్మ. 2. కాశ్మీర్ సంరక్షణ ఇండియా - పాకిస్తాన్లకే కాక ప్రపంచానికంతకీ ముఖ్యం. లడాఖ్ లోయ ద్వారా కమ్యూనిస్టులువచ్చే ప్రమాదం ఉంది. షేక్ అబ్దుల్లా వ్యవహారం చూస్తే కమ్యూనిస్టని అనుమానం. కాశ్మీర్ భారతదేశంతో చేరేకంటె పాకిస్తాన్‌తో చేరితే మంచిది. ఎందువల్లనంటే ప్రపంచ యుద్ధం సంభవించే పక్షంలో, కాశ్మీర్‌లో విమాన స్థావరాలు కావాలంటే, పాకిస్తాన్ ఇవ్వవచ్చునేమో కాని, భారతదేశం ఇవ్వదన్నమాట నిజం.

బ్రిటన్ అమెరికాలు ఈ విధంగా భావిస్తున్నాయనీ, పాకిస్తాన్ పక్షం వహించి షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని పడగొట్టడానికి యత్నిస్తున్నాయనీ మొదటినుంచీ విశదమౌతూనే ఉంది.

షేక్ అబ్దుల్లా ఈ మూడో తీర్మానాన్ని విమర్శిస్తూ, బ్రిటన్, అమెరికాలు పూర్వ తీర్మానాల నియమాలనే ఎలా అతిక్రమిస్తున్నాయో నిరూపించాడు. కాశ్మీర్ జాతీయ ముస్లిం సమావేశం తీర్మానాన్ని అనుసరించి షేక్ అబ్దుల్లాప్రభుత్వం రాజ్యాంగ పరిషత్తు నిర్మాణానికి చేస్తున్న సన్నాహాన్ని బ్రిటిష్ - అమెరికన్ తీర్మానం నిరసిస్తోంది. ఈ యత్నాన్ని మానాలని ఆదేశిస్తూ, మరొక "మధ్యవర్తి"ని నియమించాలని ఈ తీర్మానం సూచిస్తోంది. ఈ మధ్యవర్తి మామూలు మధ్యవర్తి కాదు. (సర్ ఓవెన్ డిక్సన్ కూడా వాస్తవానికి 'మధ్యవర్తి' కాడు. తీర్మానాలలో చెప్పబడిన పేరు 'ఐక్యరాజ్యసమితి ప్రతినిధి') ఈమారు సమితి ప్రతినిధికి కాశ్మీర్‌నుంచి సైన్యాలను ఉపసంహరింప చెయ్యవలసిన బాధ్యతను ఒప్పగించాలి. ఈ ఉపసంహరణ డిక్సన్ నివేదికలో సూచనలనుబట్టి జరపాలి. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంకింద ప్లెబిసైట్ జరపడానికి కార్యక్రమాన్ని ఈ కొత్త మధ్యవర్తి తయారుచేసి ఉభయ ప్రభుత్వాల ఆమోదాన్ని పొందాలి. సైనికోపసంహరణ జరపడానికీ, ప్లెబిసైట్ నిర్వహణకీ అవసరమని తోచినట్లయితే, విదేశీ సైన్యాల్ని తెప్పించడమో, లేక స్థానికంగా సైన్యాన్ని నిర్మించడమో, ఏది అవసరమో పరిశీలించాలి. షేక్ అబ్దుల్లా ప్రభుత్వంపైనా, ఆజాద్ కాశ్మీర్ ప్రభుత్వం పైనా పైపెత్తనం ఎంతవరకూ అవసరం; ఏ ప్రాంతాల్లో ఎంతెంత అవసరం పరిశీలించి నివేదించాలి. సైనికోపసంహరణలోనూ, ప్లెబిసైట్ ఏర్పాట్లలోనూ ఉభయప్రభుత్వాలకూ మధ్య ఏయే అంశాలపైన సమాధానం కుదరడంలేదో వివరించాలి ఆ అంశాల్ని పరిష్కరించడానికి ఒక పరిష్కర్తను భద్రతాసుండలి నియమిస్తుంది.

ఈ తీర్మానంలో గమనించవలసినవి మూడు ముఖ్యాంశాలున్నాయి:—1. సైనికోపసంహరణ 'జరపడంలోనూ', ప్లెబిసైట్‌కి 'ఏర్పాట్లు చెయ్యడంలోనూ' సమితి ప్రతినిధికి తోడ్పడాలని ఉభయప్రభుత్వాలకూ ఆదేశం. 2. స్థానికప్రభుత్వాలపైన పై పెత్తనానికి ఏర్పాటు. 3. ఇదివరలో భారతప్రభుత్వం అనేకమార్లు నిరాకరించినా మళ్లీ పరిష్కర్త ఏర్పాటు.

ఈ మూడు అంశాల్నీ భారత ప్రభుత్వం ఎన్నడూ అంగీకరించదని బ్రిటన్-అమెరికాలకు తెలుసును. కాని, ఆ రెండు దేశాలూ పట్టుబట్టినట్లయితే ఈ తీర్మానాన్ని భద్రతామండలి ఆమోదిస్తుంది. భారతప్రభుత్వానికి ఇష్టంలేకపోయినా, ఒత్తిడితెచ్చి ఈ తీర్మానాన్ని అంగీకరింపచెయ్యాలని బ్రిటన్-అమెరికాలు యత్నిస్తున్నాయి. ఇందుకు కారణం ఆ రెండుదేశాలకూ కాశ్మీర్‌లో స్థావరాల్ని సంపాదించాలని ఆశ ఉండడమే నని అనుమానించక తప్పదు.

యుద్ధంవల్ల కాక, శాంతిమార్గాలద్వారా కాశ్మీర్ సమస్యని పరిష్కరించాలనే ఉద్దేశంతో భారతప్రభుత్వం ఇంతవరకూ భద్రతామండలి తీర్మానాల్ని అంగీకరిం

(6-వ పేజీ చూడండి)


★ రైల్వే బడ్జెట్ ★

[సీతారామ్]

యుద్ధకాలంలో జబ్బుపడిన తరవాత ఇప్పటికి రైల్వేలు బాగా కోలుకుని పుష్టిచెశాయని రైల్వేశాఖా మంత్రి శ్రీ యన్. గోపాలస్వామి అయ్యంగార్ పార్లమెంటులో రైల్వే బడ్జెట్ సమర్పిస్తూ చెప్పారు. రైల్వేలకి పుష్టివచ్చింది కాబట్టి మొదట (1947-48 లో) వాడిన మందు చక్కగా పనిచేసిందన్నమాట. ఆసంవత్సరం రైల్వే ప్రయాణపు ఛార్జీల్ని రూపాయికి అణావంతు హెచ్చించారు. మళ్లీ అదే మందు ఇంకొంచెం ఘాటైనది వాడితే రైల్వేలకేకాదు, ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థకి యావత్తూ రోగం కుదిరి పోతుందని ప్రభుత్వం అంచనావేసింది. ఈ మారు మూడో తరగతి ప్రయాణపు ఛార్జీలు మైలుకి పైసవంతున హెచ్చించడానికి తలపెట్టారు. ఇంటర్ ఛార్జీలు మైలుకి ఒకటిన్నర పైసలు, రెండో తరగతికి రెండుపైసలు, మొదటి తరగతికి మూడుపైసలు హెచ్చిస్తారు. మైలుకి పైసలలెక్క మాట అట్లా ఉంచి, ఇప్పుడిస్తున్న రేట్లలో రూపాయికి ఎంత పెరిగాయని లెక్కగట్టితే, మూడో తరగతి పాసింజర్ పయాణీకులు ఇదివరలో రూపాయి చెల్లించే చోట రూపాయి పావలా చెల్లించవలసి వస్తుంది. మెయిల్ ప్రయాణీకులు రూపాయికి బదులు రూపాయి మూడణాల రెండున్నర పైసలు చెల్లించాలి. ఇంటర్ పాసింజర్ ప్రయాణీకులు రూపాయి చెల్లించేచోట రూపాయి మూడణాల రెండున్నరపైసలు చెల్లించాలి. మెయిల్ ప్రయాణీకులు రూపాయి రెండణాల ఎనిమిది పైసలు చెల్లించాలి. రెండో తరగతి ప్రయాణీకులు రూపాయికి బదులు రూపాయి రెండణాల మూడున్నర పైసలు చెల్లించాలి. మొదటి తరగతి ప్రయాణీకులు రూపాయికి బదులు రూపాయిబేడ చెల్లించాలి.

అంటే ఈమాటు రేట్లుహెచ్చింపు మందు రైల్వేలకి పుష్టి నిస్తే, మూడోతరగతి ప్రయాణీకుల జేబులు ఖాళీ అవుతాయన్నమాట. మంత్రిగారి అంచనా ప్రకారం ఈ హెచ్చింపు వల్ల రాగల హెచ్చు ఆదాయం మొత్తం 19 కోట్ల రూపాయల్లో 18 కోట్ల రూపాయలు మూడో తరగతి ప్రయాణీకులవల్లనే వస్తుంది.

ఈ హెచ్చింపు లెక్కలోకి తీసుకుని 1951–52 లో ఆదాయం రు 279½ కోట్లు, ఖర్చు రు 185 కోట్ల 75 లక్షలు మిగులు రు 21 85 కోట్లు అంచనా వేశారు. 1950–51 లో ఆదాయం రు 263 కోట్ల 40 లక్షలు (ఇదివరలో వేసిన అంచనా 232 కోట్లుపైగా ఉంది). ఖర్చు మొదట వేసిన అంచనా రు 166 కోట్ల 59 లక్షలైతే ఇప్పుడు వాస్తవంగా చేసున్న ఖర్చు రు 180 కోట్ల 31 లక్షలు. అంటే ఈ సంవత్సరం మొదట రు 14 కోట్ల ఒక లక్ష



చింది. కాని, ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధంగా ఇటువంటి సూచనల్ని బ్రిటన్-అమెరికాలు బలవంతాన ఒప్పింపచెయ్యడానికి చేస్తున్న యత్నం వృధాకాక మానదు. భద్రతామండలి బ్రిటన్-అమెరికాల ఒత్తిడివల్ల ఈ తీర్మానాన్ని ఆమోదించినప్పటికీ, అమలు జరపడానికి భారత ప్రభుత్వానికి నిరాకరించగల అధికారం ఉంది. దేశరక్షణకు సంబంధించిన సైనికోపసంహరణ సమస్యని పరిష్కర్త నిర్ణయానికి ఒప్పగించడానికి నిరాకరించగల హక్కు అంతర్జాతీయ న్యాయశాసనంలో గుర్తించబడింది. ప్లెబిసైట్ జరపాలంటే షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని తొలగించాలనడం అక్రమం. ఈ రీతిగా ఏ దేశంలోనూ జరగదు. అమెరికాలో ఎన్నికలు జరిపే ముందు ట్రూమన్ ప్రభుత్వం రాజీనామా ఇవ్వాలంటే ఎలా వుంటుందో, ప్లెబిసైట్ జరిపేముందు షేక్ అబ్దుల్లా ప్రభుత్వం తొలగిపోవాలంటే అలా వుంటుంది. కాశ్మీర్ మహారాజా కోరికను మన్నించినప్పుడు భారతప్రభుత్వం ప్రజాభిప్రాయం తెలుసుకోడానికే షరతు పెట్టింది కాని, ప్లెబిసైట్ జరపాలని చెప్పలేదు. అందువల్ల రాజ్యాంగపరిషత్తు నిర్మాణాన్ని నిరసించి లాభం లేదు.

బ్రిటన్ - అమెరికాలు పాకిస్తాన్‌పక్షాన చేరినట్లు నటించి, విదేశసైన్యాల పేరుతో శ్వేతజాతుల సైన్యాన్ని కాశ్మీర్‌కి తెచ్చి, ఆపైన ప్లెబిసైట్ జాప్యమై, అక్కడే స్థిరపరచడానికి చేసేయత్నం ఎన్నడూ సఫలం కాదు. ఈ దేశాల ఈ తత్వం మారినప్పుడే భద్రతామండలి కాశ్మీర్‌లో శాంతి నెలకొల్ప గలుగుతుంది. ★

మిగులుతుందని అంచనా వేసుకున్నా, రు 14 కోట్ల 24 లక్షలు మిగులుతుం దన్న మాట.

మన దేశంలో రైళ్లు పరుగెత్తడం మొదలెట్టింది మొదలు ఎన్నడూ ఇంత రాబడి రాలేదు. రాబడి బాగా పెరిగిపోవడం మొదలైనది 1949-50 లో. 1950-51 లో అంతకంటె ఎక్కువొచ్చింది, 1951-52లో ఇంకా ఎక్కువొస్తుంది. రాబడితో ఉజ్జీగా ఖర్చూ అలాగే పెరిగిపోతోంది. పెరగని వల్లా మూడోతరగతి ప్రయాణీకుల సదుపాయాలు మాత్రమే

అయితే ఒక్క విషయాన్ని మాత్రం చెప్పాలి. ఇకమీదట రైలుఇంజన్లు,కోచీలు, వాగన్లు విదేశాలనుంచి కొనుక్కోడం చాలా కష్టమైపోతుంది. వీటెవంత మటుకు ఇప్పటే కొనెయ్యడం, ఈ పైన మన కవసరమైన ఇంజన్లు,కోచీలూ,వాగన్లు మనమే తయారుచేసుకోడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. యుద్ధం వచ్చినా రాకపోయినా అన్నిరకాల సరుకులికీ కొటకం వచ్చి పడుతూనే వుంది. యూరప్‌నించీ, అమెరికానించీ యంత్ర పరికరాలు, ఇనప సామాన్లు వగైరా ఇంక రావని ధృవపడుతోంది. కాబట్టి ముందు జాగ్రత్త పడ్డం మంచిదే.

కాని ఈ ముందు జాగ్రత్తకోసం ప్రయాణపు రేట్లు హెచ్చిస్తున్నారని మంత్రిగారు చెప్పలేదు. ప్రభుత్వానికి ఇతర త్రా ఆదాయం చాలడంలేదు కాబట్టి హెచ్చిస్తున్నా రన్నారు. అదీ కాక మధ్యతరగతి జనం దగ్గిర డబ్బు ఎక్కువుంపనీ, వాళ్ల దుబారా ఖర్చువల్ల వస్తువుల ధరలు పెరుగుతున్నాయి కాబట్టి ఖర్చుచెయ్యగల సత్తా కొంత తగ్గించి జనాన్ని నీరసింపచేస్తే, వస్తువుల ధరలు అట్టే పెరగకుండా ఉంటాయనీ కూడా మంత్రిగా రన్నారు. మూడో తరగతిలో ప్రయాణంచేసే జనంలో అత్యధిక సంఖ్య వస్తువుల్ని ఉత్పత్తిచేసే వాళ్లేననీ, వాళ్లు తయారీ చేస్తున్న వస్తువుల అమ్మకపు ధరలు పెరిగినందువల్ల వాళ్ల ప్రయాణపుఖర్చు లెక్కువ చేసినా ఇబ్బంది లేదనీ అన్నారు. ఇది నిజమేనా? నమ్మడం కష్టం. ప్రయాణీకుల్లో ఉద్యోగాలు చేసేవాళ్లు, విద్యార్థులు, తిరపతి యాత్రీకులూ, వర్తకులు, మొదలైనవాళ్లు ఎక్కువగా కనిపిస్తారా లేక రైతులు, ఇతర ఉత్పత్తిదారులూ కనిపిస్తారా? ఈ రోజుల్లో ఏ వృత్తిలో వాళ్లు ధనం ఎక్కువ ఆర్జిస్తున్నారు ? వర్తకులు, మిల్లర్లే నని చెప్పాలి. తుంటిమీద కొడితే పళ్లు రాలివట్లు, ధరలు పెరగడానికి వర్తకులు, మిల్లర్ల లాభాలు లావవడం కారణమైతే, రోజురోజుకీ నీరసించిపోతున్న ఇతర జనం దుబారాఖర్చు కారణ మనడం ఏమిటి ? రైల్వే ప్రయాణపురేట్లు పెరిగినమట్టుకు ఖర్చుని వర్తకులు వర్తకంలో లాగేస్తారు. ఆట్టే మాట్లాడితే ప్రయాణం చార్జీలు రూపాయికి పావలా పెరిగినందుకు అరణాలు లెక్కగట్టి వస్తువుల అమ్మకం ధరల్లో కలిపి గుంజేస్తారు. బియ్యం ధర పెరిగిందంటూ సబ్బుల ధర పెంచెయ్యడం చూస్తూనే ఉన్నాం.

ఇన్‌ఫ్లేషన్ (ధరల పెరుగుదల) ఇక్కడుంది, అక్కడుంది అంటూ ప్రభుత్వం ఇక్కడోకసారి, అక్కడొకసారి మొత్తడం, అదివెళ్లి నేరుగా ఏ పాపం ఎరగని (అంటే బ్లాక్‌మార్కెట్ లాభాలుకాని ఏ లాభాలుకాని ఎరగని) మామూలు సంసారి నెత్తిపైన రెండింతలు మోపుగా పడ్డం జరుగుతోంది.

దక్షిణాది రైల్వే

1950 జూన్‌లో భారత ప్రభుత్వం చేసిన ప్రకటనననుసరించి భారత దేశంలోని రైల్వేల పునర్వర్గీకరణకి 1951 ఏప్రిల్ 1 నుంచి ఉపక్రమిస్తున్నారు. ముందుగా దక్షిణాదినున్న రైల్వేల్ని ఏకం చేస్తున్నారు. దేశంలో ఉన్న మొత్తం 21 రైల్వేలనీ కలపోసి ఆరు వర్గాలుగా నిర్వహిస్తారు. ఇందులో మొదటిది దక్షిణాది రైల్వే. సౌత్ ఇండియన్ రైల్వే (2, 349 మైళ్లు); యం. యస్. యం. రైల్వే (2938 మైళ్లు) మైసూరు స్టేట్ రైల్వే (712 మైళ్లు) కలిపి దక్షిణాదిరైల్వే (5999 మైళ్లు) అవుతుంది. దీనివల్ల పూనా, రాయచూర్, వాల్తేరు పట్టణాలకి దక్షిణంగా ఉన్న ప్రాంత మంతా ఒక్క సంస్థ నిర్వహణ కిందికి వస్తుంది.

వర్తక వ్యాపారాల రీత్యా చూస్తే యం. యస్. యం. రైల్వేని దక్షిణాన ఉన్న రైల్వేతో కలిపితేనే మేలని వాణిజ్య సంస్థల అభిప్రాయం. నైజాం స్టేట్ రైల్వే (1396 మైళ్లు) తో కలిపితే వ్యాపార రీత్యా ఎటువంటి ప్రయోజనం ఉండేదో తెలియదు. కాని తెలుగు మాతృభాషగా కల దేశం అంతా ఒక్క రైల్వే కిందికి వచ్చేది. దక్షిణాదికీ, సర్కారుజిల్లాలకీ మధ్యఉన్న రైల్వే రవానా సదుపాయం రాయలసీమకీ సర్కారుజిల్లాలకీ మధ్య లేదు; సర్కార్లకీ తెలంగాణాకీ మధ్య లేదు; సర్కార్లలో పండే ధాన్యంలో చాలావరకు తమిళజిల్లాలకే పడుతోంది కాని రాయలసీమకీ, తెలంగాణాకీ వెళ్లడం లేదు. తెలంగాణా, రాయలసీమ, సర్కార్లని కలిపే రైల్వే సౌకర్యం బొత్తిగా లోపంగా ఉన్నందు వల్లనే ఈ మూడు ప్రాంతాలూ వ్యాపార రీత్యా అంత సన్నిహితంగా లేవు. సర్కార్లతో రాయలసీమకి రైల్వే సదుపాయం మచిలీపట్నం- మార్మగోవా మీటర్ గేజ్ లైన్ తప్ప, ఇంక చెన్నపట్నం సికిందరాబాద్‌ల ద్వారానే ఉంది. పై మీటర్ గేజ్ లైన్‌లో రవానా సదుపాయం ఎలావుందో చెప్పడం కంటె ఊరుకోడం మేలు.

తమిళ్నాడులో యస్. ఐ. రైల్వే సదుపాయం చక్కగా ఉంది. యం. యస్. యం. రైల్వేమార్గం యస్. ఐ. రైల్వేకంటె 589 మైళ్లు ఎక్కువున్నప్పటికీ, 1949-50 లెక్కల్ని బట్టి మనరైల్వేలో 9 కోట్ల 73 లక్షలమంది ప్రయాణం చేస్తే, యస్. ఐ. రైల్వేలో 12 కోట్ల 45 లక్షలమంది ప్రయాణం చేశారు. మలబారు మినహా యస్. ఐ. రైల్వే ఉన్న ప్రాంతానికి, యం. యస్. యం. ఉన్న ప్రాంతం రెండున్నర రెట్లుంది.

తమిళ్నాడులో ఉన్న రైల్వే రవానా సౌకర్యం ఆంధ్రదేశంలో కాని, మలబార్‌లో కాని, కన్నడదేశంలో కాని లేదు.

ఇప్పుడు అంతా ఏకం చేస్తున్నందువల్ల మన ప్రాంతంలో కూడా రవానా సౌకర్యం తమిళ్నాడుతో సమానంగా వృద్ధి అవుతుందో, లేక తమిళ్నాడు మన స్థితికే దిగజారిపోతుందో, లేక మన ప్రభుత్వం చూపుతున్న మాదిరిగా పక్షపాతానికి దిగుతారో చూడాలి. ★

అదీ-ఇదీ

న్యూ స్టేట్స్మన్ అండ్ నేషన్' పత్రికలో ప్రసిద్ధ బ్రిటిష్ రచయిత జి. డి. హెచ్. కోల్ కొరియా మొదలైన సమస్యల్నిగూర్చి ఇటీవల ఒకవ్యాసం వ్రాశాడు. పాఠకుల్లో ఈ వ్యాసం చాలా ఆసక్తిని కలిగించిందనీ, తమ కార్యాలయానికి చేరిన అనేక లేఖల్లో ప్రజల యుద్ధప్రతికూల వాంఛ బలీయంగా వ్యక్తమౌతోందనీ, బ్రిటిష్ ప్రభుత్వం స్వతంత్రశాంతి విధానాన్ని అనుసరించలేక అమెరికాకు లొంగిపోవటంవల్ల తన అభిమానులకు తానే దూరమౌతున్నట్లు వ్యక్తమౌతోందనీ ఆ పత్రిక సంపాదకీయంలో వ్రాసింది. జి. డి. హెచ్. కోల్ వ్యాసం సంగ్రహంగా ఇక్కడ పొందు పరుస్తున్నాము :

కొరియా యుద్ధం ప్రారంభం కాక ముందు అమెరికన్లు కొరియానుంచి ఉపసంహరించుకున్నారని అంతా అనుకున్నారు. యుద్ధంవస్తే దక్షిణకొరియాని రక్షించటం లాభసాటి కాదనికూడా అమెరికన్లు బహిరంగంగా చెప్పారు. ఈ విషయాన్ని నమ్మబట్టే దక్షిణకొరియాను రెండు రోజుల్లో జయించెయ్యవచ్చనీ, అమెరికా కలగ జేసుకోదనీ ఉత్తరకొరియా పొరబాటుగా అంచనా వేసింది.

జనరల్ మెకార్థర్ ఎవరిమాటా లెక్కపెట్టే స్వభావమున్నవాడు కాదు. అందుచేతనే అమెరికా కొరియానుండి ఉపసంహరించుకున్నదనే విషయాన్ని నేను నమ్మలేదు.

ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవలసినంత "దురాక్రమణ" ఉత్తరకొరియా చేసిందని కూడా నేనెప్పుడూ నమ్మలేదు. 38 వ అక్షాంశరేఖ ఏ దృష్ట్యా చూసినా అంతర్జాతీయ సరిహద్దు కాదు. కొరియా యుద్ధాన్ని నేను అంతః కలహంగా మాత్రమే భావించాను. ఉత్తరకొరియన్లకు రష్యా, దక్షిణకొరియన్లకు అమెరికా ఆయుధాలు సప్లయి చేసినట్లు నాకు తెలుసు. కాని, ఇది రెండుదేశాల మధ్య యుద్ధంగా గాని, ఐక్యరాజ్య సమితి కలగ జేసుకోవచ్చని గాని నేను ఎప్పుడూ భావించలేదు.

కమ్యూనిజమ్ను, ఓడించటానికి పశ్చిమ రాజ్యాలు, ముఖ్యంగా అమెరికా తయారుచేసుకున్న ఆయుధాలలో సమితి ఒకటి కావటం వల్లనే ఇది సంభవించింది.

కొరియా యుద్ధం అంతర్యుద్ధంగనకనే, నేను ఉత్తరకొరియా గెలవాలని కోరుకున్నాను. దక్షిణకొరియా ప్రభుత్వం అభ్యుదయ నిరోధకమైన కీలుబొమ్మ ప్రభుత్వం అమెరికా మద్దతు లేనిదే అది ఒక్క నిమిషంకూడా బతక లేదు.

నాకు కమ్యూనిజమంటే ఇష్టంలేదు. కాని, ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా భూస్వామిక నిరంకుశత్వాన్ని పరాయివాళ్లెవరో కొరియానెత్తిపై రుద్దటం అసలిష్టంలేదు. అందుచేత అప్పటి దుస్థితినుంచి బయటపడటానికి- ఉత్తరకొరియన్ ప్రభుత్వంకింద కొరియా ఏకం కావటమే ఏకైక మార్గమని నాకు తోచింది. చైనా మీద దురాక్రమణ చెయ్యాలనుంటే తప్ప అమెరికా కొరియాలో కలగజేసుకోదేమో ననుకున్నాను.

అమెరికా సాయుధ జోక్యం చేసుకొని సమితిని అందులోకి ఈడవటం చాలా దుష్టకార్యమనీ, బ్రిటన్ మొదలైన దేశాలు అమెరికాను సమర్థించ రాదనీ నేను భావించాను.

భద్రతా మండలిలో రష్యా లేకుండా చూసి, అక్రమ చైనీస్ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని - అమెరికా ఐక్యరాజ్య సమితిని దుర్వినియోగ పరుచుకోవటం నాకు తుచ్ఛమనిపించింది. ఫార్మోజాలో అమెరికా చేసిన పని మరీ తుచ్ఛమని నేను భావించాను. (బ్రిటిష్ప్రభుత్వం ఈ విషయంలో తటస్థంగా ఉన్నప్పటికీ)

అమెరికన్ సైన్యాలు మన్నికూడా ఈడ్చుకుంటూ, మంచూరియా సరిహద్దును సమీపించినప్పుడు చైనా జోక్యం చేసుకుంది. కాని, చైనాపై నేను నిందవెయ్యలేకపోయాను. మంచూరియన్ పరిశ్రమలను తక్షణం ధ్వంసం చెయ్యాలని అమెరికా అనుకొని ఉండకపోవచ్చు. కాని కొరియానంతనీ ఆక్రమించుకోటం, అటు ఫార్మోజాను కూడా గుప్పిట్లో పెట్టుకోవటం చూస్తే అమెరికన్లు కమ్యూనిస్టు చైనాపై యుద్ధానికి తయారవుతున్నారనీ, ఆతర్వాత ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజమ్ను ఓడించటానికి చేసే, ప్రయత్నాల్లో ఇది మొదటి మెట్టు అనీ నేను భావించాను.

ఈ చర్యలన్నీ ఉపద్రవకరమైనవనే నేను అభిప్రాయపడ్డాను. ఎందుకంటే వీటివల్ల ఆసియాలో కమ్యూనిజమ్ పలుకుబడి తగ్గటానికి బదులు బలపడుతోందనీ, అమెరికన్, తదితర పశ్చిమరాజ్యాల సామ్రాజ్య పిపాసనుంచి తమ్ము రక్షించేది కమ్యూనిస్టు చైనా ఒక్కటే నన్న భావం ఆసియాలో ప్రబలుతోందనీ నేను భావించాను.

దూరప్రాచ్యంలో పరిస్థితులు ఇంత దుష్పరిణామంలో ఉండగా, అటు యూరప్లో పరిణామాలు మరింతఉపద్రవించాయి. పశ్చిమ జర్మనీని పునరాయుధీకరించటానికి నాతో పాటు అధిక సంఖ్యాకులైన బ్రిటిష్ ప్రజలు వ్యతిరేకిస్తారనుకుంటాను.

జర్మన్లకు ఆయుధాలిస్తే వాళ్లు చివరికి ఎవరిపక్షాన పోట్లాడతారో సందేహాస్పదం. పైగా జర్మన్ పునరాయుధీకరణంవల్ల జర్మనీలో పూర్వంకంటే హేయమైన అభ్యుదయ నిరోధక మిలిటరీ శక్తులు అధికారంలోకి వస్తాయి. అంతేకాదు—జర్మనీ మరో కొరియాగా తయారవుతుంది.


ఈ పరిస్థితుల్లో సోషలిస్టులు, లేబరుపార్టీ అభిమానులు ఏం చెయ్యాలి?

మార్షల్ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత పరిస్థితులు చెడటానికి చాలా మటుకు రష్యాయే కారణం. కాని, ఆతర్వాత ముఖ్యంగా చైనాలో కమ్యూనిస్టులు విజయం పొందిన తరవాతనుంచీ పరిస్థితులు విషమించటానికి ప్రధాన బాధ్యత అమెరికాదే. నా పూర్వానుభవాలవల్ల నాకు కమ్యూనిస్టులంటే చాలా అనుమానం. నేను రష్యాతోనూ, పశ్చిమ కమ్యూనిస్టులతోనూ కలిసి అమెరికన్లను వ్యతిరేకించబోవడం లేదు. ఈ రెండు పక్షాలకూ వ్యతిరేకంగా శాంతికోసం, ప్రజాస్వామిక సోషలిజం కోసం పనిచెయ్యదలుచుకున్నాను.

అయితే, నాకు తోచింది వ్రాయటం తప్ప, మరేవిధంగా ఈ ధర్మం నిర్వహించగలనో నాకింకా తెలియదు.

కాని ఒకటిమాత్రం నిశ్చయంగా చెప్పగలను. అమెరికన్లతో కలిసి బ్రిటన్ గనక

(48-వ పేజీ చూడండి)



"కారణజన్మ"

వి. డి. ప్రసాదరావు

(ప్రతిష్ఠాన పుర పరిసరాల్లో ఒంటరిగా ఉన్న ఇల్లు. వాసతి జబ్బుతో మంచం మీద వుంటుంది. నాగనిక పరిచర్యలు చేస్తూంటుంది. రాజబాటమీద ఎడతెగకుండా ప్రజా సమూహం, బళ్ళతో తరలి వెళ్లిపోతూన్న కోలాహలం, ఆర్తరావాలు, ఒక్కొక్క జట్టు రాజభటులు వాళ్లను దోచుకుని కొల్లగొట్టూ ప్రతిష్ఠానపురంలోనికి పోతున్న సంరంభం, ప్రజల దీనాలాపాలు, "ఈ సుశర్మ కౌణ్వుని దుష్టపరిపాలన ఎప్పుడంత మొందుతుందో దేవా అని ఆర్తనాదాలు, మధ్య మధ్య వినిపిస్తూ ఉంటాయి.)

నాగనిక: అమ్మా! ఈ జావ కాస్త తాగు.

వా: వద్దమ్మా. గుటక పడటమే చాలా బాధగా ఉంది. పాపం నిన్ను యమయాతన పెట్టూ ఇక్కడ బంధించేశాను.

నాగ: అమ్మా! పరాయి దాన్నన్నట్లంటావు-తల్లివి నువ్వీస్థితిలో ఉండగా సేవ చేయటంకూడా మహాభారమేనా? నిజమే, ప్రపంచం అల్లాగే అయిపోయింది. మాతాపితృసేవ లేదు. వృద్ధసేవనం లేదు. దయాదాక్షిణ్యాలు లేవు. ధర్మబుద్ధి లేదు వర్ణాశ్రమ ధర్మాలు కాపాడే నాథుడు లేడు' 'ధనమూల మిదం జగత్తా'యి పోయింది. ఎంతటి నీచుడయితే అంత ప్రసిద్ధి లోకంలో- ప్రతిష్ఠాన పురంలో ఇనాళ్ళ సత్పురుషుడన్న వాడికి నిలువ నీడ లేకుండా పోయింది.

వాస: పిచ్చితల్లీ! ఈ నాడుకాదు ఆనిలువ నీడ లేకుండా పోవటం, నా "సినుకుడు" జన్మించిన నాటికే పోయింది; దిక్కులేని పసిపాపవుగా నువ్వు నాపాల బడ్డ నాటికే పోయింది.

నాగ: అమ్మా! ఏమిటమ్మా! ఇల్లా అంటున్నావు - నేను నీ కూతుర్ని కానా, నీవు నా తల్లివి కావా?

వాస: (పక్కాహాసంతో) కావు తల్లీ కావు! ఈ వాసతి మాతృత్వం పేరిట నిన్ను మోసపుచ్చి నీ చేత, సర్వసేవలూ అందుకొంటూంది.

నాగ: (దీనంగా) అమ్మా! నే నెవరను -

వాస: ఏ తల్లి బతికుంటే, కౌణ్వవంశీకులు సర్వులూ పునీతులై ఉండేవారో; ఏ తల్లిని హింసించి కౌణ్వవంశం తన ఈ విపరీత భవిష్యత్తుని చే జేతులా తెచ్చుకోనుందో, ఆ మహాయిల్లాలి కుమార్తెవు. అమ్మా! నీ తండ్రి నీ తల్లిని హింసించి నీచ స్త్రీలోలుడై పురిటి ఇల్లాలికే విషంపెట్టి చంపచూచాడు. ఆ దుస్థితిలో నే, ఆ అసూర్యంపశ్య అర్ధరాత్రివేళ రాజాంతఃపురం వీడి వచ్చి, త్రోవను కనబడ్డ నా చేతుల్లో నిన్ను బెట్టి భద్రమని ఆదేశించి, అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. నీ చిన్ననాటికే నీ తండ్రిని జ్ఞాతులు హత్య చేసి, రాజ్యం ఛిద్రం చేసుకొని, ఎవరికి వారు ముక్కలు చెక్కలుగా పాలించుకోజొచ్చారు.

నాగ: అమ్మా! ఇన్నాళ్లూ నాకీ మాట చెప్పలేదేమమ్మా? -

వాస: ఈ రహస్యం ఏమాత్రం బయలుపడినా, ఈదుష్ట ప్రభువు లెవరూ నీ ప్రా

కాలు నిలవనిచ్చేవారు కారు తల్లీ. (కంఠం సంతోషమయ మెువర్చుకుంటూ) అదీ కాక సిముకుని తల్లిగా నాస్వార్థం కూడా చాలా ఉందమ్మా—

అదేమిటి- అలా తలవాలుస్తున్నావు? దుఃఖమా నావెర్రి తల్లికి?

నాగ: దుఃఖమేమీ లేదమ్మా! నువ్వు నాతల్లివి కావనుకోటమే స్వల్పదుఃఖం.! అయినా, కన్నతల్లి ఎవరో నే నెరుగను. పెంచిన దానివైనా, నే నెరిగిన తల్లివి నువ్వే.

వాస: ఏమి పెంపమ్మా! ఈ పెంపకం వల్ల నాతోపాటు సంఘ బహిష్కృతురాలివిగా చేసి నీకూ నరకం ఏర్పరిచాను. ఆనాడే నిన్నెవరికో అప్పగించి పెంపించ వలసింది- ఫ్చ్, తల్లీ, ఈ పాపానికి క్షమించు.

నాగ: అల్లా ఇచ్చిఉంటే యీనాటికీ క్షమించలేకుండా ఉండేదాన్ని— అమ్మా! సిముకుడు నిన్ను విడిచి ఎందుకు వెళ్ళిపోయాడు? అయిదేళ్లయి పోయిందికదా నీకింత జబ్బుగా ఉందని తెలిసైనా రాడా!

వాస: ఎల్లా తెలుస్తుందమ్మా? తెలిసినా రాడేమో. ఆనాడు ఇక నా మొగం చూడనని తిట్టి, ఉద్రేకంతో వెళ్ళిపోయాడు. హుఁ. నాకొడుకు కారణజన్ముడు కనుక నే సర్వ ప్రపంచ బహిష్కృతినీ సహించాను. నాకొడుకు కూడా నన్ను బహిష్కరించినా సహించాను. బహుశా వాడి జన్మ సార్థక మయ్యేందుకు తల్లి చీర కొంగును వేలాడుతూ కూచోక అలా వెళ్లిపోవడమే తగునేమో—

నాగ: అమ్మా! సిముకుడు ప్రతిష్ఠానపుర యువకులను వెయ్యిమందిని చేరదీసి, ఆ పిరికి బొందెలలో ధైర్యం ప్రతిష్ఠ చేసి, అజేయమైన సైన్యం తయారు చేశాడని నిన్నా, మొన్నా ఊరిలో చెప్పుకొన్నారు.

వాస: (సంతోషంతో) నిజమా! తల్లీ, నిజమా. నా ఆశయం ఫలోన్ముఖం కానుందా - సిముకుడు ప్రతిష్ఠానపురంలో ఉన్నాడా -

నాగ: ఎవ్వరికీ కనబడడట - కాని ప్రతి నిత్యం, ప్రతిష్ఠాన పురంలో ఎక్కడో, ఒక ఋషీ, సిముకుడూ ప్రత్యక్షం అవుతూ ఉంటారట - రాజభటులు వేయి కన్నుల వెతుకుతున్నా వారికి కనబడరట - పురంలో పెద్దలంతా అడలుతూ ఇళ్లల్లో దాక్కునే వారట. యువకులు జడుస్తూ జడుస్తూనే అక్కడ చేరతారట - కాని-ఆ ఋషినీ, సిముకుణ్ణి ఒకసారి చూసి వారి మాటలు విన్న యువకులలో ఇక పిరికితనం ఉండబోదట - ఆ రాత్రే వాళ్లిద్దరి వెంటా పడి, పది యోజనాల దూరంలో ఉన్న దండకాటవికే యీ యువకు లంతా వెళ్తారట.

వాస: (సంతోషంతో) నిజమా.

నాగ: నిజ మమ్మా! కాని మర్నాడు రాజ భటులు, ఆ ఇళ్లపై దాడి చేశారట, ఆ కుటుంబాలని హింసించారట, చివరకి ఈ ప్రజాహింస పెరిగిపోయి ప్రతిష్ఠాన పురంలో ఒక్క కుటుంబం కూడా నిలవ లేని స్థితిలో ఉంది - అదిగో అదే రాజ బాటమీద ఈ సంరంభం. ప్రజ లంతా సంసారాలు బళ్లమీద తరలించుకు పోతున్నారు -

వాస: మధ్యమధ్య ఆ హాహా కారా లేమిటీ -

నాగ: రాజసైనికులలో నీతి నియమాలు సంపూర్ణంగా నశించాయి. కాంతా కనకాలు, ఎక్కడ లభ్యమైతే అక్కడల్లా తమ ఆయుధ బలాన్నీ, అధికార బలాన్నీ, ఉపయోగించి, పారిపోతున్న ప్రజని తరిమి తరిమి వెంటాడి దోచుకుంటున్నారు.

వాస: ఛీ: ఛీ! ఈ ప్రజలలో ధైర్యంగా ఎదురు తిరగగల వారేలేలా!

నాగ: అమ్మా, యువకులంతా సిముకుని పరివారంలో ఉన్నారు. సిముకుడు ప్రతిష్ఠాన పురంపై దండెత్తటానికి ఇంకా ఆ ఋషి ఆజ్ఞ ఇయ్యలేదట.—

వాస: ఎవ రమ్మా ఆ ఋషి—

నాగ: ఆయన ఆంధ్రర్షిట. గంగా, గోదావరీ మధ్యదేశాన్న పురాణాలు రాయిస్తూ, ధర్మపక్షానికి పోరాడేందుకు "ఆంధ్ర సైన్యం" అంటూ తన పేరిట పోగు చేసుకుంటూ వస్తున్నాడట—

వాస: ధన్యురాలను, నా తండ్రిమాటలు ఫలించబోతున్నాయి-నా బ్రతుకులో నేను పడ్డ కష్టాలు ఇక లెక్కకు రావు. ఇక నా ప్రాణాలు వదిలినా సంతోషంగానే వదలగలను- హుఁ అబ్బా!

నాగ: అమ్మా! అమ్మా! ఈ నీరు త్రాగమ్మా.

వాస: ఆ. ఫరవాలేదమ్మా, తేరుకున్నాను.

(దండనాథుడు-రాజభటులు ప్రవేశం.)

దండనాథుడు: ఎవరీ ఇంట్లో? సిముకుడి ఇల్లు ఇదేనా?

భటుడు: ఏయ్, అమ్మీ. నిల్చోండి. దండనాథులముందర ఏమిటీ పొగరుమోతుతనం—

నాగ: ఎవరయ్యా నీవు? ఎంతటి రాజభటులైనా, స్త్రీని గౌరవించటం ఎరగరా—

భటుడు: నోర్ముయ్యి ముందు - ఏయ్ ముసలీ, లేచి నించో, సిముకుడి తల్లివి నువ్వేనా? చెప్పు. సిముకుడు ఎక్కడ ఉన్నాడో చెప్పు.

నాగ: అయ్యా, ఆమె మరణావస్థలో ఉంది - సిముకుడు ఇక్కడ లేడు పొండి.

దండ: ఈ పిల్ల ఎవరు? దీన్ని పెడ రెక్కలు విరిచి కట్టండిరా.

వాస: అయ్యా, వృథాగా దురాగతాలకు దిగకండి - సిముకుడి తల్లిని నేనే- కాని సిముకు డిక్కడ లేడు; ఇక్కడకు రాడు -

దండ: ఈ దొంగ మాటలు కట్టిపెట్టి నిజం చెప్తావా, చెప్పవా? సిముకు డెక్కడున్నాడో చెప్పు!

(చబుకుతో ఒక్క దెబ్బ వేస్తాడు.)

వాస: (బాధతో) అమ్మా (అని మూలుగుతుంది.)

నాగ: ఛీ దుర్మార్గుడా. నీకు చేతులెలా వచ్చాయి? ఆ కొరడా నీ చేతులో ఉండనీయను. (అంటూ చబుకు లాక్కుని దండనాథునిపై విసురుతుంది.)

దండ: (దండనాథుడు కోపంతో) ఆఁ! అంత పొగరా! అరికాల రాస్తాను. జాగ్రత్త...

(బయటనించి సిముకుని కంఠం.)

సిముకుడు: ఆగూ!

భటులు: (భయంతో) ఆ! ఆ! సిముకుని సైన్యం చుట్టుముట్టింది. సిముకా! సిముకా! రక్షించు -

అరుగో ఆంధ్రర్షులు. స్వామీ రక్షించండి.

దండ: ఛీ దరిద్రుల్లారా! ఈ సిముకుడినీ, ఈ ఆంధ్రర్షినీ కూడా అంతమొందిస్తాను. నా ప్రతాపం చూసుకోండి—

ఆంధ్రర్షి: దండనాథా! ఆడవాళ్లమీద చెయ్యిచేసుకున్నంత తేలిక కాదు. అమ్మా! వాసరీ నమస్కారము.

వాస: అయ్యా. తప్పు. తప్పు. ఆంధ్రర్షులకు ఈ దీనురాలి నమస్కారము—

సిముక: దండనాథా! ఇప్పటికి ప్రాణాలు నిలవాలంటే అస్త్రశస్త్రాలు అక్కడ పెట్టు—

దండ: ప్రతిష్ఠానపుర దండనాథుడు, మగధ సామ్రాట్ కాణ్వాయన వంశ పారా

శాతవాహన పూర్ణచంద్రుడు సుశర్మ సామ్రాట్టుల ప్రతినిధి- రాజద్రోహులైన నీచులకూ కులటా పుత్రులకూ—...

సిముక: నోర్ముయ్యి. (నోటి మీద కొట్టాడు.)

సిముక: సైనికులారా వీడినీ, వీడి పరివారాన్నీ అవతలకి తీసికెళ్ళండి- నా తల్లి సమక్షంలో ఈ అలజడి వద్దు.

వాస: నాయనా! సిముకా!- ఇల్లారా. తల్లిమీద దయ కలిగిందా—

సిముక: అమ్మా, అపరాధిని క్షమించు. లోకపు మాట విని తల్లిని దుర్భాషలాడి పోయిన పాపాత్ముణ్ణి క్షమించు. "నీలో దోషముండడానికి వీలులేదని ఆంధ్రర్షులు నా కన్నులు తెరిచేవరకూ, మూర్ఖుడ్నై పోయాను.

వాస: గురూ, ఆంధ్రర్షిదేవా! నమస్కారం.—

ఆంధ్ర: అమ్మా, మీ భర్త, సిముకుని తండ్రి మా గురువులు - ఈ కాణ్వ వశంపు దురాగతాలను అణిచి, మరల పుణ్యభూమి యైన భరత వర్షమున ధర్మసామ్రాజ్యాన్ని స్థాపించేందుకు కృషి చేయవలసిందని నాకు ఆదేశించారు. శకకర్త, భవిష్యత్ సామ్రాట్టు ఎవరూ కాగలడో నాకు సూచించి, ఆయన తనువు చాలించారు.

వాస: (కళ్లుమూసుకుని) ధన్యాస్మి! గురుదేవా, నమస్కారము. నా కుమారుడేనా, భవిష్యద్భారత సార్వభౌముడేనా. ఎంత ధన్యురాలని! నా జన్మ, నానోములు, ఇన్ని వత్సరాల నా ఓరిమి ఫలించిందా? (మూర్ఛ)

సిముక: అమ్మా! ఏమిటిది? ఇల్లా వణికి పోతున్నావు?

వాస: సిముకా! దగ్గరగా రా నాయనా. అక్కున చేర్చుకోనీ నాయనా. ఆనాడు నీ వృత్తాంతం నీకు చెపితే నీవు అర్థం చేసుకోలేవని చెప్పలేదు. నేను శృంగవంశపు క్షత్రియను. నన్ను ఒక కుమ్మరి కులవృద్ధు పెంచాడు. యుక్తవయస్కనైనప్పుడు ఒక మహాపురుషుడు మా యింటికి వచ్చారు. ఆయనకు నన్ను యిచ్చి ఆ కులవృద్ధు వివాహం చేశాడు. ఆయన ఒక్క నియమముతో నన్ను చేపట్టారు- తాను ధర్మ సంరక్షణార్థమై దేశాటనం చేయవలసి ఉందనీ, నాతో ముడిపెట్టుకుని ఉండననీ- నా జీవితంలో ఆనాటిని మించి తన ప్రమేయం ఉండదనీ, కాని భవిష్యత్ సార్వభౌముడు కాగల కుమారుడు నాకు జనిస్తాడనీ, వరమిచ్చి అదృశ్యులయారు. నీ రక్షణ కోసం ఈ వృత్తాంతం రహస్యంగా ఉంచవలసిందని ఆకుటుంబాన్నీ, నన్నూ శాసించారు. అందుకని లోకనింద సహించి ఈ ఊరిబైట వెలివడి, నెట్టుకొస్తున్నాను- ఈ బిడ్డ నాగనిక. కాణ్వ వంశం దక్కించుకోలేని మాణిక్యం. అమ్మా, ఇటురా. ఈమెను మహారాజ్ఞిగా ఏలుకో. ఇది నీతల్లి కోరిక—

ఆంధ్రర్షీ, ఆశీర్వదించండి. నా జీవిత ఆదర్శం నెరవేరింది. శాంతంగా ప్రాణాలు విడుస్తున్నాను.

సిముక: }
నాగ: } అమ్మా! అమ్మా!

(అని సన్నగా ఆలాపిస్తారు.)

ఆంధ్ర: సిముకా, ఇప్పుడు విచారించవలసిన సమయం కాదు. మనం చెయ్యవలసినది చాలా ఉంది.

సిముక: (దీనంగా) స్వామీ! ఈ తల్లి ఋణం ఎట్లు తీర్చను?

ఆంధ్ర: ఆమె ఆజ్ఞల పాలించి! నీవు కారణ జన్ముడవన్న నిశ్చయంతోనే ఆమె జీవితాన్ని సహించింది. కాణ్వుల దుష్పరిపాలన మితిమీరి పోయింది. మగధలో సుశర్మ కాణ్వుని అంతమొనరించి, యావద్భారతంలో ధర్మరాజ్యాన్ని, శాతవాహన రాజ్యాన్ని స్థాపించి గంగలో కత్తికడిగి మాతృఋణం తీర్చుకో.

(సిముకుని సైనికులు ప్రవేశం.)

సైని: స్వామీ, ప్రతిష్ఠానపురం మన సేనల వశమైంది. మీ ఆజ్ఞయైతే మగధకు బయలు దేరగలం.

ఆంధ్ర: జై! సిముక శాతవాహనులకూ జై!

(నాగనికా, సైనికులూ జేజేలు కొడతారు.)

సిముక: స్వామీ! నేను ఆంధ్ర భృత్యుడను. ఏ ధర్మం పేరిట మీరు ప్రజను సైన్యంగా నాచేత, సమకూర్చ చేశారో, ఏ ధర్మ ఆవేశాలతో ఈ మట్టిబొమ్మలలో ప్రాణంపోసి వీళ్లను వీరులను చేయగలిగానో ఆ ధర్మం పేరిట మీ ఆదేశం స్వీకరించి స్వరాజ్యం స్థాపించి, ప్రజాభృత్యుడనై సింహాసనం అధిష్ఠించి నా మాతృఋణం, మాతృదేశ ఋణం తీర్చుకో గలనని బాసచేస్తున్నాను. మీరు రాజగురువులై మార్గం చూపండి.

ఆంధ్ర: పద! సిముకా, ప్రతిష్ఠానపుర ప్రజలందరూ స్వగృహాలు చేరుకుంటున్నారు. తల్లిగారి అంత్యక్రియలు పూర్తి చేసి, ప్రతిష్ఠానపురంలో పట్టాభిషిక్తుడవై ధర్మస్థాపనకు నడుంకట్టు. అమ్మా! నాగనికా! ఇటు సిముకుని పక్క నిలమ్మా.

సిముక: }
నాగ: } గురుదేవులకు నమస్కారము.

ఆంధ్ర: సర్వమంగళాని భవంతు.

ప్రజలు: జై సిముక శాతవాహన సార్వభౌములకూ, మహారాజ్ఞిలకూ జై.

★

యువతి: "నేను నిన్ను పెళ్ళి చేసుకోకపోతే చచ్చిపోతానంటావు, అంతేనా?"

యువకుడు: "ఆహా! ఇదివరకు చాలాసార్లు అలాగే చేశాను."

* * * *

భర్త (కోపంగా): ఏమే. ఇంకా వంటకాలేదూ? సరే, నేనిక ఊరుకోను. ఇదిగో హోటలుకు పోతున్నాను.

భార్య: ఆగండి, ఒక్క అయిదు నిమిషాలే.

భర్త: అయిదు నిమిషాల్లో వంట అవుతుందా?

భార్య: అబ్బే అందుకుకాదు. నేనూ వచ్చేస్తా మీతో హోటలుకి.



రాజప్రతిమ

ఒక మహా నగరం వుంది. ఆ నగరపు రాచబాటల కూడలిలో మహోన్నతంగా ఒక విగ్రహం ప్రతిష్ఠితమై వుంది. సమస్త భోగాలను అనుభవించి గతించిన ఆ నగరి రాజునదా ప్రతిమ. ప్రతిమ బంగారు రేకుతో పొదువబడి వుంది. కన్నులలో ఇంద్రనీలాలున్నవి. కటినిశ్రేలు కత్తి పిడిని అమూల్యమగు కెంపు జిగ్గుమంటోంది.

శిల్పనైపుణ్యానికి నిజంగా ఎన్నికగన్నదా ప్రతిమ. ఆ దారినేగు పురపాలక సభ్యులొకడు ప్రతిమను చూచి "ఈ విగ్రహము వాయుగతి నిరూపణ యంత్రమువలె రమ్యంగా వుంద"ని మరల ప్రజలు తన్నపార్థము చేసికొనకుండుటకు "అంత వుపయోగికారి మాత్రము కాదు" అంటూ తన కళాభిరుచిని వాస్తవిక దృష్టిని ప్రకటించుకొన్నాడు.

మారాము పెట్టే పిల్లలను మందలించేప్పుడు తెలివైన తల్లులు రాజప్రతిమను చూపి "ఆ మహారాజెప్పుడు దేనికోసము వాపోయి యెరగడు. ఆయనలా గుండ

రచన:

ఆస్కార్ వైల్డ్

రాదురా? నాయనా!" అనేవాళ్లు.

ఆశాభంగాలవల్ల హతమారిన మానవుడొకడు ఆ అద్భుత ప్రతిమను తనివితీర కాంచి "ఈ ప్రపంచమంతటిలో సంపూర్ణ సుఖానుభూతి కలవాడు ఒక్కడైనా వున్నందుకు సంతోషించాలిసిందే" నని తన సంతృప్తిని వెలిబుచ్చుతూ గొణిగాడు.

క్రైస్తవ అనాథబాలురు చర్చి నుంచి పోతూ "రాజప్రతిమ దేవదూతను మిక్కిలి పోలివుంద"నుకున్నారు.

"మీకేమి తెలుసు? దేవదూతను మీరెప్పుడూ చూడలేదే?" అని గణితశాస్త్రాచార్యుడు వారిని ప్రశ్నించాడు.

"అయితే నేమి, మేము కలలు కంటూ వుంటామని" పిల్లవాళ్లిచ్చిన జవాబుకు గణితశాస్త్రజ్ఞుడు ముఖం చిట్లించుకుని గాంభీర్యత వహించాడు. ఆయనకు పసివాళ్లు కలలు కనటం బొత్తిగా గిట్టదు.

ఒకనాడు ఈజిప్టుకు ప్రయాణం కట్టిన కోయిల ఒకటి పగలల్లా ఎగిరిఎగిరి నిశాసమయానికి ఆ నగరోపరిప్రాంతం చేరుకుంది. "ఈ రాత్రి నేను యెక్కడ బస చెయ్యాలి? ఈ నగరవాసులు నాకోసం తగు యేర్పాట్లు చేసివుంటారనుకుంటాను" అనుకుంది.

ఇంతలో కోయిల అత్యున్నతమైన ఆ ప్రతిమను చూసింది. "ఇది యోగ్యమైన తావు. కావాలిసినంత పరిశుభ్రమైన గాలి వొస్తుంది." అని తలపోస్తూ రాజప్రతిమ కాళ్లనడుమ వాలి కూర్చుంది.

చుట్టూ కలయ చూసుకొని "ఓహో! నాకు బంగారపు పడకగది అమిరిందే!" అనుకుంటూ నిద్రించటానికి యత్నం చేయసాగింది. కాని తన రెక్కల కింద తలను అమర్చుకునే సమయానికి పెద్ద నీటిబొట్టొకటి దానిమీద పడ్డది. ఏం చిత్రం! ఒక్క మబ్బుతునకకూడా నింగిని కానరాదు. నక్షత్రాలు స్ఫుటంగా మిలమిల లాడుతూ ప్రకాశిస్తున్నాయి. అయినా వర్షమా! ఈ ప్రాంతపు వాతావరణం అతిభయకరం" అనుకుంది కోయిల.

అంతలో మరో చినుకు పడింది.

"వర్షాన్ని ఆపలేని యీ ప్రతిమ నిష్ప్రయోజనం. ఇక నే నేదైన మంచి దీప

స్తంభం చూసుకుంటాన”ని కోయిల ఎగిరిపో నిర్ణయించుకుంది.

కాని రెక్కలు విప్పబోయేసరికి మూడో చినుకు మీద పడ్డది. దాంతో కోయిల పైకి చూసింది.

రాజప్రతిమ కన్నులు అశ్రువులతో నిండి వున్నాయి. కన్నీరు బంగారు చెక్కిళ్లబడి దిగజారుతున్నాయి. ప్రతిమా ముఖం ఆ వెన్నెల వెలుగులో అతి మనోహరంగా వుంది. కోయిలకు జాలి పొడమింది.

“నీ వెవరు?” కోయిల అడిగింది.

“నే నో సుఖమయ జీవినైన రాజును.”

“అయితే విలపిస్తా వేం? నన్ను పూర్తిగా తడిపేశావు గదా!”

దానికా ప్రతిమ యిలా బదులు పలికింది—

“నేను సజీవుణ్ణై మానవ హృదయం కలిగున్న దినాల్లో విచారమంటే ఎలా వుంటుందో ఎరగను. నే నో సువిశాల హర్మ్యంలో నివసించేవాణ్ణి. ఆ ప్రాసాద ప్రాంగణంలో సైతం దుఃఖానికి కాలు పెట్టరాదు. పగళ్లు మిత్రులతో వుద్యానవనవిహారాల్లోను, నిశలు ప్రాసాదాంతర్భాగాల్లో నృత్యగానాల్లోనూ గడిపేవాణ్ణి. మా తోట చుట్టూ చాల యెత్తైన ప్రహరీ వుండేది. దాని కవతల యేముందో నే నెన్నడూ తెలుసుకో ప్రయత్నించనైనా లేదు, కారణం నా సన్నిహిత పరిసరం చాల హృదయంగమంగా వుండడమే. నా పరిజనం నా సుఖజీవితాన్ని మిక్కిలి చెప్పుకొనేవారు. నిజంగా నేను సుఖినే—భోగవిలాసాలే సుఖమని యెంచితే.”

“బతికి నన్నాళ్లు అలా బతికి చనిపోయాను. ఇప్పుడో, మరణానంతరం నాపురి దుఃఖదైన్య వికృతరూపం సుస్పష్టంగా చూడగలిగేటంత వున్నత వేదిమీద ప్రతిమారూపాన నిలబడ్డాను. నాహృదయ మిప్పుడు సీసంతో చెయ్యబడ్డది. అయినా దుఃఖం పొర్లి వస్తోంది.”

“ఏమిటి! ప్రతిమ అచ్చగా బంగారం కాదూ?” అని కోయిల తనలో అనుకుంది. వ్యక్తిగత విషయాలను తడవడం మర్యాదకు భంగమని ఆమాట పైకనలేదు.

కరుణార్ద్ర కంఠంతో మళ్లా రాజు చెప్పదొడగాడు—

“చాలా దూరాన ఒక యిరుకు గొందిలో బీదల కుటీరం ఒకటుంది. కిటికీ తెరచి వుంది. దాంట్లోనుంచి లోపల కూర్చున్న స్త్రీ నాకగపడుతోంది. ఆమెమోము చిక్కిపల్చబారింది. చేతులు సూదిమొన తాకుడుకు కంది రక్తం చిమ్ముతున్నాయి. ఆమె కుట్టుపనిలో నిర్విరామంగా మగ్నమై వుంది. రాణివాసపు పరిజనంలో ఒక సుందరి నృత్యసమయాన ధరించే పట్టుదుకూలాన జలతారు జిలుగు నగిషీపని చేస్తోందామె. గదిలో ఒకమూల ఆమె కుమారుడు అస్వస్థుడై మంచాన్నంటుకు వున్నాడు. వానికి జ్వరం తగులుతోంది. నారింజపండ్లు అడుగుతున్నాడు. లేమివల్ల శక్తిచాలక తల్లి వానికి కేవలం నూతినీటిని తాపుతోంది. అందుకు వాడు ఏడుస్తున్నాడు. కోయిలా! కోయిలా! నా చిన్ని కోయిలా! నా కత్తిపిడిని మెరుస్తున్న కెంపు కొనిపోయి ఆ తల్లి కియ్యవూ? నాపాదాలీ వేదిక్కి తాపితమైనాయి. నేను కదల్లేను.”

“ఈజిప్టులో నాకోసం స్నేహితులు ఎదురుచూస్తూ వుంటారు. నా మిత్రులంతా నైలునది మీద విహరిస్తూ నదిలోని ప్రఫుల్ల కమలాలతో ముచ్చటలాడుతూ వుంటారు. ఈ పరికి నావారు ఈజిప్టు చక్రవర్తి సమాధి గూళ్లలో విశ్రమింప బోతూ వుండి వుంటారు.

“కోయిలా! కోయిలా! నా చిన్ని కోయిలా! ఈ ఒక్కరాత్రి నాతో వుండి నేచెప్పినపని చేయవూ? ఆ పసివాని కెంత దాహమవుతున్నదో! అబ్బా! ఆతల్లి ఎంతదుఃఖించుతున్నదో!”

“పిల్లలంటే నాకు సద్భావంలేదు. కడచిన వేసవిలో నదిఒడ్డున నేను నివసించుతుండగా యిద్దరు ఆకతాయిపిల్లలు - పిండిమర యజమాని కొడుకులు - యెప్పుడూ నామీద రాళ్లు రువ్వేవాళ్లు. నా కవి తగల్లేదనుకో! మే ముందే, కోయిలలం జాగర్త కలిగి తెలివిగా యెగిరిపోతుంటాం. అదీ కాక నేను చురుకుదనానికి పేరుపడ్డవంశంలో పుట్టాను. అయినా రాళ్లు రువ్వడమంటే నన్ను గౌరవ పరచడమేగా?”

ఈ మాటలకు రాజు మోము దుఃఖమ్లానమై చూపట్టింది. అదిచూచి కోయిలకు మనసు కరిగి “ఇక్కడ చలిబాధ మిక్కుటంగా వుంది. అయినా యీ ఒక్కరాత్రి నీతో వుండి నీ పనుపు చేస్తాను” అంది.

కోయిలకు రాజు తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపాడు.

అంతట కోయిల మహారాజు కత్తిపిడినున్న కెంపు నూడపెర్కికి ముక్కున కరుచుకొని యిళ్లకప్పుల మీదుగా యెగిరిపోయింది.

ఎగురుతూ కోయిల దేవమాతల చిత్రాలమర్చబడ్డ చర్చి టవర్లు దాటింది. రాజప్రాసాదోపరి భాగం గడచు సమయాన నృత్యధ్వని వినవైంది. అక్కడ ఒక మేడమీద ఒక మదవతి తనప్రియుడితో సల్లాపాలు ఆడుతూ వుండడం కానవైంది. ప్రియుడు” ఆకసమున చుక్కల సౌరెంత వింత కొలుపుతోందో ప్రేమ ప్రభావంకూడా అంత అద్భుత మనిపించుతుంది” అన్నాడు. “దర్బారు నృత్యం నాటికి” నా దుస్తులు తయారవుతవని ఆశించుతున్నాను. పూవిలుకాని పుష్ప బాణాలను నా దుస్తులపై చమికీ పనిచేయమని పురమాయించాను. కాని యీ కుట్టుపని మనిషి అతి సోమరి” అంటోంది ఆ వఃపుకత్తె.

ఓడలతెరచాప కొయ్యల ప్రేలాడు దీపాలు చూస్తూ కోయిల నదిదాటింది. తక్కటలో డబ్బుతూచుకుంటూ ఒకరితో ఒకరు బేరాలాడుకునే యూదు లోకచోట తటస్థపడ్డారు. ఇట్లా ఎగురుతూ పోయి తుదకా దరిద్రులకుటీరంచేరి లోనికి తొంగి చూచింది కోయిల. పిల్లవాడు జ్వరతీవ్రతకు ఆవేదనతో అటూ యిటూ కొట్టుకొంటు

న్నాడు. తల్లి నిద్రించుతోంది. ఆమె అంతగా అలసిపోయింది. కోయిల లోపల వాలి ఆమె కుట్టుపనిపరికరాల ప్రక్కనే ఆ అమూల్యమైన కెంపు నుంచింది. పిమ్మట మందం మందంగా మంచంచుట్టూ యెగురుతూ పిల్లవాని ఫాలాన్ని తనరెక్కలతో చల్లగా వీవదొడగింది. "ఇప్పుడే మో! చల్లగా హాయిగావుంది. నాకునయమౌతున్నట్లుంది," అని బాలుడు సుఖనిద్ర చెందాడు.

కోయిలరాజ ప్రతిమకడకు మరలివచ్చి తానొనర్చిన పనివివరించి "ఇదేమిటి! ఆశ్చర్యం! ఇంతచలిగాలి వీస్తున్నా నాకు వెచ్చగానే తోంస్తోంది" అంది.

"అది నీ వొనర్చిన సత్కార్య ఫలితం" అని రాజు బదులు పలికాడు. దాన్నిగూర్చి కోయిల ఆలోచనలోపడి నిద్రపోయింది. ఆలోచించడం ఎప్పుడు ప్రారంభించినా కోయిలకు నిద్రవస్తోంది.

తెల్లవారగానే కోయిల నదికి వెళ్లి స్నానంచేసింది. పక్షిశాస్త్రజ్ఞు డొకడు వంతెన దాటుతూ "యేమిటివింత! చలికాలంలో కోయిలలా!" అని తలపోశాడు. అతడీ విషయంమీద స్థానిక పత్రికల్లో బృహద్వ్యాసం ప్రకటించాడు. అర్థంగాని అగమ్యగోచరమైన పదజాలం ప్రయోగించడంలో వ్యాసకర్త తనప్రతిభను ప్రదర్శించాడు. అందుకే కావచ్చు అనేకులా వ్యాసాన్నిగొప్పగా వుదహరించడం మొదలుబెట్టారు.

"ఈ రాత్రి నేను ఈజిప్టుచేరుతా నను కుంటూ కోయిల మిక్కిలి వుత్సాహ పడజొచ్చింది. ఆ నగరంలో చూడదగ్గ దృశ్యాలన్నిటిని పరికించి యెంతో పొద్దుచర్చి శిఖరాగ్రాన కూర్చుంది. తానెగిరిన తావుల్లో అలా పిచ్చుక లొండొంటిలో "ఈతడెవ్వడో పరదేశి, మహానుభావుడు లాగున్నాడ"ని గుసగుసలాడుకున్నవి. అన్నీ చూస్తూ వినోదంగా కోయిల ఆపగలు గడిపింది.

చంద్రుడుదయించటంతోటే కోయిల రాజప్రతిమ కడకెగిరి "ఇదుగో నేను యిప్పుడే ఈజిప్టుకు బయలుదేరుతున్నాను. అక్కడ నీకేదైన పనివుంటే చెప్పు చేసిపెడతా" నంది.

"కోయిలా! కోయిలా! నా చిన్ని కోయిలా! మరొక్కరేయి నాతో గడపవా" అని రాజడిగాడు.

"నావారందరు ఈజిప్టులో నాకోసం దారులుచూస్తూ వుంటారు. రేపు నామిత్రులాకసెల యేటిని చూడబోతారు. నీటిగుఱ్ఱాలు ఆ యేటి అంచుల జమ్ములోనక్కి కనబడతాయి. ఆ తీరాన 'మేమన్' నల్లరాతి సింహాసనం అధిష్ఠించి వుంటాడు. రాత్రులు నక్షత్రాల శోభనవలోకించుతూ ఉషాగమనవేళ ఆనందాతిరేకంతో ఒక్కకేక యిడి మరల మౌనం వహించుతాడు. మధ్యాహ్నవేళ హరిద్రహారులు ఆ సెలయేట నీరు త్రాగ వస్తవి. వాటి కళ్లు గారుడముల వలె హరితవర్ణరుచు లీనుతూ వుంటవి. వాటి గర్జన జలపాతఘోషను మీరిపోతుంది."

"కోయిలా! కోయిలా! నా చిన్ని కోయిలా! యీ నగరంలో బహుదూరంగా ఒక మిద్దె కనిపించుతోంది. అందులో యువకు డొకడు కాగితాల బొత్తుల్లో ముఖం పెట్టుకుని ముందుకు వంగి కూర్చున్నాడు. వానిప్రక్కన వాడిన వయొలెట్ పూగుత్తి పడివుంది. వాని జుట్టు వుంగరాలు తిరిగివుంది. పెదవులు దానిమ్మలవలె ఎఱ్ఱగా వున్నాయి. చారలంతేసి వాని కళ్లు కలలు కంటున్నట్లున్నాయి. ఒక నాటక ప్రయోక్తకు తన రచనను యీయవలసివుంది. చలికి వ్రేళ్లు కొంకరలుపోయి వ్రాత సాగటం లేదు. నెగడిలో నిప్పు లేదు. కడుపులో ఎత్తు లేదు. ఆకటికి అతడు సోషిల్లాడు."

సహృదయం గల కోయిల "యీ ఒక్క రాత్రికూడ మీతో గడుపుతాను. మరో కెంపు కొనిపోయి వానికిత్తునా?" అని అడిగింది.

"దురదృష్టవశాన యిక నావద్ద కెంపులు లేవు. మిగిలింది నా కళ్లు మాత్రమే. వెయ్యేళ్లనాడు భారతదేశంనుంచి సేకరించిన అమూల్యమైన ఇంద్రనీలాలు నా కన్నుల పొదువబడ్డాయి. వాటిలో ఒకటి కొనిపోయి ఆ యువకుడికియ్యి. అతడే స్వర్ణకారునికో దాన్ని విక్రయించి తన కాహారం, నెగడికి కట్టెలు సేకరించుకుంటాడు. దాంతో వాని నాటకం కడతేరుతుంది."

"ఓ ప్రియమైన నారాజా! ఆ పనికి నేనొడికట్టలేను." అని కోయిల విలపించసాగింది.

"కోయిలా! కోయిలా! నా చిన్ని కోయిలా! నా సమ్మతి చెయ్యవు?" అని రాజు కోయిలను వేడాడు.

అంతట రాజు కనిపాపను వూడదీసుకుని యువకుని మిద్దె దిక్కు కోయిల యెగిరిపోయింది. కప్పంతా శిథిలమై కంతలు పడి వుండటంవల్ల లోని కేగుటకు కోయిల కంత అవరోధం లేకపోయింది. యువకుడు మోము చేతుల కప్పుకొని కూర్చోటంవల్ల కోయిల లోనికరిగిన సవ్వడి గమనించలేదు. అతడు తలెత్తుసరికి అందమైన ఇంద్రనీలం అక్కడ వాడిపడున్న పూగుత్తిపై గోచరించింది.

"నేను గణనకెక్కటానికి యిదే మొదలు. నన్ను సమాదరించిన రసాస్వాది యెవ్వరో యీ కానుక పంపారు. ఇక నా నాటకం ఆసాంతం నిర్నిరోధంగా సాగుతుంది" అనే భావంతో అతని మోము హాసభాసితమైంది.

కోయిల మరునాటి వుదయం ఓడరేవుకు పోయింది. అక్కడ ఒక తెరచాపకొయ్యకొన కూర్చుని సరంగులు సరకులుయెత్తుతూ, దించుతూ వేసే కేకలు వింది. "నేను ఈజిప్టు పోతున్నాను" అని తనూ ఒక కేక పెట్టింది. కాని యెవ్వరూ దానిమాట వినిపించుకోలేదు. చంద్రోదయం కావడమే తడవుగా రాజ ప్రతిమ కడకు మరలి వెళ్లింది.

"నీకు వీడుకోలు చెప్పిపోదామని యిక్కడికి వచ్చాను" అంది కోయిల.

మళ్లా రాజు "కోయిలా! కోయిలా! నా చిన్నికోయిలా! మరొక్క రాత్రి నాతో వుండవా?" అనెను.

"ఇది హేమంతం. త్వరలో చల్లని మంచు కురవ నారంభిస్తుంది. ఈజిప్టులో సూర్యుడు పచ్చని తాటితోపులపై వెచ్చగా ప్రకాశించుతాడు. మొసళ్లు బురదలో పండుకుని తమ పరిసరాలను సోమరిగా చూస్తూవుంటాయి. నా వారక్కడ 'బాల్బెక్' దేవళంలో ఒక గూటిని నిర్మించుతూ వుంటారు. పావురాళ్లు తెల్లవి, యెఱ్ఱవి అది చూచి ఒకటి కొకటి యేమేమో గుడుగుడు లాడుతూ వుంటాయి. నా ప్రియమైన రాజా! నేను నిన్ను వదిలి వెళ్లక తీరదు. కాని నిన్నెన్నటికి మరువను. వసంతంలో నేను తిరిగి వచ్చేప్పుడు నీవు ధర్మం చేసిన వాటికన్న మాడచక్కని రెండు రత్నాలు నీకు తెచ్చి పెడతాను. ఎఱ్ఱగులాబులకంటె యెఱ్ఱని కెంపును, సముద్రనీలిమకీడువచ్చే ఇంద్రనీలాన్ని తెస్తాను."

"అదుగో! అక్కడ ఆ చౌకులో ఒక చిన్న పిల నిలిచి వుంది. నిప్పు పెట్టెలు అమ్ముతోంది. చెయ్యి జారి పెట్టెలన్నీ మురుగు కాలవలో పడి తడిసిపోయాయి. నిప్పు పెట్టెలమ్మిన డబ్బు యింటికి తీసుకు పోకపోతే తండ్రి ఆమెను కొడతాడు. అందుకామె యేడుస్తోంది. ఆమెకాళ్లకు ముచ్చెలుగాని, మేజోళ్లుగాని లేవు. ఆ పసితల కాచ్ఛాదనకూడ యేమీలేదు. నా రెండోకను పాపనూడపెరికి ఆ పిల్ల కివ్వు. తండ్రి ఆమెను దండించడు."

"ఈ రాత్రికూడ నీతో వుంటాను. కాని మీ కనిపాపను మాత్రం నే నూడతీయను. నీవు పూర్తిగా గుడ్డివాడవైతే నేను చూడలేను."

"కోయిలా! కోయిలా! నా చిన్ని కోయిలా! నే చెప్పినట్లు చేయవా?" అని రాజు దీనంగా ప్రశ్నించాడు.

కోయిల రాజు రెండో కన్ను పెకలించి ముక్కున కరుచుకు పోయింది. నిప్పు పెట్టెలమ్మే పిల్లను రాచుకుంటూ యెగిరి ఇంద్రనీలాన్ని పిల్ల చేతుల్లో వొదిలింది. "యెంత ముచ్చటైన గాజు ముక్క" అని కేక లేస్తూ కేరింతలు కొట్టుతూ ఆ పిల్ల ఇంటికి పరుగు లుచ్చుకుంది.

తన విధి నిర్వర్తించుకుని కోయిల రాజ ప్రతిమ చేరి "రాజా! నీ విప్పుడంధుడవు. ఇంక యెల్లప్పుడు నేను నీవద్దనే వుండిపోతాన" నెను.

"అట్లాకాదు. నా చిన్ని కోయిలా! నీవు ఈజిప్టు పోవలసిందే" అని రాజు బదులు చెప్పాడు.

వెళ్లను. నేను యెల్లకాలము నీ వద్దనే వుండిపోతాను." అంటూ కోయిల రాజ ప్రతిమ పాదాలకడ నిద్రపోయింది.

మరు దినమంతా కోయిల రాజు భుజం మీద కూర్చుని ఆయనకు తను చూచిన అనేకవింతలు విశేషాలు కథలుగా చెప్ప దొడగింది. నైలునదీ తీరాన బారులు తీరి నది లోని బంగారు చేపల తమ ముక్కుల పొడిచిపట్టు కంకట పక్షులగురించి, భూమికి కల వయస్సు కలిగి యెడారి నివసించు సర్వజ్ఞ మూర్తియైన 'స్ఫింక్సు' గాథను రాతిపూసల జపమాలలు చేతుల తిప్పుతూ తమ ఒంటెల వెంట అడుగులో అడుగు పెడుతూ నడిచే వణిక్ప్రభుల వర్తనాలను, యిరవైనుంచి సన్యాసులు భోగాలు చేస్తూవుంటే తాళవనంలో నిద్రించుతుండే మహాసర్పం విషయం, ఆకు దొన్నెల నావల్లో నదిని పయనించుతూ సీతాకోక చిలుకలతో యుద్ధానికి తలపడే గుజ్జువారి కథలను మనోరంజకంగా రాజుకు వినిపించింది.

"ప్రియమైన నాచిన్ని కోయిలా! అద్భుత విషయాలను వినిపించావు. అన్నింటికంటె అద్భుతమైంది స్త్రీపురుష భేదంలేక మానవులు పడే కష్టగాథ. అంతటి మాయ మరొకటి లేదు. నా నగరోపరి వీధి నెగురుతూ నీవు కనుగొను వింతల నాకు చెప్పుతూ వుండు" అని రాజు కోయిలను కోరాడు.

కోయిల అలాగే ఆ మహానగరం మీద యెగర జొచ్చింది. ధనికులు సుందర సౌధాంతర్భాగాల్లో భోగవిలాసాల మునిగి తేలుతూ వుంటే బిచ్చగాళ్లు వారి వాకిళ్ల పడిగాపులుండడం చూసింది. ఇరుకు చీకటి గొందుల్లో ఆకటికి కరువువాచి పస్తులుండే పసిపిల్ల ముఖాలు పాలి పాండురమైన బాలురు శూన్యవీధులబరిపే మాపులోని ఆర్తతను కనుగొంది. ఒక వంతెనకింద పిల్లలిద్దరు పైన ఒక చింకిపాతైనా లేక చలికి వణవణవణుకుతూ ఒకరినొకరు కౌగలించుకు పడుండి "అబ్బా! ఎంత ఆకలి వేస్తోంది!" అనుకుంటుంటే యింతలో గస్తీదారు "ఏయ్! ఎవరక్కడ! పొండవతలకి" అని గర్జించడం, పాపం ఆ బాలురు వర్షంలా కురుస్తున్న మంచునబడిపోవడం పరికించింది.

కోయిల తిరిగి చని తను చూచిన వాటన్నింటిని వివరించి చెప్పింది.

"నా ఒంటిమీది బంగారు తొడవును రేకులు రేకులుగా వూడదీసి నా దరిద్ర ప్రజలలో పంచి యివ్వు. సంపదవుంటే సౌఖ్యాలొదవుతాయని ఎప్పుడూ ప్రాణులు తలతుర" ని రాజు కోయిలతో చెప్పాడు.

పొరలు పొరలుగా కోయిల బంగారమంతటిని వూడదీసింది. మై తొడవులేని రాజప్రతిమ మోడులా మాపట్టింది. బంగారు రేకులన్నీ కోయిల బీదల కందజేసింది. పేద బాలుర మోము లంతటి నుండి కళదేరి హాస వికసితాలైనాయి. వారు వీధుల్లో వుత్సాహంగా గంతు లిడుతూ ఆడుకో సాగారు.

నానాటికి యినుమిక్కిలిగా మంచు కురియ నారంభించింది. ఆ మంచుకూడా గడ్డ కట్టసాగింది. వీధులు వెండి పూత వేసినట్లు హిమాచ్ఛాదితమై ధవళ కాంతులు వెదజల్లుతున్నాయి. ఇళ్ల చూరుల వెంట స్ఫటికపు బాకులలా నిడివైన మంచుముక్కలు వ్రేలాడుతున్నాయి. ప్రజలంతా ఉన్ని దుస్తులు చుట్టబెట్టుకుని నడయాడుతున్నారు. బాలురు యెఱ్ఱని టోపీలు ధరించి మంచు నేలల జారుతూ ఆడుతున్నారు.

పాపమా చిన్ని కోయిల రోజు రోజుకు చలిగొని పోసాగింది. అయినా రాజప్రతిమను వీడిపోలేదు. ప్రతిమపై ప్రేమకోయిల కంతమిక్కుటం. రొట్టెల దుకాణమువాడు యేమరివున్న వేళల నేలబడ్డ చిన్న చిన్న రొట్టె తునకలను యేరుకొని తింటూ యేదో విధంగా దేహయాత్ర జరుపుతోంది.

కాని తుదకు కోయిల తనకు మరణమాసన్నమైనట్లు తెలుసుకుంది. రాజుభుజంపైకి మరోమారు యెగరడానికి మాత్రమే దానికి శక్తివుంది.

"ప్రియమైనరాజా! యింక సెలవు నీచేతిని ముద్దు పెట్టుకుంటాను, నా కోమారు అందియ్యవూ?" అనెను.

"నీవు ఈజిప్టుకు వెళ్లుతున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. నీవుయిప్పటికేచాలా కాలం యిక్కడ నిల్చిపోయావు. ఇప్పుడు నీవు ముద్దుపెట్టుకోవాల్సింది నా చేతులనుగాదు పెదవుల్ని. నీవంటే నా కంత మక్కువ."

ఈజిప్టుకు కాదు నా పయనం. పరలోకానికి. నిద్రకు సోదరుడట కాదూ చావు?"

అంటూ కోయిల రాజు పెదవులను ముద్దుగొని కన్నులు మూసింది. రాజు పాదాలబడి మరణించింది.

అప్పుడే ప్రతిమలో యేదో పటుక్కుమంది. రాజుహృదయం రెండుగావిచ్చింది. వాస్తవానికి మంచు భయంకరంగా వుంది.

మర్నాడుదయం ఆ నగర పాలకాధ్యక్షుడు కొందరు సభ్యులతో ఆ వీధినపోతూ రాజప్రతిమనుచూసి "యీ ప్రతిమ యెంత అసహ్యమైంది! ఛా! ఛా!!" అన్నాడు.

"అవును అట్లాగేవుంద" న్నారు తోటి సభ్యులు. వారికెప్పుడూ అధ్యక్షుడు యెలా పలికితే అలా తాళంవెయ్యడం పరిపాటి. ప్రతిమనుఅబ్బందండగ్గరగాపోయిచూశారు.

"కెంపేదీ! నీలాలేవీ! బంగారం చిదపైనా లేదే! చూడగా బిచ్చగాడి రూపేర్పడింది." అని అధ్యక్షుడు లక్షించి పలికాడు.

"అవును చూడగా బిచ్చగాడి రూపేర్పడిందని" వ్యాఖ్యానించారు తోటి సభ్యులు వెంటనే.

"చూడండి! ఇక్కడ పిట్టొకటి చచ్చిపడివుంది. ఇకమంచి పిట్టలీతావున చావరాదని నిశ్చయంగా మనం ఒక ప్రకటన చెయ్యాలి" అన్నాడు అధ్యక్షుడు. వారి గుమాస్తా ఆ సూచనను గుర్తువ్రాసుకున్నాడు.

రాజప్రతిమ అచటనుంచి తొలగించబడ్డది. "ఆ ప్రతిమ అందాన్ని కోలుపోయింది. కనుకనే నిరుపయోగంకూడా" అన్నాడు ఆ విశ్వవిద్యాలయపు ఆర్టుప్రొఫెసర్.

ప్రతిమను కరిగించడానికి యిచ్చారు. కరిగించబడ్డ లోహాన్ని యేంచేయడం అనే విషయం చర్చించేందుకు నగరపాలకాధ్యక్షుడు పాలక సంఘసమావేశ పరిచాడు. "అసలు ఆలోహం ఒక ప్రతిమకై నిర్దేశించబడ్డది. కనుక దాంతో మళ్లా మరొక ప్రతిమను తయారుచేయించి ప్రతిష్ఠించడం సబబు. అది నా ప్రతిమగా వుండడం న్యాయం" అని అధ్యక్షుడుపన్యసించాడు.

"నా ప్రతిమ" "నా ప్రతిమ" అని సభ్యుల మధ్య తగవులాట ప్రారంభమయింది. అది నాటినుండి నిన్న మొన్నటి వరకు తెగక తన్నుకుంటూనే వున్నారు.

"ఏమిటీ విడ్డూరం! ప్రతిమంతా కరిగినా భగ్నమైన యీ లోహపు గుండెమాత్రం కరక్క నిల్చింది. దీన్ని పారెయ్యాలిసిందేన" ని కోలిమి యజమాని మిగుల ఆశ్చర్య పడ్డాడు. పనివారా లోహపు ముద్దను ఒక చెత్త కుప్పమీదికి విసిరేశారు, చనిపోయిన కోయిల కళేబరం ఆ చెత్తకుప్ప మీదవుంది. రాజప్రతిమ పగిలిన సీసపు గుండెపోయి కోయిల ప్రక్కనే పడ్డది. ★

అనువాదం: "ఫలానా"



పతివ్రత

శేషాద్రి వార్తాపత్రికా కార్యాలయంలో జేరినప్పటినుంచీ చాలా సంతోషంగా వుంటుండేవాడు. ఈ కొత్త నౌకరీతో బాటు పెళ్లికూడా అయింది. అందుచే ఒక విధమైన గర్వంతో కులుకుతూ, సంతోషం పట్టలేక పోతుండేవాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ అతనికి పని ఎక్కువ కాసాగింది. అందుచే భర్త తన్ను లెక్కచేయడం లేదని అపోహపడింది జానికి. అసలు చిన్నప్పటినుంచీ, ఆమెలో ఒకవిధమైన అహంభావం వుంది. తల్లి చనిపోయినప్పటినుండీ చిన్నపిల్లలైన తన చెల్లెళ్లనీ, తమ్ముళ్లనీ సంరక్షించే భారం ఆమె మీదపడింది. అది ఆమెకి చాలా కష్టమనిపించింది. అందుచే వాళ్లమీద విసుక్కుంటూ, అస్తమానం వాళ్లని తిడుతూ వుండేది. ఈ విధంగా ఆమెలో మానసిక వ్యధ ఎక్కువయింది. దీనికితోడు ఎప్పుడైతే శేషాద్రి తన్ను సరిగా చూడటం లేదని అపోహపడిందో, అప్పటినుండీ భర్తయందూ, తన పిల్లలయందూ మాటి మాటికీ తప్పులుపట్టి ఆక్షేపించడం మొదలిడింది. ఆమె చెల్లెళ్లు, తమ్ముళ్లు ఇప్పుడు వాళ్ల మేనత్తవద్ద ఉంటున్నారు. నిజంగా శేషాద్రి సంసారంకోసం చాలా కష్టపడుతున్నాడు. అందుచే తనభార్యని సరిగ్గా చూడటం లేదనే భావం అతనిలో ఇంతవరకూ కలుగలేదు. జానికి అస్తమానం ఏవో తప్పులు పట్టి ఎత్తిపొడుస్తుంటే, అది ఇంకోవిధంగా పరిణమించేది. ఆమె ఎంతలా విసిగిస్తోందో, అతను అంతలా ఆఫీసును వదలిరాలేక పోతుండేవాడు. అందుచే అతను మనశ్శాంతికోసం సాధ్యమైనంతవరకూ ఇంటినుండి దూరంగా వుండడానికి ప్రయత్నించేవాడు. అసలు శేషాద్రి శాంతిప్రియుడు. అతనికి ఇంటిగొడవలంటే చాలా అసహ్యం. అతను తన పిల్లలకోసం మాత్రమే అంతలా తాపత్రయ పడుతుండేవాడు.

ఆడవాళ్లనోటికి కళ్లెం లేదు. ఒక్కసారి గనుక వాళ్లనలా ఉండనిచ్చామా ఇంక వాళ్ల నాపడానికి యెవరికీ శక్యంగాదు. పెళ్లిఅయిన మొదటిరోజుల్లో శేషాద్రి భార్యయందు ప్రేమగా ఉండడానికి ప్రయత్నించేవాడు. కావలసిన వస్తువులు అవీ ఇవీ కొనిపెట్టేవాడు. సినిమాలకీ, స్నేహితుల ఇళ్లకీ తీసుకెళ్లేవాడు. ఇన్ని చేసినా ఆమెకి అతనిమీద మంచిభావం ఏమీ ఏర్పడలేదు. మాటిమాటికీ ఏదో ఒకటి ఫిర్యాదు చేసేది. ఇదంతా తన పెళ్లివల్లే అనుకునేది. దీనికి సాయం, ఇద్దరుపిల్లలు పుట్టడంతో ఆమె మానసిక ప్రకృతి బాగా మూర్ఖపు పట్టులోకి దిగింది.

ఏరోజైనా శేషాద్రి ఆఫీసునుండి ఇంటికి త్వరగావస్తే, పిల్లల్ని ఎక్కడికైనా తీసుకెళ్లమని పట్టుపట్టి వేపుకు తినేది. ఆఫీసులో రోజల్లాపనిచేసి, అలసిపోయానని చెప్పినాసరే, ఆమె చెప్పినట్లుచేసేదాకా ఊరుకొనేదిగాదు.

ఒక్కొక్కప్పుడు ఏ కారణం లేకుండానే ఇట్టే కోపం వచ్చేదామెకి. ఆసమయంలో ఆమెను చూసీ చూడనట్లు ఊరుకొంటే ఏదో జబ్బుగా వున్నట్లు నటించేది. వెంటనే నౌఖర్లని పిలిచి పిల్లల్ని ఊరుకోబెట్టమని, ఆమె కెవరూ దిక్కు లేనట్లు ముక్కుతూ, మూలుగుతూ పడుక్కునేది. నిజంగా శేషాద్రికి భార్య అంటే ఎక్కువ ప్రేమ. ఆమె ఎంత గయ్యాళితనంగా ప్రవర్తించి, ఎన్ని తప్పులు చేసినాసరే, అన్నిటినీ మరచిపోయేవాడు. ఆమె నిజంగా బాధపడు

రచన:
"అంగీరస"

తోందని తెలిసి, మిక్కిలి ఆత్రంతో డాక్టరుని పిలిచి చూపెట్టేవాడు. రానురాను ఆమె చేసేదంతా నటన అని గ్రహించాడు. తన్నా విధంగా అవమాన పరుస్తోందని తలచసాగాడు. ఇటుపైన మళ్ళీ అలాజబ్బు వచ్చినట్లు పడుకొంటే ఏమీ ఎరగనట్లు మాట్లాడ కూరుకోవడమే దానికి తగినమందని గ్రహించాడు.

ఇంకో విషయం కూడా వుంది. మొట్ట మొదట్లో శేషాద్రి జీతంరాగానే బాకీ లవీతీర్చమని పూర్తిగా భార్య చేతి కిచ్చేవాడు. కొాదని, అతని కవసరం వచ్చినప్పుడు డబ్బు అడిగితేఆమె విసుక్కునేది. ఇది చాలాఆశ్చర్యం వేసిందతనికి. అందుచే మాటా, మాటా పట్టింపువచ్చేది. అప్పుడు, వాళ్ళిద్దరికీ మాట పట్టింపు లేకుండా, దెబ్బలాట రాకుండా ఉండడానికై సరిగ్గా ఎవరి కెంతఇవ్వాలో, అంత డబ్బుమాత్రమే ఆమె చేతికిస్తూ వచ్చాడు. అందుచే ఆమెకి మరింత బాధ కలిగేది. అయినా మిగిలిన డబ్బు అతనివద్ద ఉండంచేత, శేషాద్రి ఏమీ లెక్క చేసేవాడు గాదు. ఆఫీసులో ఆలస్యంగా పనిచేసి, సరిగ్గా భోజనంచేసి పడుక్కునే వేళ ఇంటికి రావడం శేషాద్రి, జానకిల మధ్య వివాదానికి మరికొంత హేతువయింది. కొన్ని కొన్ని సమయాల్లో తను ఆఫీసులో ఆలస్యంగా పని చేయవలసివస్తుందనీ, అందుచే మాటిమాటికీ, తన్నిలా విసిగించి మాటలాడడంవల్ల ఏమీ లాభంలేదనీ ఆమెకి నచ్చ జెప్పడానికి ప్రయత్నించేవాడు.

అంత క్రితంరోజు సాయంకాలం ఇంటికి ఆలస్యంగా వచ్చినందుకు, మర్నాడు ఉదయాన్నే పెద్ద తుఫాను లేవదీసింది జానకి. ఆమె అతన్ని ఎంతలా వేధించుకు తిందంటే, శేషాద్రి తక్షణం మాట్లాడకుండా బట్టలు వేసుకొని, భోజనం చేయకుండానే ఆఫీసు వేళకి ముందుగానే వెళ్ళిపోయాడు.

అతని అదృష్టవశాత్తూ, ఆ ఇంటిలో, రామమ్మ అనే వంటమనిషి వుంది. ఆమె



బాగా వయసు మళ్ళిన అనుభవజ్ఞురాలు. ఇంటిలో ఎంత గందరగోళం జరిగినా సరే తన పనిని మాత్రం యథాప్రకారం చేసుకు పోయేది. ఆమె వంటపని అయ్యాక పిల్లల్ని జాగ్రత్తగా చూస్తూ వుండేది. ఈమె మీద ఆధారపడితే తనకి భోజనం తప్పక పంపుతుందని శేషాద్రికి తెలుసు.

అందుచే ప్రత్యేకం ఆ రోజున ఇంటికి వెళ్ళి భోజనం తీసుకురమ్మని ఆఫీసునౌఖరిని పంపాడు. వాడు తిన్నగా దొడ్డిదోవని వంటగది దగ్గరికి వెళుతున్నాడు. జానికి వాడిని మేడమీదనుండి చూసి పైకిరమ్మని పిలచింది. వాడువెళ్ళగానే "ఆయనకి ఆఫీసు పనంటే చాలాఇష్టం. కనుక, ఈ బెడ్డింగు తీసుకెళ్ళి, ఇటుపైన అక్కడేతిని, అక్కడే పడుకొంటుండమని చెప్పు" అంది. నౌఖరు దానికి వప్పుకోలేదు. కాని, ఆమె ఇదివరకే ఒక జంబుఖానా, దుప్పటి, తలగడా ఇవన్నీ చుట్టచుట్టి ఉంచడంవల్ల వాటిని తప్పకుండా తీసుకెళ్ళమని నిర్బంధించింది. ఇంట్లోవున్న నౌకర్లందరికీ శేషాద్రంటే ఎంతో గౌరవం. అందుచే వాళ్ళకి అతని మీద చాలా జాలి వేసింది. బెడ్డింగు తీసుకెళ్ళక పోతే ఏమి ప్రమాదం వస్తుందో అని ఆ నౌఖరు దాన్నికూడా తీసుకొని వెళ్ళిపోయాడు.

నౌఖరు బెడ్డింగు నెత్తిమీద పెట్టుకొని వెళ్ళే సరికి ఆఫీసులోని తక్కినవుమాస్తాలంతా ఆశ్చర్యపోయారు. శేషాద్రికూడా ఏమి జరిగిందో తెలియక వాడేం చెబుతాడో అని చూస్తున్నాడు. అంతా విన్నాక తనుచేసిన తెలివితక్కువపని తెలుసుకొని మళ్ళీ ఆ బెడ్డింగుని ఇంటికితీసుకు పొమ్మని నౌఖరుతో చెప్పాడు. కాని ఆఫీసుటైము అయ్యేదాకా ఇక్కడే ఉండ నివ్వమని నౌఖరు బ్రతిమాలాడు. శేషాద్రిఅంతా తెలుసుకొని మాట్లాడ కూరుకొన్నాడు. నౌఖరు వెళ్ళిపోగానే రామమ్మని పిలిచి తనకి తెలియకుండా శేషాద్రికి భోజనం ఎందుకు పంపారని కేకలు వేసింది జానికి. దానిమీద రామమ్మకీ, ఆమెకీ మాటామాటావచ్చింది. ఇంతలో ఆరేళ్ళకుర్రవాడు బుచ్చిబాబు వాళ్ళిద్దరి మధ్యావచ్చి, చాక్లేటు పెట్టమని తల్లిదగ్గరికి వెళ్ళాడు. జానికి వాడిని చాలా సార్లు ప్రక్కకి తోసేసింది. వాడు చాక్లేటు కోసంఏడవడం ప్రారంభించాడు. ఆమెకి వళ్ళుమండి కోపంతో వాడిని కర్రపుచ్చుకొని నాలుగుదెబ్బలు కొట్టింది. వాడు బాధతోఏడుస్తూ వంటగదిలోవున్న రామమ్మ వద్దకి వెళ్ళిపోయాడు. రామమ్మ చాలా ఉత్తమురాలు. యజమానురాలియందు చాలా గౌరవం. ఆమెచెప్పిన పనులన్నిటినీ కూడా సాధ్యమైనంత త్వరలో పూర్తిచేసేది. ఆమె ఎన్నిమాటలన్నా పల్లెత్తు మాటకూడా అనకుండా శాంతంగా వూరుకొనేది. యజమానురాలు కోపంగా వున్నప్పుడు ఏదో విధంగా ఆమె కోపాన్ని తగ్గించేది. కాని, ఇప్పుడా కుర్రవాడిని కోపంతో అలా కొట్టగానే ఆమె మనస్సు చివుక్కుమంది. వెంటనే ధైర్యంచేసి, జానకితో "మీకోపాన్నంతా చంటిపిల్లాడి మీద చూపెట్టడం చాలాపాపం" అంది ఆఖరికి రామమ్మ. అది విని జానికి చర్రుమంటూ లేచింది. "నాయింట్లో వుంటూపైగా నన్నే మాటలంటున్నావా? తక్షణం ఈ ఇంట్లోంచి వెళ్ళిపో!" అంటూగట్టిగా అరచింది. కుర్రాళ్ళనిద్దర్నీ తీసుకొని రామమ్మ వంటగదిలోనికి వెళ్ళిపోయింది. జానకి ఇంక ఆ ఇంటిలో ఉండడం భరించలేక ప్రక్కవాళ్ళింటికి వెళ్ళిపోయింది.

రామమ్మ ఒక్కసారి చలించిపోయి, కళ్ళ నీళ్ళు పెట్టుకొని వంటపనిలోనికి దిగింది. చంటిపిల్లాడు బొమ్మలతో ఆడుకొంటున్నాడు. బుచ్చిబాబు నెమ్మదిగా లేచి అవతలకి వెళ్ళాడు. తల్లి కొట్టిన దెబ్బలు మరచి, వీధిలోనికి వెళ్ళి తక్కిన చిన్న పిల్లలతో ఆడుకొంటున్నాడేమోనని రామమ్మ అనుకొంది. వంట తయారు చేసింది. ఆఫీసునౌఖరుమళ్ళీ శేషాద్రికి మధ్యాహ్నం భోజనం తీసుకెళ్ళడానికి వచ్చినప్పుడు ఇల్లంతా ప్రశాంతంగా నిశ్శబ్దంగా వుంది. రామమ్మ చంటిపిల్లాడికి ఓ మెతుకు నాకించి వాడిని నిద్రబుచ్చింది. పొయ్యి వెలిగించి, వంట వండి నట్లుకపడకుండా, వంట ఇల్లంతా శుభ్రం చేసింది. తన్ను ఇంట్లోంచి వెళ్ళిపొమ్మని యజమానురాలు చెప్పింది. అందుచే మాటప్రకారం నిజంగా వెళ్ళిపోయిందని ఆమె అనుకొనేటట్లుగా రామమ్మ ఇల్లంతా చక్కబెట్టింది.

జానకి మళ్ళీ తిరిగివచ్చి చూసే సరికి ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. రామమ్మ భోజనానికి పిలవలేదు. వంటింట్లోకి వెళ్ళి చూసింది. రామమ్మ గాఢంగా నిద్రబోతోంది. ఆమెకి కోపం ఎక్కువ అవసాగింది. ఈలోపుగా చంటిపిల్లాడు లేచి "అమ్మా" అంటూ పిలచాడు. "ఊరుకో! వెధవాయ్!" అంటూ గట్టిగా కసిరింది. వాడు ఏడ్వసాగాడు. ఆమెకి విసిగెత్తి ఒక్క చెంపకాయ వేసింది. దాంతో వాడు మరీ గట్టిగా గోల చేస్తూ ఏడ్వసాగాడు. ఈ ఏడుపు విని రామమ్మ ఉలికి పడిలేచి కుర్రాడున్న మంచం వద్దకి వెళ్ళింది. "చంటి పిల్లాడిని అలా కొట్టడానికి మీకు చేతు లెలా వచ్చాయమ్మా" అంది గట్టిగా. జానకి ఒక్కసారి నాలుగువైపులా చూచి, వంట వండినట్లు ఎక్కడా ఆనవాళ్ళులేకపోవడంవల్ల తిన్నగా మేడమీది గదిలోనికి పోయి లోపల గొళ్ళెం పెట్టుకొంది. తరువాత రామమ్మకి జాలివేసి భోజనం పైకి తీసుకెళ్ళింది.

మధ్యాహ్నం అయింది. బుచ్చిబాబు జాడ ఎక్కడా లేదు. రామమ్మకి కంగారెత్తి, వీధిలోకి వెళ్ళి ఇరుగు పొరుగు వాళ్ళని అడిగింది. కాని, ఎవ్వరూ ఎరగమన్నారు. ఈ సంగతి జానకితో చెప్పాలి. ఎంతపని జరిగింది? అహంభావంతో చీటికి మాటికీ దెప్పిపొడుస్తూ, నానాకష్టాలు పెట్టిన జానకి, ఒక్కసారి గుండె బ్రద్దలయి ఏడుస్తున్న

తల్లిగా మారిపోయింది. ఈ వార్త వినగానే ఏకధాటిగా ఏడుస్తూ కూర్చొంది. ఎంత ఓదార్చినా లాభం లేకపోయింది. తన్ను తానే నిందించుకుంది. శేషాద్రి మామూలు కన్న కొంచెం త్వరగా ఇంటికొచ్చి చూసే సరికి ఇల్లంతా పెద్ద గోలగా వుంది. భార్య ఏడుస్తోంది. నౌఖర్లు, ఇరుగు పొరుగు వాళ్లు కంగారుగా ఇటూఅటూ పరిగెడుతున్నారు. ఈ గోల, హడావిడి అంతా ఏమిటని అడిగాడు. అతను ఆరోజు ఉదయం ఇంటినుండి వెళ్లిన తరువాత జరిగిందంతా చెప్పారు. అది విని శేషాద్రి మిక్కిలి వ్యథ చెంది, భార్యతో కూడా మాట్లాడ్డానికి ఇష్టపడ లేదు. ఈ కష్టాలన్నిటికీ ఆమే కారణం. అప్పటికి చీకటి పడుతూ వుంది. కుర్రాడి గురించి ఆతురత ఎక్కువవుతోంది. బుచ్చిబాబు ఎక్కడికి వెళ్ళాడో అతనికి తెలియదు. అయినా తప్పకుండా వెళ్లి వెధకాలి. అతనూ, కొంతమంది ఇరుగు పొరుగు వాళ్లు, లాంతర్లు పట్టుకొని వెళ్లి వెదికారు. కాని పిల్లాడి జాడ ఎక్కడా లేదు. ఇంక వెనక్కివచ్చి, కొంచెం విశ్రాంతి తీసుకోమని, కూడా వున్నవాళ్లు ఎన్నోసార్లు చెప్పారు. కాని కుర్రవాడు లేకుండా వెనక్కి తిరిగి రానన్నాడు. ఇటువంటి సమయంలో కూడా, శేషాద్రి వచ్చి, తనతో మాటలాడకపోవడం, జానకికి మరొక గట్టి దెబ్బతగిలినట్లయింది. ఆమె గట్టిగా ఏడుస్తూ, తన ప్రవర్తననీ, నోటి దురుసుతనాన్నీ, అనేకసార్లు నిందించుకొంది. తాను అలా అవడానికి కారణం ఏమిటని తన్ను తానే ప్రశ్నించుకుంది. ఈ స్థితిలో జానకిని చూసే సరికి రామమ్మకి జాలివేసింది. ఏడ్వడం మానివేయమని ప్రార్థించింది. కుర్రాడు ఇంకా కనబడలేందీ అలా ఏడవడం చాలా తప్పని చెప్పింది. ఎంత చెప్పినా వినక, అన్నం మానివేసి, అల్లాగే ఏడుస్తూ, కూర్చుంది. తను కొట్టిన దెబ్బలకి, బుచ్చిబాబు అంతలా బాధపడి, ఇల్లు విడచి, వెళ్ళిపోతాడని, ఆమె కలలో గూడా అనుకోలేదు. కోపంతో కుర్రాడిని కొడుతున్నప్పుడు, తానేమి చేస్తోందో కూడా, ఆమెకి తెలియలేదు. ఈ మూడేళ్ళనుండీ జానకిలో కొద్ది కొద్దిగా మార్పు కలుగుతున్నట్లు, శేషాద్రి కనిపెట్టగలిగాడు. పెళ్ళి అయిన కొత్తరోజుల్లో, అతను చాలా నిరాశ చెందాడు. కాని అతను చాలా ఓర్పుగల మనిషి. తన ప్రాణం కన్న ఎక్కువగా ప్రేమిస్తున్న ఆ ఇద్దరు పిల్లలే అతనికి సర్వస్వమూను. కుర్రాడు ఇంట్లోంచి వెళ్లిపోవడానికి తల్లే కారణమని తెలిసి, అతనికి ఆమె మీద పట్టరాని కోపం వచ్చింది. ఆ రాత్రి వెదకటానికి వెళ్ళేముందు, కాఫీహోటల్లో కొద్దిగా ఫలహారం చేశాడు. లాంతరు చేతిలో సైకిల్ పట్టుకొని, చెట్లకింద, సైకు కాలవల్లోనూ, సందు గొందుల్లోనూ, అంతా జాగ్రత్తగా వెదికాడు. కాని ఎక్కడా జాడ కనిపించలేదు. కటిక చీకటికి సాయం, నాలుగు వైపులనుంచీ గాలి హోరుమంటూ వీస్తోంది. అతని గుండె మామూలుకన్న ఎక్కువ వేగంగా కొట్టుకో సాగింది. అర్థరాత్రి సమయంలో, భయంగొలిపే ఆ పరిసర ప్రాంతాల్లో, కుర్రాడిని వెదకడానికి నిజంగా అతనికి కొంచెం భయం వేసింది. ఎల్లాగైనా బుచ్చిబాబుని వెదకాలనే ఆతురత, పట్టుదల ఎక్కువయింది. కుర్రాడు అటువంటి భయంకరమైన పరిసరాల్లో ఎక్కడా కనిపించనందుకు అతనికి కొంత ఊరట కలిగింది. అందుచే ఎక్కడో మరొకచోట బ్రతికి వుంటాడనే ఆశ అతనిలో పొడసూపింది. తెల్లవారేదాకా వదికాడు. కాని ఎక్కడా కనబడలేదు. అందుచే మళ్లీ ఇంటికొచ్చి, ముఖం కడుక్కొని, బట్టలుమార్చి, ఆరోజంతా ఆఫీసుకి సెలవు పెట్టి మళ్లీ వెదకడం ప్రారంభించాడు. భార్యని మాట్లాడ్డానికి నిరాకరించాడు. ఆమె అంతలా బాధపడుతుందని శేషాద్రి ఎప్పుడూ తలచలేదు. జానకి, అన్నం తినకుండా, గదిలో, లోపల గడియవేసుకొని, ఆ రాత్రంతా ఏడుస్తూ కూర్చుందని శేషాద్రికి తెలియదు. బలవంతం మీద, వెదకడానికి సత్తువగా ఉండేందుకు, శేషాద్రి కొద్దిగా ఎంగిలిపడ్డాడు. టాక్సీగాని, సైకిలుగాని లేకుండానే బుచ్చిబాబుని వెదకడానికి బయలుదేరాడు. ఒకరోడ్డు వెంబడిపోతున్నాడు. కూలీలు చద్దిమూటలు పట్టుకొని పనిలోనికి పోతున్నారు. ఎరిగున్నవాళ్లు, బుచ్చిబాబు విషయమై, శేషాద్రిని ప్రశ్నించారు. కాని అతను మాట్లాడకుండా, తలతిప్పుతూ, నడిచిపోతున్నాడు. అతనికళ్లు, చెవులు, చాలా తీక్షణంగా వెదుకుతున్నాయి. ఎన్ని మైళ్లు నడచినట్లు అతనికి గుర్తేలేదు. అందుచే ఇంక నడవడానికి ఓపిక లేక, అలసిపోయి, ఒక పెద్దగేటువద్ద కూర్చుండి పోయాడు. హఠాత్తుగా చిన్నపిల్లలు, ఆడుకొంటూ, నవ్వుతూ, కేరింతాలు కొడుతున్నట్లు అతనికి వినబడింది. కలగంటున్నాడేమోనని, ఒక్కసారి కళ్లు నలుపుకొన్నాడు. కాని మళ్లీ యథాప్రకారం వినబడుతోంది. అది నిజమే! కాని అతను ఎక్కడున్నాడో తెలుసుకోలేకపోయాడు. అతను ప్రస్తుతం ఒక అనాధ శరణాలయం గేటువద్ద ఉన్నాడని అతనికి గుర్తేలేదు. లోపలికి వెళ్లి ఆపిల్లల్ని చూడాలనిపించింది. కొడుకు తప్పిపోవడం అతనికి తీరనినష్టంకలిగినట్లయింది. అందుకు అతను ఎక్కువగా బాధపడి కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు. నెమ్మదిగా తేచి లోపలికి వెళ్లిచూశాడు. లోపలికిదారి తిన్నగా వుంది. పిల్లలగొంతుకలు కూడా స్వచ్ఛంగా వినబడుతున్నాయి. అతను ఇంకా ఆశతో లోపలికి వెళ్లాడు. ఆశ్చర్యం! తక్కిన పిల్లలతో, కేరింతాలు కొడుతూ, నవ్వుతూ, నిశ్చింతగా ఆడుకొంటున్న బుచ్చిబాబుని చూశాడు. "బుచ్చిబాబూ!" అని కేక వేశాడు. అదివిని బుచ్చిబాబు ఒక్క పరుగున తండ్రి వద్దకివచ్చి, అతన్ని కౌగలించుకున్నాడు. కుర్రాడిని హృదయానికి హత్తుకొని, సంతోషబాష్పాలు రాల్చాడు. తక్కిన పిల్లలంతా నిర్ఘాంతపోయి చూస్తున్నారు.

ఆ చిన్నపిల్లలికి, అక్కడనుండి పారిపోవాలో, ఆడుకోవాలో, లేక ఇంతవరకూ ఎప్పుడూ చూడనటువంటి ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడాలో, అర్థం గాలేదు. వాళ్లు అల్లాగే చూస్తూ నిలబడ్డారు. ఇంతలో ఉన్నట్టుండి చిన్న గడబిడ బయలుదేరింది. శరణాలయ అధికారిణి అక్కడికి వచ్చి. కుర్రాళ్లని నాలుగు కేకలు వేసి, వాళ్ళని చెదరగొట్టి పంపివేసింది. ఆమె తిన్నగా బుచ్చిబాబు వద్దకు వెళ్లి, తండ్రి దగ్గరనుంచి ఇవతలకి లాగి "మీ రెవరు?" అంటూ శేషాద్రిని ప్రశ్నించింది.

"అమ్మా! వీడు నాకొడుకు! నేను వీనిని తీసుకు పోవచ్చునా?" అన్నాడు.

"మీ కొడుకు అవునో, కాదో నాకేం తెలుసు?" అంది గట్టిగా. "ఈ పిల్లాడిని మీరు ఎత్తుకు పోవడానికి వచ్చినట్లున్నారు. అట్టేమాట్లాడితే పోలీసులనుకూడా పిలవవలసి వస్తుంది."

"లేదండీ! లేదు! నన్ను నమ్మండి," అని బ్రతిమాలాడు.

"నిజం అయితే ఈ పిల్లాడు ఇక్కడికెల్లా వచ్చాడు," అంది ఆమె.

"ఆ పిల్లాడినే అడగండి," అన్నాడు.

ఆ పిల్లాడిని ఎప్పుడూ చూసినట్లు అగుపడకపోవడంవల్ల ఆమెకి అతని మాటల యందు కొంత నమ్మకం కలిగింది. అయినా, అది అవునో, కాదో నిర్ధారణచేయదలచింది. తక్షణం తక్కిన పిల్లల్నందరినీ పిలచి హాజరు తీసుకొంది. బుచ్చిబాబు అక్కడివాడు కాదని రూఢి అయింది. అయితే, ఇక్కడికెల్లావచ్చాడు? ఆమె శరణాలయంలోని తక్కినవాళ్లని అడిగింది. కాని, వాళ్లు మాకేం తెలియదన్నారు. అది చాలా వింతగాతోచింది. అనవసరంగా కాలం

వ్యర్థబుచ్చేకన్న, తిన్నగా ఆ పిల్లాడినే అడిగితే తెలిసిపోతుందని అనుకొంది.


బుచ్చిబాబు, తండ్రివద్దకి వెళ్లి చిన్నపిల్లల్లా, నవ్వుతూ, తనకథంతా చెప్పాడు. తల్లి కొట్టడంవల్ల ఇంట్లోంచిపారిపోయి వచ్చానని చెప్పాడు. శరణాలయ అధికారిణి అవునో, కాదో అని చొక్కా పైకెత్తి చూసింది. వంటిమీద ఎర్రగా కందిపోయిన దెబ్బలు ఇంకా వున్నాయి. అప్పుడు తిన్నగా బజారులోకిపోయి ఒక గోడవద్ద ఏడుస్తూ కూర్చొన్నాడట. ఇంతలో ఒక దుకాణం ఎదురుగుండా పెద్దలారీ ఆగి వుండటం చూశాడట. అప్పట్లో అందులో ఎవ్వరూ లేరు. దానినిండా ఏవో పెకేజీలు, కూరగాయలు మొదలైనవి ఉన్నాయట. నెమ్మదిగా డ్రైవరు కూర్చునే సీటుమీద నుంచి పైకి ఎగ్రబాకి. లారీలో ప్రవేశించి ఆ సామానుల మధ్య కూర్చొన్నాడట. తక్షణం నిద్రపోవడంవల్ల తరువాత ఏంజరిగిందో తెలియలేదట. ఇంతలో లారీ ఒక్కసారి ఆగడంవల్ల తెలివివచ్చిందట. అప్పుడు చాలామంది పిల్లలు లారీని చుట్టుముట్టి, లోపలికి కొంతమంది ఎక్కారట. పెద్దవాళ్లు పెద్దవస్తువులు, చిన్నవాళ్లు, చిన్నవి క్రిందకిదింపి మోసుకు పోతున్నారట. వాడుకూడా లేచి, వస్తువులు దింపడంలో, వాళ్లకి సహాయంచేసి తరువాత వాళ్లవెంబడే వెళ్లిపోయాడట. ఆపిల్లల కేరింతాలలో, ఆటలలో తన కష్టాలన్నీ మరచిపోయాడట.

బుచ్చిబాబు చెప్పిన ఈ కథంతావిని తండ్రి ఏడ్వసాగాడు. కుర్రాడికి అంత బాధ కలిగించడానికి ఎంతక్రూరంగా శిక్షించి వుంటుందో తనభార్య అనుకొన్నాడు. బుచ్చిబాబు చెప్పిందంతా విని తృప్తిచెంది, వాడిని తండ్రికి వప్పగిస్తూ, ఇకముందు వానిగురించి చాలా జాగ్రత్త తీసుకోమని చెప్పి, వెళ్లిపోయింది శరణాలయ అధికారిణి. పట్టరాని సంతోషంతో కుర్రాడిని ఎత్తుకుని, ఇంటికి బయలుదేరాడు. దావపొడుగునా ఆ శరణాలయంలో తను ఎట్లా గడిపిందీ, అక్కడిపిల్లలు ఎట్లావున్నదీ మొదలైన సంగతులన్నీ తండ్రికి చెప్పాడు బుచ్చిబాబు.

పాపం! బుచ్చిబాబు కేం తెలుసు. తను చేసిన ఈ పనివల్ల ఇంటివద్ద ఏం జరిగిందో! తండ్రి సంతోషంతో కొడుకుని ముద్దు పెట్టుకొని, ఇంకఎప్పుడూ ఇల్లువదలివెళ్లనని వాడిచే వొట్టు వేయించుకున్నాడు. కొడుకు చేసిన ఈ నేరానికి, తల్లి మళ్లీ కోపంతో కొడుతుందో, లేక మాటలతో వాడి హృదయాన్ని నొప్పిస్తుందో, శేషాద్రికి అర్థంకా లేదు. నెమ్మదిగా దొడ్డిదోవని వంటటింట్లోకివెళ్లి, రామమ్మని నెమ్మదిగా పిలిచాడు. రామమ్మ అమిత సంతోషంతో తండ్రి కొడుకుల్ని చుట్టుముట్టి, బుచ్చిబాబుని తండ్రివద్దనుంచి తీసుకొని, ఎత్తుకొని వంటినిండా ముద్దులవర్షం కురిపించింది.

"జానకి ఎల్లాగుందికి?" అని శాంతంగా ప్రశ్నించాడు శేషాద్రి. "ఏం! చెప్పను బాబు. నే నెప్పుడూ అటువంటి విచారకరమైన దృశ్యం, చూడలేదు. రాత్రస్తమానూ ఆగదిలో కూర్చొని అబ్బాయిని తలచుకొని ఒకటే ఏడుపు. ఒక్కక్షణం సేపుకూడా ఊరుకోలేదు. నేను చంటిబాబుని ఆమె వద్దకి తీసుకెళ్లడం మీరు చూశారుగదా? ఎంతమార్పు వచ్చిందనుకొన్నారు? చంటబ్బాయిని ఎత్తుకొని సంరక్షణచేసింది. తరువాత అలా ఏడుస్తూనే, తనకొడుకుని ఇంట్లోంచి వెళ్లగొట్టిన పాపాత్మురాలనని, ఎన్నోసార్లు తన్నుతాను నిందించుకొంది. ఆమెని చూడడానికి చాలా జాలివేస్తోంది బాబుగారు" అంది. "దేముడు దయతలచాడు రామమ్మా! మళ్లీమనవాడిని మనకి తిరిగి ఇచ్చాడు. అందుచే ఒకళ్లమీద మనకి కోపం ఎందుకూ?" అంటూ నిట్టూర్పు విడచాడు. "మే మిద్దరంగూడా నిన్నరాత్రి నుంచీ అమిత బాధపడ్డాం. దీనివల్లనైనా ఒక గుణపాఠం నేర్చుకున్నామని నేను తలుస్తున్నాను." అన్నాడు శేషాద్రి.

రామమ్మ కుర్రాడిని ఎత్తుకొని మేడ మీదకి వెళ్లి తలుపుకొట్టింది. "అమ్మగారు! తలుపుతీసి ఓసారి చూడండి ఎవరు వచ్చారో త్వరగా తీయాలి!" అంటూ ఉత్సాహం



“ఎక్కడినుంచి అండీ ఉత్తరం.”

“ఆ! మీ పెద్దమ్మగారికి ఎక్కువగా ఉందట!”

“సరే...ఇదా ... ఇంత మాత్రానికే ఆఫీసుపని వదిలేసి వచ్చారన్నమాట...”

“బాగుండే, ఆవిడ నీ కోసం కలవరిస్తోందని, నిన్ను వెంటనే రమ్మనమని ఆయన వ్రాస్తే...”

“ఊ...ఎప్పుడూ ఎక్కువగానే ఉందనటమూ..... తేపా వెళ్లటమూ......మళ్ళీ గండం గడచి ఒడ్డున పడ్డ దనుకుంటూండటమూను” అంది విసుగ్గా భర్త తెచ్చిన ఉత్తరం చదువుతూ లక్ష్మి.

“సరే...బాగా ఉంది. మరి వెయ్యో... రెండు వేలో, రెండెకరాలో ఆవిడ దగ్గఱనుంచి వచ్చేటప్పుడు ఈ మాత్రం శ్రమకే.” అని ఇంకా ఏమో అనబోతున్న భర్తను ఆపి, పక్క భాగంలో ఉన్న ఇల్లాలు తమ సంభాషణల నెప్పుడూ అత్యంత కుతూహలంతో విన ప్రయత్నిస్తుంద నేమాట గుర్తుకు తెచ్చుకొని, లక్ష్మి విసుగుస్వరాన్ని తక్షణం గాద్గదికంగా మార్చి ఇలా అంది.

“డబ్బు..డబ్బు...అంటూ రెప్పుడూను. వెయ్యి అయితేం...రెండు వేలైతేం...ఎవడికి కావాలి? చెట్టుఅంత మనిషే పోతే ఈ వేలూ, పదివేలూ ఎందుకు? నన్ను పెంచి పెద్దజేసింది మా పెద్దమ్మే!” అని ఇంచుమించు ఏడుస్తూ, “మీరు హోటలు భోజనం చేసి ఎలా నెట్టుతారా అనిగాని లేకపోతే నేనే వెళ్లి ఉపచారం చెయ్యాల్సినదాన్ని...పైపెచ్చు....కందిరీగల్లాగా ఈ నలుగురు పిల్లలూను. కాపురానికి వచ్చి పదేళ్లన్నా కాలేదు.” అని అంది.

“దబ్బున కానియ్యి పని మరి...శెలవు పెట్టి వచ్చా...సాయంకాలం రైలు దాటితే...మళ్లీ” అని లక్ష్మీపతి గబగబా సామాన్లగదిలోకి వెళ్లాడు.

* * *

అతి కష్టంమీద కొంతసేపటికి పెద్దమ్మ లక్ష్మిని గుర్తుపట్టింది. కాని, నోట మాట రాలేదు. లక్ష్మి నలుగురి పిల్లల్నీ పక్కన పెట్టుకొని, కన్నీళ్లు ఏకధాటిగా కారుస్తూ రోగిచేతులు నిమురుతోంది. తను కిందటిసారి వచ్చి చూసివెళ్లినప్పుడు రోగిమెడలో నున్న ఆభరణాలు ఇప్పుడు లేవు. చేతుల కొక్కొక్క గాజుమటుకే ఉన్నయ్. వ్యాధిగ్రస్తురాలి యాతనకన్న వీటి ఆజా[illegible] ముఖ్యమైందిలక్ష్మికి. కొంచెం నిరుత్సాహం కూడా కల్గింది.

ఇంట్లోకి పోయి లోపల నలుమూలలా

తో కేక వేసింది. జానకి తలుపు తీసేసరికి శేషాద్రి అక్కడ వున్నాడు. భర్తనీ, కొడుకునీ చూసేసరికి జానికి అపరిమితానందంతో ఇవతలికి వచ్చి, కొడుకుని ఎత్తుకుని, హృదయాని కదుముకొంది. తరువాత, తనుచేసిన తప్పు లన్నింటినీ క్షమించమని భర్తపాదాలమీద వ్రాలింది. ★

చూసింది. రైలువెళ్ళిపోయిన ప్లాటుఫారంలా ఉంది ఇల్లు. ఎక్కడా ఏమీ సామాను కన్పించదు.

భోజనాలయ్యాక ఒంటరిగా పెట్టెలగది లోకి వెళ్ళింది. గదితలుపు గడియ వేసుకుంది. ఎవరైనా వచ్చినా బట్ట కట్టుకుంటున్నానని చెప్పవచ్చు. సామాన్లూ, గుండిగెలు, కళాయిలు లేకపోతే ఏం? బట్టల పెట్టెలుంటే చాలు. వాటిల్లోనే నగలూ ఉంటయ్. పెద్దతండ్రి కివేమీ మనస్కరు పట్టవని, తనకోసమే పెద్దమ్మ నగలూ, నాణ్యాలూ, సిల్కుచీరెలూ ఎవరికీ తెలియకుండా ఈమూల పెట్టెల్లో దాచి ఉంచుతుందని లక్ష్మికి తెలుసు. మెల్లగా పెట్టెలపై గుడ్డలను తీసింది. కాని, తెరిచి చూసేటప్పటికి, లక్ష్మి రెండుకళ్ళూ నిలువుగుడ్లు వేసినయ్. ఇత్తడి మట్టెలూ, చినిగిన పాత బట్టలూ, ఇంకా అలాంటి పాతవేవో ఉన్నయ్.

లక్ష్మికి ముచ్చెమటలు పోసినయ్. కళ్ళవెంట నీళ్ళుకూడా వచ్చినయ్. రోషంతో మగ్గింది. తలుపులు తీయగానే, వంట-అది చేస్తూ, ఇల్లు కనిపెట్టున్న ముసలిచుట్టం కనబడి కంగారుపడ్డది. భర్తను చాటుకు పిలిచింది.

గదిలోంచి తిరిగివచ్చే లక్ష్మిముఖం వెండి బంగారాలతో, పట్టుచెక్కు చెమ్కీలతో కలకలలాడుతూ పున్నమాకాశంలా ఉంటుందనుకొన్న లక్ష్మీపతి వెలవెలబోతూ, పాలిపోతున్న భార్యముఖమూ, కళ్ళూ చూసి అన్నాడు.

"రైలుఖర్చులు దండగేనా!"

"అంతా చెయ్యిజారిపోయాక వచ్చాం" అంది లక్ష్మి. స్వంతఇంట్లో కన్నం వేసి దొంగలు అన్నీ ఎత్తుకుపోయిన ఆసామిలా ఉంది లక్ష్మి.

"అప్పుడే దిగులు పడకు...ప్రయత్నించినకొద్దీ ఫలం అన్నారు." అని తారక మంత్రం ఉపదేశించి మెల్లగా వసారాలోకి వెళ్ళాడు భర్త.

* * *

పొలంనుంచి తిరిగివచ్చిన పెద్దతండ్రివద్ద గంటసేపు కూర్చొని పెద్దమ్మనుగురించి వాపోయింది లక్ష్మి. వ్రాసినదే తడవుగా ఎప్పటికప్పుడిలా ఏమీ వ్యయ పయాస అనుకోకుండా ఈ కూతురు, అల్లుడు వస్తూండటం సంతానంలేని పెద్దతండ్రికి ఎంతో తృప్తిగా ఉంది.

"కాస్త...ఎక్కువచేస్తే చాలు...పడే పడే నీకోసం కలవరిస్తుంది. వేరే రామ నామస్మరణ లేదు." అన్నాడు.

"మా అమ్మకన్నా, ఆవిడను నే నెఱుగను. నాకు పెద్దమ్మే అమ్మమ్మా; నాన్నా. ఇంతకీ దేవుడు ఆమెను మహాబాధ పెట్టున్నాడు. ఎన్నాళ్ళనుంచి తీసుకుంటోంది! ఈసారి మాటకూడా పోయింది. బహుశ ఒకరోజు, రెండురోజులు తప్ప మన దగ్గర ఉండే అదృష్టం లేదు." అంది లక్ష్మి, ఊ అంటే వచ్చే కన్నీళ్ళతో.

దుఃఖంతో చింతాక్రాంతుడైన పెద్దతండ్రి కొలదోశపయాక మెల్లగా ఆరంభించాడు.

"మొన్న బస్తీనుంచి వైద్యుడిని పిలిపించాను. ఇంకా ఇలాగే కొన్నాళ్ళీడుస్తుందన్నాడు. లక్ష్మి అందుకుంది.

"వాళ్ళు అలాగేఅంటూఉంటారు. ప్రాణి పోయేదాకా వచ్చినంతవరకూ వసుక్కుంటూ ఉంటామనే వాళ్ళకు. ఇలా ఆశ చూపెడుతూ ఉంటేనేగాని, వైద్యం చేయించరని వాళ్ళకు తెలుసు." అని లక్ష్మి రోగికీ, చావుకూ మధ్య నిలబడ్డ డాక్టరు నింకా ఏమేమో ఆడిబోస్తుండగా, ఒక పాడుంపట్టు పట్టి పెద్దతండ్రి అన్నాడు.

"అది కాదే... అమ్మాయి. మీకు ఉత్తరం వ్రాసేనాడున్న స్థితికి ఇవ్వాళ్ళ మీకు చూపందుతుం దనుకోలేదు. ఇక ఇప్పుడిప్పుడే ఫరవాలేదు. ఇంక నెలన్నా తీసుకుంటుంది."

లక్ష్మికి మింగుడుపడలేదు. చివరిమాటలతో ఆమెకు పూర్తి నైరాశ్యం కలిగింది. కొంత సేపు మౌనంగా ఉండి, కంఠం పెకల్చుకొని పెద్దతండ్రితో అంది.

"వంటిపై ఒక్క నగ లేదు.....పని వాళ్ళూ...వాళ్ళూ...వీళ్ళూ...... తిరుగుతూ ఉండే ఇల్లు."

లక్ష్మి అభిప్రాయం తెలుసుకోటానికి పెద్దతండ్రి కెక్కువసేపు పట్టలేదు.

"అదంతా మా తమ్ముడి భార్యే చూస్తోంది. మా ఆవిడ,అది జీవికాజీవులు." అన్నాడు. కూతురికి ధైర్యం చెప్తూ. లక్ష్మికి పరాభవం పూర్తయింది.

"అమ్మకు తెలుసా!" అని అడిగింది.

"ఎందుకు తెలియదూ? అయినా దానికిప్పుడు మతి సరిగా ఉండటంలేదు."

కాసేపయాక లక్ష్మి అంది.

"ఎంతో అవస్థపడితేగాని వారికి సెలవు దొరకలేదు....రేపు బయలుదేరుతాం.... పెద్దనాన్నా!"

"అదేమిటే ఈవారంలో దత్తత చేసుకోబోతుంటే, నువ్వు వెళ్తానంటా వేమిటే. మా తమ్ముడి కొడుకును దత్తత కొప్పుకున్నారు." అన్నాడు పెద్దతండ్రి.

లక్ష్మి నిర్ఘాంతపోయింది. ముఖాన నెత్తురు చుక్క లేదు. వంచిన తల పైకెత్తలేదు. తన ఇద్దరు మగపిల్లలూ ఎందుకూ కొఱగాకుండా పోయారు!

పెద్దతండ్రి మళ్ళీ ప్రారంభించాడు.

"బాగా ఉంది. ఇదంతా నేను నిర్వహించలేను. పొద్దున ఏదోవంటలూ, వాటిని గురించి మాట ఎత్తితే ఇక అవన్నీ నన్నడగవద్దు మా అమ్మాయి వచ్చింది ఇక అంతా దాన్నే అడగండి అని చెప్పాను. అతనికి సెలవు లేకపోతే మళ్ళీ ఆరోజుకు వస్తాడు." అని పెద్దతండ్రి కూతురి జవాబు కోసం ఎదురు చూడకుండా సంధ్యాకాలం కేసి చూసి మెల్లగా లేచాడు.

లక్ష్మి కేమీ తోచలేదు. ఉన్నట్టుండి పిడుగులాంటి వార్తను ఎంతో తాపీగా వినిపించాడు పెద్దతండ్రి. మంచంలో పడి తీసుకుంటూ, మాట్లాడటానికికూడా ఓపిక లేనట్టున్న పెద్దమ్మ ఎంతసేపూ గుడ్లప్పగించి చూస్తుందిగాని, ఈ విషయం చెప్పదేం? ఎంత రహస్యంగా తన కళ్ళలో కారం కొట్టారు...కాదు నోట్లో మన్ను. బయలుదేరేప్పుడు నలుగురు పిల్లలని చీదరించుకుంది. కాని, దక్కుతే అని ఆశిస్తుంటే పెద్దమ్మ పెద్దమ్మ అని తాను ఎగబడటమే కాని, తనపై పెద్దమ్మ కేమీ లేదు. ఎక్కువ చేసిందన్నప్పుడల్లా, ఎంతో దూరాభారాన ఉన్నా, బోలెడంత డబ్బు రైలువాళ్ళ మొహాన పోసి, వంగోనీ, నుంచోనీ ప్రయాణం చేసి, వారితోసహా వస్తూండటమూను, చివరకు సత్కారం బాగానే జరిగింది.

జబ్బలు జారి కూర్చున్న లక్ష్మి అలాగే నేల కంటుకుపోయింది. ఆకాశమంతా ఉరుములూ, మెఱుపులూ చేసి పెద్దతండ్రి— ఆహా! ఎంత అమాయకుడులా ఉంటాడు! పెళ్ళాం మతిపోయేదాకా ఊరుకొన్నాడు. ఇప్పుడు అంతా తమ్ముడి కప్పచెప్పుతున్నాడు—చెఱువుకు వెళ్ళాడు. భర్త షికారంటూ వెళ్ళి ఇంకా రాలేదు.

ఎలాగైతేం లేచి, రోగిగదిలోకి వెళ్ళింది. అక్కడ ఎవ్వరూ లేరు. ఇంట్లో వంటా— అదిమాస్తున్న ముసలామె ఎక్కడో దొడ్లో పనిదానిమీద గొంతు చించుకుంటోంది. రోగిని రెండు మూడు సార్లు పిలిచింది లక్ష్మి. కాని, సమాధానంరాలేదు. దగ్గరకు వెళ్ళింది. ఉలిక్కిపడి లేచి, రోగి ఏమిటో వినీ వినబడకుండా మూలిగింది.

"నే నే...అమ్మా...కుడి చేతి గాజు ఏమైందో అని చూస్తున్నాను." అంది లక్ష్మి.

గుమ్మంలో అడుగుల అలికిడి అయింది. దత్తుని తల్లి వస్తూంది. తడబాటు తగ్గించుకుంటూ లక్ష్మి, "ఏది...ఆ పనిమనిషి...

"ఇంకా నయం...ఒక" అని ఇంకా ఏమో అనబోతుండగా, రోగి తోడుకోడలూ, దత్తుని తల్లి అయిన రామమ్మ, "ఏమిటే అమ్మాయి...ఏమిటే" అని ఆతురతగా అడిగింది.

"ఇంకా ఏమిటేమిటి? పిన్నీ...నిక్షేపం లాంటి గాజును ఒట్టిపెట్టుకుంది...ఏది పనిమనిషి" అంటూ గబగబా దొడ్లోకి వెళ్ళింది లక్ష్మి.

రామమ్మ రోగిచేతులు చూసింది. ఒక్క చేతికే ఉంది గాజు. పనిమనిషి చాలా నమ్మకమైంది.

"అక్కయ్యా...గాజేది?" అని మెల్లగ అడిగింది రోగిని. రోగి మాట్లాడలేదు.

తోడుకోడలు మళ్ళీ అడిగింది.

ఈసారి రోగిపెదవులపైన నీరసంగా మందహాసం కన్పడ్డది.

రామమ్మ అనుకొంది.

"మతా...పాడా...ఎంత తలబద్దలు కొట్టుకున్నా 'ఊ' లేదు. 'ఆ' లేదు. ఇంతవరకూ ఏమీ పోయినయ్యని వినలేదు. ఏముంది ఇలా మతిలేక ఉంటే, ఎవరో ఒకళ్లు." అని మెల్లగా, రెండోచేతి కున్న గాజును తీసింది.

ఈసారి రోగి పెదవులపై నీరసంగా నవ్వు కన్పించింది. "ఏమిటక్కయ్యా!" అని వెంటనే అడిగింది రామమ్మ. అక్కయ్య మాట్లాడలేదు. మతి ఉంటేగా!

దొడ్లో లక్ష్మికి, పనిమనిషికి హోరాహోరీ యుద్ధమైంది. పనిమనిషి ఒప్పుకోలేదు. కావాలంటే వళ్లంతా సోదా చేసుకోమంది. ఈమాట అనగానే లక్ష్మి కంగారుపడ్డది. అనటమే కాదు. పనిమనిషి ఏమిటి కాస్తా దులిపింది. లక్ష్మికిష్టం లేదు. తను మెల్లగా పమిటి సద్దుకొని, "నీతో...జాతా...నీతో తగాదా పెట్టుకోటం నాదే బుద్ధితక్కువ...ఆ రామమ్మగారే నీ భరతం పట్టిస్తుందిలే." అని సామాన్లున్న గదిలోకి వెళ్ళిపోయింది.

వెనక అడుగుల అలికిడి అయినట్లై కంగారుపడ్డది. కాని ఎవరూ గదిలోకి రాలేదు. ఏవరో సావిట్లోంచి వెళ్తున్నారు. రోగి ఉన్న గదిలో అడుగు పెట్టుతూ "పిన్నీ" అని పిలచింది లక్ష్మి. కాని పిన్ని లేదు. రోగి గుండెమీద చెయ్యి పెట్టుకుని నిద్రపోతోంది.

లక్ష్మి దగ్గరకు వెళ్ళి చూసింది. రెండో చేతికీ గాజు లేదు.

"పిన్ని ఎప్పుడు వెళ్ళిందమ్మా!" అని రోగి నడిగింది.

రోగి మాట్లాడలేదు. ఆమె పెదవులపై అదే నీరస మందహాసం కన్పించింది.

ఒకటికి రెండుసార్లు లక్ష్మి పిన్నిపై మెటికలు విరిచింది. అసలెందుకని ఊరుకుంటోంది గాని, లేకపోతే చేతబడికూడా చేయించగలుగుతాను. పిత్తిన ముత్తైదులా ఉంటూ, అమాయకుడైన బావగారిని వలలో వేసుకొని, అక్కయ్యను మతిలేనిదాన్ని చేసి, కొడుకును దత్తత కేర్పాటు చేసి కులుకుత్తోంది. దీనికీ రోజులు దగ్గరే పడినయ్.

* * * *

లక్ష్మీపతి ఒంటరిగా బస్తీకి బయలుదేరాడు. పరిస్థితులు విషమంగానే ఉన్నా, భార్య ఒక్కత్తే నిర్వహించుకోగలిగిన సమర్థురాలనే నమ్మకం అతనికి ఉంది. వెళ్తూ, లోపలగా తీసుకువెళ్ళి చెవిలో ఊదాడు.

"తొందరపడి దెబ్బలాడి నచ్చేసేవు. కలహంతో లాభం లేదు. నిదానించినకొద్దీ లాభం...చిక్కినంతవఱకే దక్కించుకోవాలి...బయల్దేరేముందు మటుకు నాకు వ్రాయి. వచ్చి తీసుకువెళ్తా."

అసలిప్పుడు తాను చేసే పిల్ల గుమాస్తాగిరీమీదకన్న ఇక్కడ భార్య ఇక చూపించబోయే 'చేతివాటితనంమీదే లక్ష్మీపతికి ఎక్కువ గౌరవమూ, ఆశ, నమ్మకమూ ఉన్నయ్. ఉన్న రెండు రోజుల్లోనే భార్య సమర్థత, దీక్ష అతనికి నచ్చినయ్. మృత్యువును పట్టి లాగిన బంగారుగాజును సుభద్రం చేసిన పెట్టెతోసహా వెళ్లాడు.

రైలు మించి వేగంతో వెళ్తున్నా, అతని మనస్సు వెనకనే ఉంది.

* * * *

బాజాబజంత్రీలు మోగుతున్నయ్. ఇల్లంతా చుట్టపక్కాలతో కోలాహలంగా ఉంది. దత్తపుత్రుడు కొత్తబట్టల్లో బెదిరినట్టుగా ఉన్నాడు. ఒక్క దెబ్బతో ఏభయ్ ఎకరాల పొలాని హస్తగతం చేసుకుంటున్నామనే సంతోషంతో రామమ్మముఖం కలకలలాడుతుంది. అందరితో కళ్లూ దత్తుని తండ్రిమీదకన్న, తల్లైన రామమ్మగారిపైనే ఉన్నయ్. ఇప్పుడామే యజమానురాలు. ఎవరైనా ఆమె దగ్గరకు వెళ్ళితే, "అంతా మా అమ్మాయిని లక్ష్మిని అడగండి..." అని అంటోంది.

లోపల మంట వెయ్యినాల్కలు జాపి మండుతున్నా, ఇంచుమించు ప్రాణం తోడుకుపోతున్నా పైకిమటుకు ఉత్సాహంగా, సంతోషంగా అంతా నిర్వహిస్తోంది లక్ష్మి. కాని, తలుపుచాటున మద్దెలచప్పుడులో రెండు మూడు మాట్లు మెటికలు విరవకనూపోలేదు.

రోగి ఇక అవసరం లేదని పురోహితులు శెల వివ్వటంతో నలుగురు పట్టి ఆమెను మళ్ళీ గదిలోకి తీసుకొనివెళ్ళి మృత్యువు ఒళ్ళో పడుకోబెట్టారు. తేరిపాఱ చూసుకొంది—తన కొడుకును రోగి. ఆకర్షించిన పెదవులపై మళ్ళీ అదే మందహాసం నీరసంగా గోచరించింది.

రామమ్మ ఇప్పుడు పూర్తిగా అక్కయ్య ఇంట్లోనే మకాం వేసింది. లక్ష్మి ఇంటనున్నంతవరకూ ఒక కంటే కాదు, రెండు కళ్ళూ కూడా కనిపెట్టి ఉండాలని ఆమెకు తెలుసు-"పిన్నీ" అని లక్ష్మి పిలుస్తుంది; "అమ్మాయి" అని రామమ్మ పిలుస్తుంది. ఈ పిలుపుల ఆప్యాయత చాటున తోక తొక్కిన తాచులు బుస్సుమంటున్నయ్.

దత్తుడిచుట్టూ వేలంవెఱ్రిగా తిరుగుతున్న తన పెద్దకుర్రవాడిని రెండు అంటించింది లక్ష్మి. దరిద్రుడు; తన ఇంటికి శని. దత్తుడై పిల్లజమీందారవవలసింది, ఇవ్వాళ వట్టి పప్పూఅన్నం తినే దురదృష్టానికే నోచుకున్నాడు. బయలుదేరేముందు వాడి నెన్నిసార్లో తను గుండెకు హత్తుకుంది. ఇప్పుడు వాడి మొహం చూస్తుంటే, ఆరికాలిమంట నెత్తికెక్కుతోంది.

పైగా వచ్చిన చిల్లరమల్లర చుట్టాలూ ఎవరికివారు చిన్నవీ, పెద్దవీ మూటలను పెట్టెల్లో, పరుపుచుట్టల్లో కుక్కి వరసవరసగా వెళ్ళిపోయారు. కొద్దిమంది బందుగులు మటుకే ఇంకా ఉన్నారు.

నిశిరాత్రి దాటింది. దీపంఒకటి సావిట్లో కునికిపాట్లు పడుతోంది. గోడమీద ఏదో నీడపడ్డది. చుట్టం ఒకామె మెల్లగా లేచి, పెట్టెల మూలకువెళ్ళి కనుపించిన నాలుగు దుప్పట్లు గభుక్కున చేత జిక్కించుకొని, ఒక అంగలో పక్కలోదూరి గుర్రుకొట్టటం ఆరంభించింది. మిగతావాళ్లు ఎక్కడ చూస్తారో అని ఆవిడ తాపత్రయం. కాని, తనకురాని నిద్ర మిగతావాళ్ళకు మటుకు ఎలా వస్తుంది?

అయినా లక్ష్మికిలాంటి క్షుద్రమైన వాటిపై ఆసక్తిలేదు. మెల్లగాలేచి అడుగులో అడుగు వేసుకుంటూ మూల గదిలోకి వెళ్ళింది. ఆ గదిలో వంట అది చూస్తున్న ముసలిచుట్టం వెండిగిన్నెలు, కంచాలు, పాత్రసామగ్రి కాపలాకాస్తూ నైమఱచింది. బుడ్డిదీపాన్ని ఉఫ్ఫున ఊది తన పని ఆరంభించింది లక్ష్మి.

ఏదో చప్పుడవగానే రామమ్మ పెట్టెల గదిలోకి వెళ్ళి, పైపెట్టె కింద ఉండటం చూసి అక్కడే పడుకుంది ఊరికే కళ్లు మూసి.

గాఢ నిద్రలో ఉన్న పనిమనిషి కాళ్ళ

(47-వ పేజీ చూడండి)

చిత్రసమీక్ష:

శోభనాచలవారి

"తిలోత్తమ"

[తెలుగు జానపదచిత్రం]

★

మాటలు, పాటలు: తాపీ ధర్మారావునాయుడు
సంగీతం: ఆదినారాయణ
కళ: టి. వి. ఎస్. శర్మ
నాట్యదర్శకత్వం: వేదాంతం రాఘవయ్య
నిర్మాణం, డైరెక్షన్: మీర్జాపురం రాజా
తారాగణం: అంజలీదేవి, నాగేశ్వరరావు, సూర్యప్రభ, ఎ. వి. సుబ్బారావు, కనకం, గంగారత్నం, కే. వి. సుబ్బారావు, ఎం. సి. రాఘవన్, వగైరా.

పూలమాలలు కట్టుకుని జీవించే దేవదత్తుడనే అందగాడు (నాగేశ్వరరావు), వసంతసేన అనే వేశ్య (సూర్యప్రభ) చేతా, దేవలోకంలోని అప్సరస తిలోత్తమ (అంజలీదేవి) చేతా, ఆమె అంశానే జన్మించిన తిలోత్తమ (అంజలీదేవి) అనే రాజకుమార్తె చేతా ప్రేమించబడి, స్వర్గలోక తిలోత్తమ ఇంద్రజాలానికీ, ఆమెను ప్రేమించిన గంధర్వుడి శాపానికీ గురి అవుతాడు. ఈ శాపం ఫలితంగా స్వర్గలోక తిలోత్తమా, దేవదత్తుడుకూడా కిరాతక రూపాలు ధరించి తమ జన్మ వృత్తాంతాలు మరిచిఉన్న స్థితిలో, దేవదత్తుడు తన భార్యఅయిన కిరాతకి వంధ్యత్వం పోగొట్టడానికిగాను తనవల్లనే భూలోక తిలోత్తమకు కలిగిన బిడ్డను కాళికి బలి ఇస్తాడు. కాళి ప్రత్యక్షమై అందరి కష్టాలూ కడతేర్చి బలి అయిన బిడ్డను బతికిస్తుంది. స్వర్గలోక తిలోత్తమ స్వర్గానికి తిరిగిపోగా దేవదత్తుడు భూలోక తిలోత్తమతోనూ, వసంతసేనతోనూ సుఖంగా ఉంటాడు. ఇది "తిలోత్తమ" చిత్రం తాలూకు టూకీ కథ.

ఈ కథను తెరమీద పరచటంలో అనేక లోపాలు జరిగినా శోభనాచలవారు మొత్తంమీద ప్రేక్షకులకు రక్తి కలిగించే చిత్రమే తీశారు. జరిగిన లోపాలలో ముఖ్యంగా పేర్కొనదగినది చిత్రంలో పడిలేకపోవటం. అసలే అనేక సంఘటనలూ, సన్నివేశాలూ గల కథ కావటానికి తోడు ప్రతి సంఘటననూ అనవసరంగా సాగదీసి పెట్టారు. అందుచేత విరామందాకా కథ ఎక్కడికో పరుగులుతీసే ఆశ కవబరుస్తుందే గాని నిజంగా పరుగులు తీయదు.

దేవదత్తుడూ, అతని అన్నా పూలమాలలు అమ్మబోవటంతో ప్రారంభమైన చిత్రం, దేవదత్తుడు వసంతసేనను కలవటం, అక్కడినుండి దేవలోకానికి తిలోత్తమ చేత అపహరించబడటం పూర్తిఅయేవరకూ బాగానే నడుస్తుంది. అక్కడనుండి దేవదత్తుడు తిలోత్తమతోబాటు గంధర్వ శాపానికి గురిఅయేదాకా గల కథ నృత్యాలతోనూ, అల్ప సన్నివేశాలతోనూ అకారణంగా పొడిగించబడింది. నిజానికి నృత్యాలు బాగానే ఉన్నాయి. స్వర్గంలోని తిలోత్తమదాసీపాత్ర కూడా చక్కగానే చిత్రించబడింది. అయితే మొత్తం కథలో స్వర్గలోక సన్నివేశాలు ఇంత ప్రాధాన్యం పొందనవసరం లేదు. చిత్రానికి ప్రధాన కథానాయిక స్వర్గలోక తిలోత్తమ అయితే ఈ ట్రీట్మెంటుకు సమర్థన ఉండేది. కాని అసలు కథానాయిక భూలోక తిలోత్తమ. ఆమెను ఎంత త్వరగా ప్రవేశపెడితే చిత్రానికంత బిగువు వచ్చేది.

ఇతర లోపాలలో ముఖ్యంగా ఎన్నదగినది కాళికాదేవివచ్చి గంధర్వుడిశాపం ఉపసంహరించటం. కాళికాదేవి వల్ల అయిన పనే చేయగల "బైరాగి-చిటిక" చిత్రంలో ప్రవేశపెట్టారు. భూలోక తిలోత్తమ మేనమామ, దేవదత్తుణ్ణి వెదుకుతూ, తిలోత్తమా రాజకుమారి దగ్గిరికి వచ్చిన వసంతసేనను ప్రేమించి, ఆమె చేత నిరాకరించబడి, ఆమెను వశపరచుకొనటానికి "గోసాయి చిటిక" ఒకటి సంపాదిస్తాడు. అది అతని కెందుకూ పనికిరాదు. ఎందుచేతనంటే ఆ "చిటిక" ప్రేమించి మరచిన వారిని మాత్రమే చేరదీస్తుంది. భిల్లుడై తిరుగుతున్న దేవదత్తుడు భూలోక తిలోత్తమను ప్రేమించి మరచినవాడే కనక, అతనిమీద అది అమోఘంగా పనిచేసి ఉండును. ఈ "గోసాయి చిటిక" కోసం ఎన్నో వందల అడుగులు దుర్వ్యయంచేసి శోభనాచలవారు ఆఖరుకు దీనిని అవసరానికి వినియోగపరచక పోవటం "అంగట్లో అన్నీ ఉన్నాయి; అల్లుడినోట్లో శని" అన్న సామెత స్ఫురింప జేస్తుంది.

పాత్రసృష్టిలోనూ లోపాలున్నాయి. దేవలోకంలో దేవదత్తుడికి అపాయం ఉన్నదని భయపడిన స్వర్గలోక తిలోత్తమ అతనితోసహా భూలోకానికి వెళ్ళక, భూలోక తిలోత్తమను చూపడందేనికో అర్థం కావటం లేదు. ఈ రెండు పాత్రలనూ ఒకే నటిచేత నిర్వహింప జేసికూడా వారి పోలికలను కథలో ఏవిధంగానూ ఉపయోగ పరచలేక పోయినారు. అంజలీదేవిని సాధ్యమైనంత వరకు ప్రేక్షకుల ఎదుట ఉంచే ఉద్దేశంతో మాత్రమే రెండుపాత్రలనూ ఆమె చేత ధరింపజేసినట్లు కనిపిస్తుంది.

ప్రమాదవశాన అంతఃపురంనుంచి వసంతసేనకు మారుగా తన మేనమామ కామసంతృప్తికొరకు తీసుకురాబడి అనంతరం అరణ్యంలో వదలబడిన తిలోత్తమా రాజకుమారి తన రాజ్యానికి వెళ్ళటానికి ఎట్టి ప్రయత్నమూ చెయ్యదు. అరణ్యంలో తనను రక్షించిన సార్థవాహులతో తాను ఫలానా అని అయినా చెప్పదు. నిండు చూలాలుగా ఉన్న స్థితిలో ఆమె ప్రవర్తన దురూహ్యం.

కొన్నిచోట్ల సంభాషణలు అసభ్యంగా కూడా ఉన్నాయి. ఇటువంటి లోపాలు సవరణ చేసుకున్నట్టయితే ప్రేక్షకుల దృష్టిలో ఈ చిత్రం ఎన్నోరెట్లు ఆకర్షవంతంగా ఉండేది.

మామూలుగా అన్ని జానపదచిత్రాల కథలకూ ఉండే లోపమే ఈ చిత్రంలో కూడా ఉంది. అది కృతకత్వం. స్వర్గలోక తిలోత్తమకు సంభవించే కష్టాలలో ఒకటీ సహజమైనది కాదు. కథానాయకుడైన దేవదత్తుడి "మూడువలపులూ" కృత్రిమంగానే ఉన్నాయి. వసంతసేనకు పూలమాల కట్టబోయి ఆమెను తక్షణం ప్రేమించి, ఆమె ప్రేమను పొందుతాడు. అట్లాగే నిద్రపోతూ స్వర్గలోక తిలోత్తమ చేత ప్రేమించబడి, ఆమెను చూస్తూనే ప్రేమిస్తాడు. అదే విధంగా భూలోక తిలోత్తమను చూసి, ఆమెచేత చూడబడి వెంటనే ప్రేమిస్తాడు. ఇది ప్రబంధ ప్రణయం, కృత్రిమం. ఈ ప్రేమల్లో ఏ ఒకటీ అతన్ని చైతన్యవం

(48-వ పేజీ చూడుడు)



రోహిణీవారి "నిర్దోషి"లో

★ జి. వరలక్ష్మి ★

సీరియల్ నవల:

కౌంట్ ఆఫ్ మాంటే క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

12

పరిచారకుడు వెళ్ళిపోగానే నయర్‌టైర్ జాగ్రత్తగా తలుపులు మూసి వచ్చాడు.

"ఏం, గెరార్డ్? నేను రావడం నీకంత హితవుగా ఉన్నట్టు లేదే?" అన్నాడు

"అదేమిటి, నాన్నా!" అన్నాడు విల్‌ఫర్ట్. "అదేం కాదు. మీరు అకస్మాత్తుగా వచ్చేసరికి ఆశ్చర్యపడ్డాను. వస్తారనుకోలేదు నేను."

నయర్‌టైర్ కూర్చున్నాడు. "నేనూ ఆశ్చర్యపడ్డాను గెరార్డ్. ఫిబ్రవరి 28 ని నీ పెళ్లి ప్రధానమని వ్రాశావు. కాని మార్చి 3 కి పారిస్‌లో ఉన్నావు."

"మీకోసమే నాన్నా; ప్రయాసపడి ఇంతదూరం వచ్చాను. నేను రావడమే మీకు కొంపదల కావచ్చునేమో! సెంట్‌జాక్ వీధిలో బోనపార్టిస్ట్ క్లబ్ ఉన్నట్లు మీరు వినే ఉంటారు?"

"53 నంబరేనా? తెలుసును. నేనే ఆ క్లబ్‌కి ఉపాధ్యక్షుణ్ని."

"నాన్నా! మీ సాహసం చూస్తే నాకు భయం వేస్తోంది."

"సాహసం కాక ఏముందోయ్! గడ్డిబండిలో దాక్కుని పారిస్ నుంచి పారిపోలేదూ? బోర్డో చుట్టూ రోబ్‌స్పియర్ భటులు తరుముతోంటే పరుగెత్తలేదూ? ఇంక ఇటువంటివి నేర్పుకోక మానుతుందా? అదిసరేలే; చెప్పు. సెంట్ జాక్ వీధిలో క్లబ్‌కి ఏమొచ్చింది?"

"జనరల్ క్విస్నెల్‌ని అక్కడికి తీసుకు వెళ్లారట. ఆయన రాత్రి తొమ్మిదింటికి తన ఇల్లువిడిచి వెళ్లారట. మూడురోజుల తరవాత సీన్ నదిలో శవం కనిపించిందట."

"అయితే ఈ కట్టుకథ నీకెవరు చెప్పారోయ్?"

"మహారాజే స్వయంగా చెప్పారు."

నీకథ బాగుందిలే. దానికి బదులు నే నింకో వార్త చెప్తున్నా విను. చక్రవర్తి (నెపోలియన్) దిగినట్లు విన్నావా?"

"విన్నాను. అసలు నాకిది ముందే తెలుసును. ఈ వర్తమానాన్ని మహారాజుకు వెంటనే తెలపలేక పోయినందుకు పిచ్చెత్తినట్లయింది. మార్సేల్స్‌నుంచి మూడురోజులు ప్రయాణం చేసి వచ్చింది ఇందుకోసమే."

"మూడురోజులా? అబ్బే. మూడురోజులకిందట చక్రవర్తి దిగనే లేదు."

"దిగకపోవచ్చు. కాని, దిగుతున్నారన్న వార్త, ఎల్బా ద్వీపంనించి మీ పేర పంపబడిన ఒక ఉత్తరంవల్ల నేను తెలుసుకున్నాను. ఆ ఉత్తరం ఒక వార్తాహరునివద్ద దొరికింది. అది మరెవరి చేతిలోనైనా పడివుంటే ఈపాటికి మీ ప్రాణాలు తీసేసి వుండేవారు నాన్నా!"

నయర్‌టైర్ పకపక నవ్వాడు. "ప్రాణాలు తీస్తారా? అబ్బాయ్! నీకిలాటి ఉద్దేశం ఎలా కలిగింది? ఏమిటా ఉత్తరం? ఏదీ? నీభయం నాకు తెలుసులే. ఉత్తరాన్ని అలా ఉండనివ్వవ్."

"కొస్త ముక్కైనా మిగలకుండా కాల్చేశాను అది ఉంటే మీ అంతం మాసును"

"పాపం! నీ భవిష్యత్తు, నీ ఆశలుకూడా అంతమైపోను! అంతే. నాకు తెలుసులే. నువ్వు రక్షించేవాడివి ఉన్నావు కాబట్టి, ఇంక నేను భయపడ నక్కర్లేదు!"

"అంతేకాదు. మీ ప్రాణాలు కాపాడాను. సెంట్ జాక్ వీధి క్లబ్ మాటే చెప్పండి. జనరల్ క్విస్నెల్‌ని చంపేశారు. ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ ఇటువంటిదాన్ని హత్య అంటారు."

"అతన్ని హత్యచేశారనడానికి ఆధారమేమిటోయ్? జీవితం మీద నిరాశపుట్టి ఆత్మహత్య చేసుకునే వాళ్లు, ఈత చేతకాక మునిగిపోయినవాళ్ళూ రోజూ అనేకమంది సీన్‌నదిలో తేల్తూ ఉంటారు."

"నాన్నా! మీకు తెలుసును. జనరల్ క్విస్నెల్ జీవితం మీద నిరాశతో నదిలో దూకలేదు. ఈరోజుల్లో సీన్‌నదిలో ఎవ్వరూ స్నానాలు చెయ్యరు. మిమ్మల్ని మీ రెందుకు మోసపుచ్చుకుంటారు? ఈచావుకి సరైన పేరు హత్య. మహారాజే ఆ మాట అంటున్నారు."

"మహారాజు! రాజకీయాల్లో హత్యలనేవి ఉండవని తెలుసుకో గల జ్ఞాని అనుకున్నాను మహారాజు. రాజకీయాల్లో మనుషుల్ని చంపరు. దారిలో కంటకాల్ని ఏరి పారేస్తారు. అంతే. ఇదంతా ఎల్లా జరిగిందో తెలుసుకోవాలని ఉంటే విను. జనరల్ క్విస్నెల్‌ని నమ్మవచ్చని మొదట అందరం అనుకున్నాం. నమ్మవచ్చని ఎల్బా ద్వీపంనించి కబురుకూడా వచ్చింది. సెంట్ జాక్ వీధిలో క్లబ్‌కి రావలసిందని మాలో ఒకరతనికి చెప్పారు. అక్కడ మిత్రులుంటారని అన్నారు. అతను వచ్చాడు. కార్యక్రమం అంతా అతనికి చెప్పేశాం. ఎల్బాద్వీపంనించి చక్రవర్తి బయలుదేరడం, ఫ్రాన్స్‌లో దిగడం అన్ని ఏర్పాట్లూ చెప్పాం. చెప్పినదంతా విన్నతరవాత, తను రాజరికపక్షం వాడి నన్నాడు. ఇంక ఏం చెయ్యాలని ఆలోచించాం. అతను కార్యక్రమాన్ని రహస్యంగా ఉంచడానికి ప్రమాణం చేయ్యాలని తేలంది. అలాగే ప్రమాణం చేశాడు. కాని మనఃపూర్వకంగా చెయ్యలేదు. అయినా అతన్ని స్వేచ్ఛగా వెళ్లిపోనిచ్చాం. కాని, పాపం అతనింటికి వెళ్లలేదు. మధ్యలో దారితప్పాడు. అంతే. మళ్ళీ కనిపించలేదు. దీన్ని హత్య అంటారా? నిన్ను చూస్తే ఆశ్చర్యం వేస్తోంది విల్‌ఫర్ట్! నువ్వు రాజరిక పక్షాన నీ ఆట నువ్వు ఆడుతోంటే నిన్ను నేనేమి

అనువాదం: సీతారామ్

అనలేదా? నా స్నేహితుల్ని అనేకమందిని నువ్వు శిరచ్ఛేదాలు చేయిస్తోంటే, హంతకుడివని నిందించానా నేను? లేదే! కానీ, ఇప్పుడు నీ రోజులు బాగున్నాయి, అనుకున్నాను. కాని, దీనికి ప్రతిఫలాన్ని శేపనుభవించక తప్పదుసుమా!"

"కాని నాన్నా! జాగ్రత్తగా ఉండాలి. మేం పగసాధించడం మొదలు పెడితే భయంకరంగా ఉంటుంది."

"అంటే? నీ ఉద్దేశం అర్థం కావడం లేదు."

"మీరు చక్రవర్తి మళ్ళీ వస్తాడనే కదా ఆశపడుతున్నారు? కాని, ముప్పైమైళ్లుకూడా రాకముందే అతన్ని వేటాడతారు; ఉచ్చు వేసి పట్టుకుంటారు, అడవి మృగాన్ని పట్టుకున్నట్లు."

"ఓరి వెర్రివాయనా! చక్రవర్తి అప్పుడే గ్రెనోబుల్ రహదారిలో ఉన్నారు. పదో తేదీనో, పన్నెండో తేదీనో లయన్స్ చేరుకుంటారు. ఇరవై, ఇరవైఅయిదో తేదీల కల్లా పారిస్‌లో ఉంటారు."

"అయితే? ఆయన వెంట గుప్పెడుమందికూడా లేరు; పెద్ద సైన్యం ఆయనకెదురు వెడుతుంది."

"వెళ్లనీ. ఆయన్ని దగ్గరుండి రాజనగరానికి తీసుకొస్తారు. నువ్వు బలేవాడవ్ గెరార్డ్! నీకంతా తెలుసుననుకుంటావ్. తీరంలో దిగిన మూడురోజులికి కాన్స్ దగ్గర దిగారని మీకు తంతివార్త వస్తుంది. తరవాత ఆయన్ని వెంటాడుతున్నారని సమాచారం వస్తుంది. కాని, ఆయనెక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో రవ్వంతైనా మీకు తెలియదు. పారిస్ వరకూ ఆయన్ని అనుసరిస్తారు నిజమే కాని, ఒక్క తుపాకికూడా పేలదు. గ్రెనోబుల్ ఆయన్ని ఆహ్వానిస్తుంది. లయన్స్ సత్కరిస్తుంది. నా మాటనమ్ము. నీకు తెలిసినపాటి నాకూ తెలుసును. మా పోలీసులు మీ పోలీసుల కేమీ తీసిపోరు. నీకు రుజువు కావాలా? చెప్తాను విను. నువ్వు మార్సేల్స్‌లో బయలుదేరి నప్పుడు పారిస్‌కువస్తున్నట్లు నాకు తెలియనివ్వకూడదనుకున్నావు. కాని, నువ్వుపారిస్ హద్దులుదాటి ప్రవేశించిన అరగంటలో నువ్వువచ్చినట్లు నాకు తెలిసిపోయింది. ఎక్కడ బస చేస్తున్నావో నువ్వు ఒక్కడికి చెప్పలేదు. కాని, నాకు తెలుసును. నువ్వు ఇక్కడికివచ్చి కూర్చుంటున్నంతలోనే నేను వచ్చానా? సరేలే. అదంతా ఇప్పుడెందుకు? ముందు భోజనం తెప్పించు. ఇద్దరం కూర్చునితిందాం."

అంటూ నయర్‌టైర్ పరిచారకుని పిలవడానికి లేచేటంతలోనే విల్‌ఫర్ట్ ఆపాడు. "ఆగండినాన్నా! ఒక్కమాట. రాజరిక పక్షపు పోలీసులు ఎంత అసమర్థులైనా కావచ్చును. కాని, క్వెస్నెల్ మాయమైనరోజుని, అతన్ని పిలుచుకువెళ్లిన వ్యక్తి ఎలా ఉంటారో వాళ్లకి తెలుసును. నల్లనిజుట్టు, బొద్దుమీసాలు, నల్లని కళ్లు, ఒత్తైన కనుబొమ్మలు నీలిపొడుగుకోటు, కోటుపైన లీజన్ ఆఫ్ ఆనర్ పతకం. ఈ వివరాలన్నీ పోలీసులకు తెలుసును."

"ఓ! అయితే అదంతా వాళ్లకి తెలుసు నన్నమాట. అయితే అతన్నెందుకు పట్టుకోలేదు?"

"నిన్ననో, మొన్ననో కాక్‌హెరాన్‌వీధి మొగలో మాయమైనారుట. కాని, ఏక్షణంలోనైనా పట్టుకోవచ్చును." అని నిర్లక్ష్యంగా అన్నాడు నయర్‌టైర్.

"అవును. ముందు జాగ్రత్తపడాలని అతనికెవ్వరూ చెప్పకపోతే పట్టుకునేవారే. కాని, నువ్వుచెప్పావుగా! ఇంక పట్టుకోలేరు. అతను వేషం అంతా మార్చేస్తాడు." చిరునవ్వుతో నయర్‌టైర్ అద్దందగ్గరకు వెళ్లాడు. కోటుతీసేశాడు. మేజావద్దకు వెళ్లి కొడుకు సామాను వెతికాడు. వెతికి రేజర్, కత్తిరి తీసి మీసాలు తీసేశాడు; క్రాపుసర్దుకున్నాడు. మెడకుచుట్టిన మఫ్లర్‌తీసేసి, విల్‌ఫర్ట్ మఫ్లర్ తీసుకుని చుట్టుకున్నాడు. కొడుకుటోపీ సరిపోతుందో, లేదో ప్రయత్నించి అద్దంలో చూసుకున్నాడు. అంతా బాగానే ఉందనుకున్నాడు. తనచేతికర్ర గోడమూల నుంచి, విల్‌ఫర్ట్‌చేతికర్ర తీసుకున్నాడు.

వెలవెలబోతున్న కొడుకువంకతిరిగి నయర్‌టైర్ ఇలా అన్నాడు: "ఇప్పుడుచెప్పు. పోలీసులునన్ను గుర్తుపట్టగలరా?"

"గుర్తుపట్టలేరు. గట్టిగాచెప్పగలను." విల్‌ఫర్ట్ తడబడుతూ చెప్పాడు.

"ఇప్పుడు తల్చుకుంటే తీరా నిజమే ననిపిస్తోందిసుమా! నా ప్రాణాలు నువ్వే కాపాడావుకాబోలు! అయితే అయిందిలే. నీ ఋణాన్ని త్వరలోనే తీర్చేస్తాను. నువ్వుమళ్లీ మహారాజును చూస్తావా?"

"చూడవచ్చు."

"చూసినట్లయితే ఆయన కీమాటలు చెప్పు 'ఫ్రాన్స్‌లో ప్రజల అభిప్రాయాన్ని గురించి మీరు మోసపోయారు. మీ రెవరినైతే దూషణపూర్వకంగా కార్సికన్ రాక్షసి అంటున్నారో, ఆయన్ని అప్పుడే లయన్స్‌లో ప్రజలు బోనపార్ట్ అని పిలుస్తున్నారు. గ్రెనోబుల్లో చక్రవర్తి అంటున్నారు. ఆయన్ని వెంటాడుతున్నారనీ, చుట్టుముట్టుతున్నారనీ మీరనుకుంటున్నారు. కాని, ఆయన డేగలా వచ్చి పడుతున్నాడు. తేనెచుట్టూ ఈగలమాదిరిగా సైనికులు ఆయనవద్ద చేరుతున్నారు. మీరువెంటనే పారిపొండి. విజేత అయిన వానికి ఫ్రాన్స్ దేశాన్ని ఒప్పగించి వెళ్లిపొండి. మీప్రాణానికిముప్పువచ్చిందనిపారిపోనక్కరలేదు. మిమ్మల్ని క్షమించడానికి తగినబలం ఆయనకుంది. కాని, సెంట్‌లూయీ మనుమడు అవమానం పాలు కావడం ఇష్టంలేకనే పారిపోవాలని చెప్తున్నాను. ఆస్టర్లిజ్ మహావీరుని చేతుల్లో మహారాజు ప్రాణభిక్షపొందాడనిపించుకోడం ఉచితం కాదు.' ఈ మాటలాయనకి చెప్పుగెరార్డ్. లేదా, ఒక్కమాటైనా చెప్పకుండా నీ దారిని నువ్వువెళ్లు; మార్సేల్స్‌వెళ్లు. చడీచప్పుడూ కాకుండా నీ ఇంట్లోకూచో. ఈ మారు మేం ఊరుకునేదిలేదు. మాశత్రువు లెవరో ఇప్పుడుమాకు చక్కగా తెలుసును. వాళ్లని విడిచిపెట్టం. నీ తండ్రి ఆజ్ఞల్ని నువ్వు విధేయతతో పాలించినట్లయితే నీ ఉద్యోగంనీకు దక్కుతుంది." తరవాత కొంటెగా చిరునవ్వునవ్వి అన్నాడు:—"ఇందుకు ప్రతిఫలంగా ఇంకొకమారు నువ్వు నాప్రాణాన్ని రక్షించవచ్చులే. రాజకీయాలవక్రగతి తెలిసినదేకదా! నేను మళ్లీ కూలిపోయి, నువ్వే పైకిరావచ్చును." ఈ మాటలంటూ నయర్‌టైర్ వెళ్లిపోయాడు.

విల్‌ఫర్ట్ ఆందోళనతో కిటికీలోనుంచి చూశాడు. తండ్రి నిశ్చింతగా నడిచి వెడుతున్నాడు. వీధి మొగలో కనిపెట్టుకుని చూస్తున్న ఇద్దరు వ్యక్తులు కనిపించారు. దుబ్బుమీసాలు, ఒత్తు కనుబొమ్మలుండి, నీలిపొడుగు కోటు ధరించిన వ్యక్తిని పట్టుకోడానికి కాబోలు చూస్తున్నారు. తండ్రి వారిని సమీపిస్తున్న కొద్దీ విల్‌ఫర్ట్ ఊపిరి బిగపట్టి చూశాడు. కాని, వేషంమార్చిన తండ్రిని గూఢచారులు అనుమానించలేదు. తండ్రి మలుపుతిరిగి దాటిపోయాడు.

వెంటనే విల్‌ఫర్ట్ గదిలో చిందరవందరగా ఉన్న సామానులన్నీ సర్ది, తండ్రి తెచ్చినకోటు, మఫ్లర్, టోపీ చుట్టబెట్టి తన పెట్టె అడుగున దాచేశాడు. మూలనున్న చేతికర్రను ముక్కలుగా విరిచేసి గాడిపొయ్యిలో పడేశాడు. అంతా అయినతరవాత పరిచారకుని పిలిచి హోటల్ బిల్లు తెమ్మని ఆజ్ఞాపించాడు. బిల్లు చెల్లించి, క్షణమైనా జాప్యం చెయ్యకుండా తన గుర్రాలబండిలో బయలుదేరి వెళ్లిపోయాడు.

లయన్స్ చేరేసరికి అప్పుడే నెపోలియన్ గ్రినోబుల్ చేరినట్లు విన్నాడు. తరవాత దారిలో అనేక ఆటంకాలు వచ్చాయి. అన్నిటినీ గడిచి విల్‌ఫర్ట్ మార్సేల్స్ చేరాడు. చిరకాల వాంఛితమైన ఉన్నతి లభించనున్న సమయంలో మనుష్యులకు సామాన్యంగా కలిగే శంకా భయాలు అతన్ని ముప్పిరిగొన్నాయి.

13

నయర్‌టైర్ చెప్పిన జోస్యమంతా నిజమయింది. రాజరికం గజగజ లాడిపోయింది. పూర్వ సాంప్రదాయాలునూ, ద్వేషాలనూ నూతనాభిప్రాయాలతో వింతగా సంతరించి నిలబెట్టిన రూప రహితమైన రాజరికం, నెపోలియన్ ఒక్క చేసన్నతో గుభాలున కూలిపోయింది. విల్‌ఫర్ట్‌కు లభించినది నిరర్థకమైన మహారాజు కృతజ్ఞతా ప్రకటనమాత్రమే. ఇది నిరర్థకమే కాదు, ప్రమాదకరమైనదికూడా. మహారాజిచ్చిన పతకాన్ని విల్‌ఫర్ట్ గుప్తంగా ఉంచేశాడు.

నయర్‌టైర్ జోక్యం చేసుకోకపోతే విల్‌ఫర్ట్‌ను నెపోలియన్ బర్తరఫ్ చేసేవాడే. నూరుదినాల సార్వభౌముని పరిపాలనలో నయర్‌టైర్ బలవంతుడైనాడు. 1739 లో గిరాండిస్టు, 1806 లో సెనేటర్ అయిన నయర్‌టైర్ తనకుమారుడు తనని రక్షించినందుకు ప్రతిఫలం దక్కించాడు.

సామ్రాజ్య పునస్థాపన కాలంలో డాంటే రహస్యం బైట పడకుండా కాపాడుకోడం విల్‌ఫర్ట్‌కి గగనమయింది. మహారాజు నియమించిన ప్రధాన న్యాయాధికారినే ప్రభుభక్తి లోపానికి బర్తరఫ్ చేశారు. అయినా సామ్రాజ్యపాలన స్థాపించబడిందో లేదో, దక్షిణాదిని అంతఃకలహాలు చెలరేగాయి. మేజస్ట్రేట్లు ఎంత కృషి చేసినా కల్లోలం అణగలేదు. ఇళ్లలో తలుపులు వేసుకుని ముఖం దాచుకున్న రాజరిక పక్షవాదుల్ని రాజకీయ తీవ్రవాదులు విడిచిపెట్టలేదు. వారినిగురించి వ్యంగ్యచిత్రాలు ప్రచురించడంతో తృప్తిపడలేదు. దౌర్జన్యం భీషణంగా చెలరేగింది.

సహజ పరిణామాల కనుగుణంగానే మారెల్ ప్రాబల్యంవృద్ధి అయింది. డాంటేనిగురించి అతడు తీవ్ర యత్నం చేశాడు. ఉన్నతోద్యోగి బర్తరఫ్ అయినా, విల్‌ఫర్ట్ తన ఉద్యోగంలోనే ఉండిపోయాడు. అతని వివాహం వాయిదా పడింది. చక్రవర్తి అధికారం స్థిరపడినట్లయితే, మరొక సంబంధం చూసుకోడం క్షేమమని భావించాడు. లేక, పద్దెనిమిదో లూయీ మళ్లీ సింహాసనానికి వచ్చినట్లయితే, ఆ సంబంధమే స్థిరపర్చుకోవచ్చును. అప్పుడు తను ఆర్జించుకున్న పరపతి, సెంట్ మిరాన్ పలుకుబడికితోడై, తాను మరింత వృద్ధిలోకి రావచ్చును.

ఈ రోజుల్లోనే ఒకరోజున మారెల్ విల్‌ఫర్ట్‌ని దర్శించడానికి వచ్చాడు. మరెవరైనా అయితే, అడకువతో వెళ్లి మారెల్‌ను సత్కరించేవారే. కాని, విల్‌ఫర్ట్ దృఢచిత్తుడు; సూక్ష్మగ్రాహి. మారెల్‌ని తన సహజధోరణిలోనే, అంతంతమాత్రంగా ఆదరించాడు. విల్‌ఫర్ట్ గర్వం అణిగిపోయి వుంటుందనుకున్న మారెల్ ఆశ్చర్యపడ్డాడు. ఉన్నతవిద్య పొందినవానికీ, విద్య లేనివానికీ మధ్యకల తెర అలాగే ఉండిపోయింది. తనని చూసి విల్‌ఫర్ట్ వొణికిపోతాడనుకున్నాడు. కాని, అతన్ని చూసి తానే అతి జాగ్రత్తగా ఉండవలసి వచ్చింది.

విల్‌ఫర్ట్ క్షణంపాటు అతన్ని నిశితంగా పరికించి అన్నాడు! "ఎవరు? మారెల్ కాదూ? ఏం పనిమీద వచ్చారు?"

"గ్రహించలేరా?" అన్నాడు మారెల్.

"లేదే. గ్రహించలేను. చెప్పండి. నాచేతనైనదైతే తప్పకుండా చేస్తాను."

"అది కేవలం మీ చేతుల్లోనే ఉంది." అన్నాడు మారెల్. క్రమంగా అతనికి భయం తొలగిపోయింది. అనుచితమైనదేదీ తాను కోరడంలేదు. సక్రమమైనదే అడుగుతున్నానని ధైర్యం తెచ్చుకున్నాడు. ఇలా అన్నాడు: "చక్రవర్తి ఫ్రాన్స్ రాకముందు, ఒక నిర్భాగ్యుడైన యువకుని దయతో చూడాలని మిమ్మల్ని ప్రార్థించాను. అతను నా ఓడలో మేట్. ఎల్బా ద్వీపంతో సంబంధం పెట్టుకున్నట్లు అతనిపైన అప్పుడు ఆరోపించారు. అది మీకు జ్ఞప్తిలో ఉండవచ్చును. అప్పుడది నేరంగా పరిగణించ బడింది. ఇప్పుడు అది రాజభక్తి లక్షణం. అప్పుడు మీరు లూయీ మహారాజుకింద ఉద్యోగి. నేరస్థుని క్షమించలేదు. అప్పుడది మీకర్తవ్యం. ఇప్పుడు మీరు నెపోలియన్‌కింద ఉద్యోగం చేస్తున్నారు. ఇప్పుడతన్ని రక్షించడం మీ కర్తవ్యం. అతనేమైనాడో అడిగి తెలుసుకోడానికి వచ్చాను."

విల్‌ఫర్ట్ ఉద్రేకాన్ని అణుచుకోడానికి విశ్వప్రయత్నం చేశాడు. "అతని పేరు?"

"ఎడ్మండ్ డాంటే."

శత్రువు ఎదురుగా నిలిచి పిస్తోలు గురిపెట్టినా నిలవగలిగేవాడేగాని, డాంటేపేరు వినడం సహించలేకపోయాడు. తనలో ఇల్లా అనుకున్నాడు: "నేను వ్యక్తిగత ద్వేషంతో ఇతన్ని అరెస్టు చేయించానని నన్నెవ్వరూ నిందించలేరు." మారెల్‌తో పైకి ఇలా అన్నాడు: "పేరేమిటి చెప్పారు? డాంటే?"

"అవునండి."

ప్రక్క బీరువాలోనుంచి ఒక పెద్ద రిజిస్టరు తీసుకొచ్చాడు విల్‌ఫర్ట్. మేజామీదపెట్టి కాగితాలు తిరగేశాడు. అతి సహజభావంతో అన్నాడు: "మీరు పొరపడ్డం లేదుకదా మారెల్?"

"లేదండి. పాపం అతన్ని నేను పదేళ్లుగా ఎరుగుదును. నాలుగేళ్లనుంచి నాదగ్గర పనిచేస్తున్నాడు. అతన్ని దయతో చూడాలని కోరుతూ మీవద్దకి ఆరువారాల కిందట వచ్చాను. ఇప్పుడతనికి న్యాయం చేకూర్చాలని కోరుతున్నాను. అప్పుడు నామాటను మీరంతగా మన్నించలేకపోయారు. అప్పుడు బోనపార్టిస్టుల పట్ల రాజరికవాదులు మరి కఠినంగా ఉండేవారు."

"ఆగండి" అన్నాడు విల్‌ఫర్ట్. ఇంకొక రిజిస్టరు తీసి చూస్తూ "ఇదుగో ఇక్కడుంది. ఇతను నావికుడు కాదూ? కాటలన్ యువతిని పెళ్లిచేసుకున్నాడు. అవునవును. జ్ఞాపకంవచ్చింది. వ్యవహారం అప్పుడు చాలా ప్రమాదమైనదికూడా."

"ప్రమాదమా? ఎలాగ చెప్పండి?"

"నాదగ్గర పరీక్ష పూర్తికాగానే అతన్ని ఇక్కడే బందీగా ఉంచారు మీకు జ్ఞాపకం ఉందా?"

"అవును. జ్ఞాపకం ఉంది."

"అప్పుడు నేను పారిస్‌కి నివేదికపంపాను; అతని దగ్గర దొరికిన పత్రాలుకూడా పంపాను. అది నాకర్తవ్యం. తప్పదుకదా! అరెస్టయిన ఎనిమిదిరోజులికి అతన్ని తీసుకుపోయారు. అతన్ని సెంట్ మార్గరెట్ ద్వీపాల్లోనో, పినెరోల్‌లోనో నిర్బంధించి ఉంటారు. దేశాంతరం పంపారు. ఎప్పుడో త్వరలోనే విడుదలై వచ్చేస్తాడు. మీ ఓడలో మళ్లీ చేరతాడు."

"అతనెప్పుడు వచ్చినాసరే నా ఓడలో అతని ఉద్యోగం ఖాళీగానే ఉంటుంది" అన్నాడు మారెల్. "కాని ఇంకా ఎందుకు తిరిగి రాలేదతను? రాజరికవాదులచేత నిర్బంధంలో

ఉంచబడిన వాళ్ళందర్నీ విడుదలచెయ్యడం బోనపార్టిస్టుల ప్రథమ కర్తవ్యం."

"తొందరపడకూడదు మారెల్. అంతా న్యాయశాసనం ప్రకారం జరగాలి."

"ఇప్పుడు మాకు విజయంలభించిందికదా? ఈ న్యాయశాసనపు తతంగం అంతావిడిచిపెట్టి వెంటనే విడుదల చేయించలేమా ? నాకిప్పుడు మిత్రులున్నారు; పలుకుబడిఉంది. శిక్షను రద్దు చేయించలేనా ?"

"శిక్ష ఏదీ పడలేదు."

"అయినా జైలునుంచి విడిపించవచ్చును."

"రాజకీయ నేరాలైనట్లయితే ఖైదుల్లో రిజిస్టర్లు ఉంచరు. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కడిని, ఎన్నటికీ కనిపించకుండా మాయం చేసెయ్యడం, ప్రభుత్వాలకు అవసరమౌతుంది. రిజిస్టరు ఉంటే ఆచోకీ దొరుకుతుంది. అందువల్ల రిజిస్టరు ఉంచరు. కారాగారాలవిషయంలో మహారాజుకంటె చక్రవర్తి మరింత జాగ్రత్తగా ఉంటారు. రిజిస్టర్లలో పేరైనా లేకుండా కారాగారాల్లో మగ్గుతున్న వాళ్లు అనేకమంది ఉన్నారు."

సహృదయులైనవారు ఇలాగే సులువుగా మోసపోతారు. మారెల్ కి అనుమానమైనా లేకపోయింది. విల్ ఫర్ట్ చెప్పినదంతా నమ్మాడు.

"అయినాసరే చెప్పండి విల్ ఫర్ట్. పాపం డాంటేని వెంటనే విడుదల చెయ్యాలంటే ఏం చెయ్యమని మీ సలహా?"

"ఏముంది? మేజస్ట్రేటుకి దరఖాస్తు పెట్టుకోండి."

"దరఖాస్తుల సంగతి మీకు తెలుసుకదా! అటువంటివి మేజస్ట్రేటుకి రోజుకి రెండువంద లొస్తాయి. అందులో నాలుగు చదువుతారేమో!"

"నిజమే" అన్నాడు విల్ ఫర్ట్. "కాని, నేను సంతకంచేసిన దరఖాస్తుని చదువుతారు. మీరు దరఖాస్తు నా చేతికిస్తే నేను పంపగలను. అప్పుడు డాంటే నేరస్థుడే కావచ్చును. కాని, ఇప్పుడు నిర్దోషి. అప్పుడు ఖైదుకి పంపక తప్పలేదు. ఇప్పుడు అతని విడుదలకోసం సహాయపడతాను."

ఈవిషయం విచారణకు వస్తుందని భయపడి విల్ ఫర్ట్ ఈవిధంగా జాగ్రత్తపడ్డాడు.

"మరి మేజస్ట్రేటుకి ఎలా రాయడం?" అన్నాడు మారెల్.

"కూర్చోండి. నే చెప్తాను, మీరు వ్రాయండి."

డాంటేకి చక్రవర్తిపట్లగల భక్తిని ఉత్ప్రేక్షించి దరఖాస్తు వ్రాయించాడు. అసలు నెపోలియన్ తిరిగి రావటానికి తోడ్పడిన వారిలో డాంటే ముఖ్యుడన్నట్లు వ్రాయించాడు. ఇంక ఈ దరఖాస్తు చూడగానే డాంటేని విడిచిపెట్టక మేజస్ట్రేటుకి గత్యంతరం లేదన్నట్లుంది. వ్రాయడం ముగిశాక కాగితం తీసుకుని విల్ ఫర్ట్ పైకి చదివాడు.

"బాగుంది. ఇది నా చేతికివ్వండి. నేను దస్కతు పెట్టి ఇవాళే పంపుతాను. మిగతా పనంతా నాకు విడిచిపెట్టండి." అన్నాడు విల్ ఫర్ట్.

ఈ వాగ్దానంతో మారెల్ ఆశ కొండంతయింది. శుభవార్త చెప్పడానికి డాంటే తండ్రివద్దకు బయలుదేరాడు మారెల్. విల్ ఫర్ట్ ఆదరఖాస్తుని పారిస్ కి పంపడానికి బదులు మడిచి తన జేబులో దాచుకున్నాడు. పంపినట్లయితే ఇప్పుడు డాంటే వెంటనే విడుదల కావచ్చును. కాని, మహారాజు మరొకసారి సింహాసనానికి వస్తే, దీనివల్లనే డాంటే భవిష్యత్తు పూర్తిగా నాశనమౌతుంది. అప్పటికే యూరప్ లో రాజకీయాలు చూస్తే, మహారాజు తిరిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. డాంటే వ్యవహారం ఇప్పటికే శ్రుతి మించింది. విల్ ఫర్ట్ ఇంక వెనుకంజ వెయ్యలేదు. అందువల్ల డాంటే బందీగానే ఉండిపోయాడు.

కూపాంధకారంలో మగ్గిపోతున్న డాంటేకి దేశంలో జరుగుతున్న చరిత్రాత్మక సంఘటనలు తెలియడంలేదు. పద్దెనిమిదో లూయీ పరారైనాడు. తరవాత సామ్రాజ్యమే కూలిపోయింది. నూరుదినాల ద్వితీయసామ్రాజ్య పరిపాలనలో రెండుమార్లు డాంటేని విడుదల చేయించడానికి మారెల్ ప్రయత్నించాడు. రెండుమార్లూ విల్ ఫర్ట్ మెత్తని మాటలతో, వాగ్దానాలతో అతన్ని శాంతపరిచి పంపివేశాడు. చివరికి వాటర్లూ యుద్ధం జరిగింది. నెపోలియన్ ఓడిపోయాడు. మళ్లీ మారెల్ విల్ ఫర్ట్ వద్దకు రాలేదు. మనిషికి సాధ్యమైన దెంతవరకూ ఉంటుందో, అంతవరకూ మారెల్ డాంటేకోసం చేశాడు. తిరిగి మహారాజు సింహాసనానికి వచ్చాడు. ఇంక యత్నించడం అతనికే క్షేమంకాదని ఊరుకున్నాడు.

పద్దెనిమిదో లూయీ మళ్లీ సింహాసన మెక్కాడు. మార్సేల్స్ లో దుర్ఘటనల్ని సహించలేక, విల్ ఫర్ట్ టూలస్ లో ప్రధాన న్యాయాధికారిగా బదిలీచేయించుకున్నాడు. అక్కడచేరిన పదిహేనురోజుల్లో అతనికి రినీతో వివాహమయింది. సెంట్ మీరాన్ పలుకుబడి ఇప్పుడుమరింత పెరిగింది. డాంటే నూరుదినాల సామ్రాజ్య పాలనకాలంలోనూ, వాటర్లూయుద్ధం తరవాతనూ కూడా ఆ అంధకారకూపంలో భగవంతుని చేతా, మానవులచేతా విసర్జింపబడి ఏకాకిగా ఉండిపోయాడు.

నెపోలియన్ తిరిగివచ్చినప్పుడు డాంగ్లర్ తనగతి ఏమౌతుందో ముందేగ్రహించుకున్నాడు. ముఖ్యంగా డాంటేవ్యవహారంవల్ల తనకెటువంటి ముప్పు వస్తుందోనని భయపడ్డాడు. ఎప్పటికప్పుడు డాంటే తిరిగివచ్చి పగతీర్చుకుంటా డనుకుంటూఉండేవాడు. అందువల్ల నౌకల్లోఉద్యోగం విరమించుకోవాలని తనకు కోరికున్నట్లు మారెల్ తో చెప్పాడు. మారెల్ సిఫార్సుపొంది ఒక స్పానిష్ వర్తకునివద్ద గుమాస్తాగా చేరాడు.

డాంటేతనకింక అడ్డులేడన్న దొక్కటే ఫెర్నాండో గ్రహించగలిగినది. డాంటేమాయం కావడానికి ఉన్నవీ లేనివీ అనేక హేతువులు కల్పించిచెప్పి, మర్సిడాను మోసపుచ్చడానికే తన కాలమంతా వినియోగించాడు. ఒక్కొక్కప్పుడు ఆమెను బలవంతంగా ఎక్కడికైనా తీసుకుపోవాలని యోచించేవాడు. ఒక్కొక్కప్పుడు నిరాశతో, వేదనతో కొండెక్కి కూచుని ఒక్కడూ విచారిస్తూ ఉండిపోయేవాడు. పగతీర్చుకోడానికి డాంటే వస్తున్నాడేమోనని దారులన్నీ చూసేవాడు. వచ్చినట్లయితే, అతన్ని చంపి తాను ఆత్మహత్య చేసుకోవా లనుకునేవాడు. కాని, డాంటేతిరిగిరాలేదు. ఇంతలోనే నెపోలియన్ ప్రభుత్వం నిర్బంధసైనిక సమీకరణ ప్రకటించింది. ఫెర్నాండో వెళ్లక తప్పలేదు. తను లేనిసమయంలో డాంటేవచ్చి మర్సిడాను వివాహం చేసుకుంటాడని బెంగపెట్టుకున్నాడు. మర్సిడా అతని పట్ల ఎప్పుడూ అత్యంతస్నేహభావంతోనే ఉండేది. తన దుఃఖసమయంలో తనను విడిచి పెట్టక ఊరటనిస్తున్న ఫెర్నాండోపట్ల ఆమెకు జాలికలిగింది. ఫెర్నాండో సిపాయిగా వెళ్లిపోతున్న సమయంలో మర్సిడా అతన్ని సమీపించి ఇలా అంది: "బావా. నువ్వొక్కడవే నాకిప్పుడు స్నేహితుడవు. నువ్వు యుద్ధంనుంచి తప్పకుండా తిరిగి రావాలి. నన్ను ప్రపంచంలో ఒంటరిగా విడిచి పెట్టకు. లేకపోతే నేనేమౌతాను ?"

వీడ్కోలు సమయంలో మర్సిడా చెప్పిన ఈమాటలు ఫెర్నాండోకు ఆశాహేతువైనాయి. డాంటే తిరిగి రాకపోయి

వట్లయితే మర్నిదా తన అధీనమౌతుంది. ఫెర్నాండో వెళ్లిపోగానే మర్నిదా ఒంటరైపోయింది. తరుచు ఒంటరిగా కళ్లనీళ్లు కుక్కుకుంటూ నిర్జనప్రాంతాలలో తిరిగేది. ఒక్కొక్కప్పుడు మార్సేల్స్ దిశగా చూస్తూ రాతిబొమ్మ వలె నిశ్చలంగా నిలబడి ఉండిపోయేది. ఒక్కొక్కప్పుడు సముద్రతీరాన కూర్చుని తన దుఃఖంవలెనే అవిరళమైన సాగరఘోషను ఆలకిస్తూ ఉండేది. దుఃఖాన్ని ఒక్కసారిగా అంతం చేసుకోడానికి ఆమె ఆత్మహత్య చేసుకునేదే. కాని, ఆత్మహత్య కెన్నడూ యత్నించ లేదు. అది ధైర్యం చాలక కాదు; మత సాంప్రదాయాలు నిషేధించినందువల్ల.

ఫెర్నాండో మాదిరిగానే కాడెరూస్‌కూడా సైన్యంలో చేరవలసి వచ్చింది. కాని వివాహితుడైనందువల్ల అతన్ని సరిహద్దులు దాటి పంపలేదు. డాంటే తండ్రికి నెపోలియన్ పతనంతో ఆశలు కూలిపోయాయి. డాంటె అరెస్టయిన అయిదుమాసాలకు వృద్ధుడు మర్నిదా చేతుల్లో మరణించాడు.

11

పద్దెనిమిదో లూయీ తిరిగి రాజ్యానికి వచ్చిన ఏడాదికి కారాగారాల తనిఖీ జరిగింది. అంధకారకూపంలో ఉన్న డాంటెకి దూరంలోసందడి వినవచ్చింది. అంతిదూరంలో ఆ సందడిమామూలు మనుష్యులకైతే వినిపించదు. కాని, అంధకారంలో నివాసం అభ్యాసమైన డాంటెకి, ఇప్పుడు గోడపైన సాలెపురుగు కదిలినా, పైకప్పునుంచి నీటిచుక్కలు రాలినా, వినపడుతుంది. అవతల "జీవితాన్ని గడుపుతున్న వారి" మధ్య ఏదో కొత్త సందడి బయలుదేరిందని అతను ఊహించుకున్నాడు. ఇన్నాళ్లు ఈ గోరీలో గడిపిన తను ఇంక చచ్చిన వారితోనే జత అనుకున్నాడు.

తనిఖీ ఆఫీసరు వచ్చి ఖైదీల్ని చూశాడు. ఖైదీలలో మందబుద్ధులూ, సోమరులూ అయినవారిని ఏరి, వారిని అంత కఠినంగా చూడనక్కర లేదని సిఫార్సు చేశాడు. వారి ఆహారం ఎలావుందని ప్రశ్నించాడు. ఏమైనా కోరికలుంటే తెలపమన్నాడు. అందరూ దాదాపు ఒకేరీతిగా సమాధాన మిచ్చారు. ఆహారం దుర్భరంగా ఉంది; విడుదల చెయ్యాలి. ఇంకేమైనా చెప్పవలసింది ఉందా అని అడిగాడు. ఖైదీలు లేదని తల లూపారు. ఆజన్మ కారాగారవాస శిక్షితులకు ఇంతకంటె కోరదగిన దేముంది? తనిఖీఆఫీసరు గవర్నరు వంక తిరిగి చిరునవ్వుతో అన్నాడు: "ఈ తనిఖీవల్ల ఏం ప్రయోజనం ఉంటుందో నాకు బోధపడటంలేదు. ఒక్క ఖైదీని చూస్తే చాలు, అందర్నీ చూసినట్లే. అందరు చెప్పేదీ ఒకటే. ఆహారం బాగుండలేదు; తా మేపాపం ఎరగరు. ఇంతే. ఇంకెవరైనా ఖైదీలున్నారా?"

"ఉన్నారు. పిచ్చెత్తిన వాళ్ళు కూపాల్లో ఉన్నారు."

"అక్కడికి వెడదాం నడవండి" అన్నాడు తనిఖీ ఆఫీసరు, విసుగుదలతో. "చేసే పనేదో పూర్తిగా చెయ్యాలి."

"ఆగండి" అన్నాడు గవర్నరు. "కూడా ఇద్దర్ని పెట్టుకోవాలి మనం. ఆఖైదీలకి ప్రాణాలమీద విసుగుపుట్టి, ఒక్కొక్కప్పుడు మరణశిక్షైనా దొరుకుతుందికదా అనే ఉద్దేశంతో దౌర్జన్యానికి దిగుతారు. వాళ్ళు మీమీదే పడవచ్చు."

ఇద్దరు సైనికులొచ్చారు. చీకట్లో అందరూ మెట్లు దిగారు. అక్కడ వాసన దుర్భరంగా ఉంది.

"ఇక్కడొక పెద్ద కుట్రదారు డున్నాడండి. వాడు దేనికీ వినుతియ్యడు."

"ఎన్నాళ్లనుంచి ఉన్నాడు?"

"ఏడాదినుంచి."

"మొట్టమొదటినుంచీ వాణ్ని ఈ కూపంలోనే ఉంచారా?"

"లేదండి. ఆహారం తీసుకెళ్లే వార్డర్‌ని చంపడానికి ప్రయత్నం చేసిన తరవాతనే వాణ్ని ఇక్కడ పడేశాం. వార్డర్ ఇక్కడే ఉన్నాడు; వాడు చెప్తాడు."

"అవునండి. నన్ను చంపాలని చూశాడండి" అన్నాడు వార్డర్, ఏంటోయిన్. "వాడు రాక్షసుడండి."

"అయితే నువ్వు ఫిర్యాదు చేస్తావా?"

"అక్కర్లేదండి. వాడికి తగినశాస్తి అయింది. ఇంకో ఏడాది తిరక్కముందే వాడికి పూర్తిగా పిచ్చెత్తిపోతుందిలెండి."

"అది వాడికే మంచిదిలే" అన్నాడు తనిఖీ ఆఫీసరు. పూర్తిగా పిచ్చెత్తిందంటే, వాడికింక బాధనేది ఉండదు."

"బాగా చెప్పారు" అన్నాడు గవర్నర్. "మీకీ విషయం బాగా తెలుసునండి. ఇక్కడికి ఇరవై అడుగుల్లో ఇంకో కూపం ఉంది. అందులో ఒక ముసలి ఫాదరీ ఉన్నాడు. ఒకప్పుడు ఇటలీలో ఏదో పార్టీకి నాయకుడని చెప్తారు. ఇక్కడ 1811 నించి ఉంటున్నాడు. 1813 ఆఖరుకి అతనికి పూర్తిగా మతిస్థిరం తప్పింది. ఆతరవాత మనిషి గుర్తుపట్టడానికైనా వీల్లేకుండా మారిపోయాడు. మొదట తెగ ఏడ్చేవాడు; ఇప్పుడు తెగనవ్వుతున్నాడు. అప్పుడు బాగా చిక్కిపోయి ఉండేవాడు; ఇప్పుడు బలిశాడు. వీడికంటె ఆఫాదరీని చూడ్డం మంచిది. అతని పిచ్చి చూస్తే నవ్వు వస్తుంది. విచారం కలగదు."

"ఇద్దర్నీ చూస్తాను. నాకర్తవ్యాన్ని నేను పూర్తిగా నెరవేర్చాలి. ముందు వీణ్ని చూద్దాం."

"పెద్దతాళాలు చప్పుడైనాయి. తుప్పుపట్టిన తలుపులు గరగరమన్నాయి. ఒకమూల కూచున్న డాంటె ఈ శబ్దం వినగానే తలెత్తాడు.

గవర్నర్ చేతులు కట్టుకుని ఒక కొత్తవ్యక్తికి ఖైదీల్ని చూపడం డాంటె చూశాడు. ఇద్దరు కాగడాలు పట్టుకుని వచ్చారు. ఇద్దరు సైనికులుకూడా ఉన్నారు. దీని అర్థం డాంటే ఊహించాడు. గవర్నర్ కంటె పై ఉద్యోగి వస్తున్నందువల్ల, ఇది మంచి అవకాశ మనుకున్నాడు. లేచినిలబడి చేతులు కట్టుకున్నాడు. ముందుకు వచ్చాడు. వెంటనే సైనికులిద్దరూ తుపాకు లెత్తి దగ్గరకు వచ్చారు. తనిఖీ ఆఫీసరు ఒకడుగు వెనక్కు వేశాడు.

తాను దౌర్జన్యపరుడని చెప్పి ఉంటారని గ్రహించాడు డాంటె. నిశ్చలంగా నిలబడ్డాడు. ముఖంలోని కాఠిన్యాన్ని మాపు చేసుకోడానికి ప్రయత్నించాడు. చూడవచ్చిన ఆఫీసరు దయ సంపాదించడానికి, వినయం ఉట్టిపడేలాగు తన కథనంతా చెప్పాడు. విన్నవారంతా చకితులైనారు. తనిఖీ ఆఫీసరు గవర్నరు వంక తిరిగి "ఇతను నిక్షేపంలా ఉన్నాడు. క్రమంగా రాజభక్తి నేర్చుకుంటాడులే. కాని, చాలా భయపడుతున్నట్టున్నాడు. చూడండి. తుపాకులు కనిపించగానే వెనుకంజ వేశాడు. పిచ్చివాడైతే దేన్ని చూసినాసరే జంకడు. ఈవిషయమై నేను చాలా చదివాను." అంటూ ఖైదీవంక తిరిగి అన్నాడు: "నువ్వు కోరేదేమైనా ఉందా?"

"నేనే నేరం చేశానో తెలుసుకోనివ్వాలని నా కోరిక. న్యాయమూర్తుల్ని నియమించి నాపైన నేరాన్ని విచారించండి. నేను నేరస్థుడినైతే నన్ను కాల్చి చంపండి. నిర్దోషినని రుజువైతే విడుదల చెయ్యండి."

"నీకు ఆహారం నచ్చుతోందా?" అని అడిగాడు తనిఖీ ఆఫీసరు.

"బాగానే ఉందనుకుంటాను. కాని, నాకు సరిగ్గా తెలియదండి. నాకు అదంత ముఖ్యమైన విషయంకాదు. నాకు ముఖ్య

మైన దేమిటంటే న్యాయం విచారించడం. అది నాకే కాదు; న్యాయాన్ని నిర్ణయించే శాసనవిధికి, మనల్ని పరిపాలించే మహారాజుకికూడా ముఖ్యం. ఏ నేర మెరగని నావంటివాడిని అన్యాయంగా నిర్బంధించబడకుండా కాపాడ్డం అందరికీ ముఖ్యమైన విషయమే."

"వార్డర్‌ని కొట్టాలని చూసినప్పుడు మరోక మాదిరిగా మాట్లాడావ్?" అన్నాడు గవర్నరు.

"నిజమేనండి. అతను నాపట్ల ఎప్పుడూ మంచిగానే ఉన్నాడు. క్షమించమని అతన్ని కోరుతున్నాను. కాని, అప్పుడేం చెయ్యను! కోపంతో పిచ్చెత్తిపోయింది. నా మనస్సు నా వశంలో లేకపోయింది."

"ఇప్పుడు నీ మనస్సు నీ వశంలో ఉందంటావా?"

"అవునండి. నిర్బంధం నన్ను లొంగదీసింది. చాలకాలం నుంచి ఇక్కడ ఉంటున్నాను."

"ఎంతకాలం? నువ్వు అరెస్టయిన దెప్పుడు?"

1815 ఫిబ్రవరి 28 మధ్యాహ్నం రెండు గంటలకి అరెస్టయినాను."

తనిఖీ ఆఫీసరు లెక్కగట్టాడు. "ఇప్పుడు 1816 జూలై 30. అంటే? నువ్వు నిర్బంధంలో ఉన్నది పదిహేడు మాసాలేనా? ఇంతేనా?"

"ఇంతేనా అంటున్నారా? ఖైదులో పదిహేడుమాసాలు గడపడం అంటే ఎలా ఉంటుందో మీకు తెలియదు. అది పదిహేడు సంవత్సరాలో, పదిహేడు యుగాలో ననిపిస్తుంది; ముఖ్యంగా నావంటివాడికి. పెళ్లి చేసుకోబోతున్నాను. మంచి ఉద్యోగం దొరికింది. ఒక్క క్షణంలో అంతా తుడిచిపెట్టుకుపోయి, వెలుగులోనుంచి అంధకారంలోకి పడిపోడం, భవిష్యత్తు నాశనమైపోవడం, ప్రియురాలు ఇంకా ప్రేమతో ఉన్నదో, లేదో తెలియక, తండ్రి జీవించిఉన్నాడో, లేదో తెలియక, ఇక్కడ ఇలా మగ్గిపోడం ఎటువంటిది? పదిహేడు మాసాల కారాగారవాసం ఎంత నీచ నేరానికైనా పొందవలసిన శిక్ష కాదు. నన్ను కరుణించండి. మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. నేను కోరేదల్లా ఒక్కటే. నా నేరాన్ని విచారించండి. ఇది నిరాకరించరానిది కదా!"

"అవును. దాని సంగతేదో చూస్తాను" అన్నాడు తనిఖీ ఆఫసరు. గవర్నరు వంకతిరిగి, "తిరిగి వెళ్లేటప్పుడు ఇతన్ని గురించిన కాగితాలు రిజిష్టర్‌లో నాకు చూపించండి."

డాంటె మళ్ళీ అన్నాడు:—"నన్ను విడుదలచేసే అధికారం మీకు లేకపోవచ్చును. కాని నా ప్రార్థనను మీరు అధికారులకు అందచెయ్యగలరు. నేరవిచారణ ఒక్కటే నేను కోరేది. నేనే నేరం చేశానో, నాకే శిక్ష విధించారో తెలుసుకోగలుగుతాను. ఇది తెలియకపోడం కంటె క్రూరహింస మరొకటి ఉండదు."

"సరే, పైకి దీపం చూపించండి" అన్నాడు తనిఖీ ఆఫీసరు.

డాంటె అన్నాడు: "అయ్యా! మీకంఠ స్వరాన్ని బట్టి మీకు నాపైన దయకలిగిందని ఆశపడుతున్నాను. నేను ఆశపడవచ్చునా? ఒక్కమాట చెప్పండి."

"అలా చెప్పడానికి వీల్లేదు. నీ రికార్డు పరిశీలిస్తానని మాత్రం చెప్పగలను. నిన్ను అరెస్టు చేయించిన వారెవరు?"

"విల్‌ఫర్ట్. ఆయన్ని చూసి, ఆయనతో సంప్రదించండి."

"విల్‌ఫర్ట్ మార్సేల్స్ విడిచి వెళ్లి ఏడాదయింది. ఇప్పుడు టూలన్‌లో ఉన్నారు."

"ఓహో! అదా?" అని గొణుక్కున్నాడు డాంటే. "నన్ను రక్షించగలవాడొక్కడూ ఇక్కడ లేడన్నమాట!"

"విల్‌ఫర్ట్ నీపైన ద్వేషం పెట్టుకోడానికి కారణమేమైనా ఉందా?"

"ఏమీ లేదండి. ఆయన నాపైన దయతోకూడా ఉన్నారు."

"అయితే, ఆయన ఇచ్చిన సమాచారాన్ని నేను నమ్మవచ్చునన్నమాటేనా?"

"తప్పకుండా."

"అయితేసరే. ఏమాతుందో కనిపెట్టుకుని ఉండు."

డాంటే మోకాళ్లపైన వొంగి, చేతులెత్తి నమస్కరించాడు. తన నీ నరకంలోనుంచి ఉద్ధరించడానికి దేవతవలెవచ్చి ఆశ పురిగొల్పిన వ్యక్తిని ఆశీర్వదించాలని భగవంతుని ప్రార్థించాడు తలుపులు మూసుకున్నాయి. గది మళ్లీ అంధకారబంధుర మయింది. కాని, ఆవ్యక్తిచూపిన ఆశ, డాంటే ఒంటరితనంలో వెలుగునిచ్చింది.

ఇవతలకి వచ్చిన తరవాత తనిఖీఆఫీసరుతో గవర్నర్ అన్నాడు: "ముందు ఇతని రికార్డుచూస్తారా? లేక ఇంకోఖైదీని చూస్తారా?"

"ముందుఖైదీ లందర్నీ చూడ్డం పూర్తికావాలి."

"ఇప్పుడు మనం చూడబోతున్న ఖైదీ ఇతనిమాదిరిగా ఉండడు. అతని భ్రమలూ, యోచనలూ ఇతనిగోడులా ఉండవు. తనకి పెద్ద ధన నిక్షేపం ఉందనుకుంటూ డతను. ఖైదులో ఉంచిన మొదటి సంవత్సరం, తన్ని విడుదల చేస్తే ప్రభుత్వానికి పదిలక్షల ఫ్రాంకు లిస్తాననేవాడు. రెండోసంవత్సరం ఇరవైలక్ష లిస్తాననేవాడు. మూడోసంవత్సరం ముప్పైలక్షలు; ఇలాగే లంచం పెంచుకుంటూ వచ్చాడు. ఇప్పటికి అయిదేళ్లయింది. ఇప్పుడు మిమ్మల్ని చూడగానే మీతోరహస్యంగా మాట్లాడి, ఏభైలక్ష లిస్తానంటాడనుకుంటాను!"

"ఈ కోటీశ్వరుడి పేరేమిటి?"

"ఫెరయా."

"27 నంబరు?"

అవునండి. ఏంటోయిన్! తలుపు తియ్యి."

తనిఖీ ఆఫీసరు నలువంకలా కుతూహలంతో చూస్తూ ప్రవేశించాడు. గోడసున్నం గిలికి, గదిమధ్యలో పెద్ద సున్న గీసి, సున్నమధ్య కూచున్నాడు ఫెరయా. గుడ్డలు బొత్తిగా చిరిగిపోయున్నాయి. రేఖాగణితానికి చెందిన రేఖా చిత్రాలేవో గీస్తూ కూచున్నాడు. మహా విజ్ఞానశాస్త్రవేత్త వలె ధ్యానమంతా తన పనిపైన లగ్నం చేశాడు. తేమనేలపైన కాగడాల వెలుగు పడేవరకూ రేఖాగణితంనుంచి ఫెరయా మేలుకోలేదు. వెలుగు చూసి చటుక్కున లేచి నిలబడ్డాడు. ఇంకొంచెం గౌరవంగా కనిపించడానికి, పడకపై నున్న గుడ్డ లాగి ఒంటికి చుట్టుకున్నాడు.

తనిఖీ ఆఫీసరు మామూలు పాట మొదలెట్టాడు:


"నువ్వడగవలసిందేమైనా ఉందా?"

ఫెరయా ఆశ్చర్యపడినట్లు చూశాడు. "నేనా? నాకు కావలసింది ఏదీ లేదు."

"నీకు బోధపడ్డం లేదు. నేను ప్రభుత్వం తరఫున వచ్చాను. ఖైదీల్ని చూసి వాళ్లు చెప్పేవీ, కోరేవీ తెలుసుకోడం నా కర్తవ్యం."

"ఓ! అదైతే వేరు. ఇద్దరం ఒకరి నొకరు అర్థం చేసుకోగలమని అనుకుందాం. నేను ఫెరయా. ఫాదరీని. రోమ్ నగరంలో పుట్టాను. కార్డినల్ రోస్పిగ్లియాజీ వద్ద ఇరవైయేళ్లు కార్యదర్శిగా ఉన్నాను. నన్నెందుకు అరెస్టుచేశారో నాకు తెలియదు.

(46-వ పేజీ చూడండి)



కిష్టమ్మ

శ్రీ జి. విద్యాసాగర్

వాడేనె వాడేనె
వచ్చి చూడండమ్మ.
సయ్యాట లాడేటి
వయ్యారి కిష్టమ్మ,
చిలిపి చేష్టలు చేయు
చిన్నారి కిష్టమ్మ.... వాడేనె॥....


నలుపైన దేహమ్మ,
తలపైన పింఛమ్మ,
హారాలు మెడలోన
జీరాడు తుంటేను,
మిలమిలా కిష్టమ్మ
మెరిసి పోతాడమ్మ... వాడేనె॥...

పొరు గిళ్లలో దూరి
పెరుగు, పాలూ, వెన్న
పొట్ట నిండా మెక్కి
పొగరు బట్టాడమ్మ.... వాడేనె॥...

కుండ లన్నీ పగుల
గొట్టి పోతాడమ్మ.
పట్టుకో వస్తేను
పారిపోతా డమ్మ.... వాడేనె॥...

బృందా వనమ్ములో
వేణు వూదాడంటె
విరు లన్ని పులకించి
విచ్చి చూచే నంట!
నాగులే పడగెత్తి
నాట్యమాడే నంట;
అలలెత్తి యమునమ్మ
అంజలించే నంట.

వాడేనె వాడేనె
వయ్యారి కిష్టమ్మ.
చూచి పోదురుగాని
చేరరా రండమ్మ.



టామ్ సాయర్

మార్క్ ట్వేన్

ఆ రోజు మంగళవారం. సాయంత్రమైంది. సెట్ పీటర్సుబర్గ్ గ్రామంలో ఇంకా దుఃఖం తగ్గలేదు. టామ్, బెకీ లింకా దొరకలేదు. చర్చిలో పిల్లల క్షేమం కోరుతూ ప్రార్థనలు జరిగాయి. ఇళ్లలో కూడా చాలమంది హృదయపూర్వకంగా ప్రార్థనలు చేశారు. కాని గుహనుంచి ఎలాంటి మంచి కబురూ రాలేదు. గుహను గాలించిన వాళ్ళలో ఎక్కువమంది నిరాశ చేసుకుని, తిరిగి వచ్చేశారు. పిల్లలు దొరుకుతారనేది ఇక కలలో మాటే నని వాళ్లు చెప్పారు.

శ్రీమతి థాచర్ మంచంమీద నుంచి లేవటంలేదు. ఆవిడకి సంధించినట్టుకూడా కనిపిస్తోంది. కూతుర్ని ఆమె పేరు పెట్టి పిలిచినప్పుడు వినే వాళ్లకి గుండె బద్దలవుతోంది. బెకీ వచ్చిందనే ఆశతో లేచి తలఎత్తి చూసేది; మళ్ళీ వాలిపోయి మూలిగేది. పోలీపెద్దమ్మకి ఉవ్వెత్తుగా దుఃఖం రావటం మానేసి, సమానంగా సర్దుకుంది. గోధుమరంగుగా వున్న ఆమెతల పూర్తిగా నెరిసి ముగ్గుబుట్టలా తయారైంది. మంగళవారం రాత్రి గ్రామస్థులు విచారభారంతో అలిసి నిద్రపోయారు.

అర్థరాత్రివేళకి గ్రామంలో గంటలు రణగొణ ధ్వనిగా మోగాయి. మరుక్షణాని కల్లా వీధులన్నీ జనమయమైపోయాయి. "దొరికారు-దొరికారు-పిల్లలు దొరికారు," అని కేకలు మిన్ను ముట్టాయి. ఊళ్లో పిల్లలు డబ్బాలు, బూరాలు ఏది దొరికితే అది మోగించి నానాగోల చేశారు. తండోపతండాలుగా జనం నదివైపు నడిచారు. టామ్, బెకీలని బండిమీద ఎక్కించుకుని కొందరు లాక్కువస్తున్నారు. జనం బండి చుట్టూ మూగి, దానితోపాటు కదుల్తూ, "హుర్రా, హుర్రా" అని కేకలువేస్తూ ఊళ్లోకి తిరిగి వచ్చారు.

ఊరంతటా దీపాలు వెలిగించబడ్డాయి. ఎవ్వరూ ఇళ్లకి పోలేదు. ఆ గ్రామంలో అంత గొప్ప రాత్రి ఎప్పుడూ జరగలేదు. వందలకొద్ది జనం జడ్జిథాచర్ గారి ఇంటిని ముట్టడించారు. ఇద్దరు పిల్లల్ని ఎత్తుకుని ముద్దులుకురిపించారు. సంతోషంలో నోట మాట రాలేదు. వాళ్లకన్నీళ్లు కాలవలు కట్టాయి.

కడవలో నీళ్లు నిండినట్టు పోలీపెద్దమ్మకి గొంతుకదాకా సంతోషం నిండి, ఆమెని ఉక్కిరిబిక్కిరి చేసింది. శ్రీమతి థాచర్ కి కూడా

అంత పనీ అయింది. కాని ఆమె ఆ సంతోషంలో వాళ్లు మరిచిపో లేదు. జడ్జి థాచర్ ఇంకా గుహ వద్దనే ఉన్నారు. వెంటనే ఆయనకి కబురు పంపింది పిల్లలు దొరికినట్టు.

టామ్ ఒక సోఫాలో పడుకు న్నాడు. అతని చుట్టూ జనంమూగి, అతను వర్ణించే సాహస కృత్యాలు నోరు తెరుచుకుని వింటున్నారు. తను చెప్పే కథని ఆకర్షణీయంగా చేసేందుకుగాను టామ్ కోతలు కూడా కోశాడు. దోవ కనుక్కు నేందుకు తను బెకీని వదలి ఎల్లా వెళ్లాడో చెప్పాడు. గాలిపటం దారం విప్పుకుంటూ ఆ చీకట్లో ముందుకు పాకిపోయాడు. రెండు మలుపులు తిరిగేటప్పటికి దారం అయిపోయింది. అయినా దారాన్ని బాగా సాగదీసి మూడో మలుపు కూడా తిరిగాడు. ఇక లాభం లేదని వెనక్కి తిరగబోయాడు.

ఇంతలో చాలా దూరాన ఒక తెల్లటి చుక్క కనిపించింది. అది సూర్యకాంతిలా వుంది. వెంటనే దారం వదిలేసి, నెమ్మదిగా ఆ కాంతి కనిపించే చోటుకి పాక్కుంటూ పోయాడు. అక్కడ నించి ఒక చిన్న కంతగుండా తల దూర్చి చూశాడు. విశాలమైన మిసిసిపీనది హోరున ప్రవహిస్తోంది. అది రాత్రే గనక అయివుంటే, ఆ తెల్లటి చుక్క కనిపించేదే కాదు. నిరాశ చేసుకుని వెనక్కి వెళ్లిపో యేవాడు.

వెంటనే టామ్ బెకీవద్దకు పరుగున వెళ్లి బయటికిపోయే దోవ కనిపించిందని చెప్పాడు. ఆమె తన్నా ఇలాంటి అబద్ధాలతో నమ్మించ వద్దని, తను ఎలాగూ చచ్చిపోవటం నిశ్చయమనీ, అసలు చచ్చిపోవా లనే వుందనీ అన్నది. ఆమెని నమ్మించే టప్పటికి తాతలు దిగొ చ్చారు. మూడో మలుపు దగ్గిర నుంచి ఆ తెల్లటి చుక్కని చూసిం దాకా నమ్మకం లేనిబెకీ, అది చూడగానే ఎగిరి గంతులు వేసింది. టామ్ ముందు తను అవతలకు దిగి, తరవాత బెకీని చెయ్యి పట్టుకుని దించాడు. అక్కడ కూర్చుని చాలాసేపు ఇద్దరూ ఏడ్చారు.

ఇంతలో కొందరు ఒక పడవలో ఆ వేపునే ప్రయాణం చేస్తున్నారు. టామ్ వాళ్లని కేకలువేసి పిలిచాడు. తమ కథ నంతా వాళ్లకి చెప్పాడు. వాళ్లు మొదట్లో టామ్‌కథ నమ్మ లేదు. ఎందుకంటే ఆ గుహాద్వారం అక్కడికి అయిదుమైళ్ళ ఎగువన వున్నది. చివరి కెలాగయితేనేం పడవలో ఎక్కించుకుని ఒక యింటికి తీసుకుపోయి, కడుపు నిండా భోజనం పెట్టారు. చీకటి పడిన తర్వాత రెండు మూడు గంటలు విశ్రాంతి తీసకున్నారు. తరవాత పడవ వాళ్లే ఇద్దర్నీ సెంట్ పీటర్సుబర్గు తీసుకు వచ్చారు.

తెల్లవారక ముందే కొందరు పోయి గుహలో ఇంకా వెదుకుతూ వున్న జడ్జి థాచర్‌కి, మరికొందరికీ ఈ శుభవార్త తెలియజేశారు.

మూడు పగళ్లు, మూడు రాత్రులు గుహలో పడిన శ్రమ, ఆకలి బాధ ఊరికే పోలేదు. టామ్, బెకీలు బుధ వారం, గురువారం మంచంమీాద నుంచి లేవలేక పోయారు. శుక్ర వారంనాటికి టామ్ కొద్దిగా లేచి తిరిగాడు. శనివారానికి మామూలు మనిషయ్యాడు. బెకీ ఆదివారానికి గాని తన గది విడిచి రాలేక పోయింది. కాని పెద్ద జబ్బుపడి లేచి నట్టు కనుపించింది.

హాక్ ఫిన్ కూడా జబ్బుగా ఉన్నా డని తెలిసి టామ్ చూట్టానికి వెళ్లాడు. కాని అతన్ని లోపలికి రానియ్య లేదు. శనివారం, ఆది వారం కూడా అలాగే జరిగింది. ఆ తరువాత రోజూ హాక్‌ని చూట్టానికి వీలైంది. తన సాహసాన్ని గాని, వేడెక్కించే మరే విషయాన్ని గాని హాక్ ఎదుట వాగవద్దని వైద్యులు హెచ్చరించారు. ఈ హెచ్చరికని టామ్ అమలు జరిపేట్టు చూట్టానికి డగ్లస్ అమ్మగారు పక్కనే కాపలా కాసింది.

కార్డిఫ్ మెట్టమీాద జరిగిన సంఘటన టామ్‌కి తెలిసింది. చిరుగు గుడ్డల మనిషి శవం నదిలో తేలుతూ కనిపించిందనీ, పారిపోవటానికి నది లో దూకగా మునిగిపోయి వుంటా డనీ, కూడా తెలిసింది.

టామ్ గుహ నుండి బయట పడి రెండు వారాలు గడిచింది. హాక్ ఈ లోగా బాగా కోలుకున్నాడు. ఉద్రేకం కలిగించే ఏ సంగతైనా వినటానికి సిద్ధంగా ఉన్నాడు. అందు

చేత తన సాహసకృత్యాలు వర్ణించెయ్యాలనే ఆరాటంతో టామ్ బయల్దేరాడు. దోవలో బెకీని చూట్టానికి జడ్జిథాచర్ గారింటివద్ద ఆగాడు. జడ్జిగారు, ఆయన స్నేహితులు టామ్ చేత తెగవాగించారు. టామ్‌ని ఉడికించటానికి ఒకాయన "మళ్ళీ ఆ గుహకి వెళ్తావా?" అని అడిగాడు. వెళ్లటానికి తనకేమీ అభ్యంతరం లేదన్నాడు టామ్. జడ్జిగారిలాగన్నారు:

"టామ్! నీలాగ వెళ్లాలని ఇంకా కొంత మంది ఉబలాటపడుతుండవచ్చు. కాని అందుకు తగిన జాగ్రత్తలు మేము ముందే తీసుకున్నాం. ఇక ఆ గుహలో ఎవ్వరూ తప్పిపోలేరు."

"ఏం"?

"ఆ గుహద్వారాన్ని ఇనప తలుపులతో రెండు వారాలకిందటే మూసేశాం. పెద్దపెద్ద తాళాలు మూడు బిగించాము. తాళంచెవులు నా దగ్గరున్నాయి."

టామ్ మొహం మంచులా తెల్లబడిపోయింది.

"ఏమిటది టామ్! అరె!...... అల్లావున్నావేం... ఏయ్, కాసిని నీళ్లు తీసుకురండి!"

టామ్ మొహంమీద చన్నీళ్లు చల్లారు. కొంచెం తేరుకున్నాడు.

"ఏమిటి టామ్?"

"జడ్జిగారూ! ఆ గుహలో ఇంజన్‌జో వున్నాడు."

మరికొన్ని నిముషాల్లో ఈవార్త వూరంతా పాకింది. డజనుపడవల్లో జనం బయల్దేరారు. ఆ తరవాత ఇంకా అనేకమంది ప్రయాణీకుల్ని ఎక్కించుకుని రహదారిపడవ బయల్దేరింది. జడ్జిగారెక్కిన పడవలోనే టామ్ సాయర్ వున్నాడు.

గుహాద్వారం తెరవగానే చాలా విషాదకరమైన దృశ్యం గోచరించింది.

తలుపులోని పగులుదగ్గరగా మొహంపెట్టి, కాళ్లుచేతులు చాచుకుని, ఇంజన్ జో చచ్చిపడి వున్నాడు. ఆపగులులోంచి కనబడే సూర్యరశ్మికేసే ఆఖరి నిమిషందాకా దీనంగా చూస్తూ చూస్తూ ఆరిపోయినట్లున్నాయి వాడికళ్లు. టామ్‌కు చాలా జాలి కలిగింది. ఎందుకంటే తాను గుహలోపడిన దుర్భర యమయాతనలనుబట్టి ఇంజన్‌జో ఎంతబాధపడి చచ్చిపోయి వుంటాడో గ్రహించాడు. అయినప్పటికి అతని గుండెల్ని ఇంతకాలమూ నొక్కిపెడుతున్న ఒకపెద్దబరువు తొలగిపోయినట్లయింది. ఇంజన్‌జోకు వ్యతిరేకసాక్ష్యం ఇచ్చినప్పటినుంచీ క్షణక్షణమూ తనుఎంత భయపడుతూ గడిపాడో ఇప్పటివరకూ టామ్ పూర్తిగా గ్రహించలేదు. హంతకుని శవంచూసిన తర్వాత అతని మనసొక్కసారి తేలికైంది.

ఇంజన్‌జో పక్కన అతనికత్తి రెండుముక్కలై పడివుంది. తలుపుల కిందవున్న గడప కొంతవరకూ పెల్లగించబడింది. కాని ఇంజన్‌జో శ్రమ అంతా వ్యర్థమే. ఎందుకంటే గడప కవతల ఇనుముకంటే బలమైన రాతిపలకవుంది. కత్తి దాన్నేమీ చెయ్యలేక పోయింది. పైగా తనే విరిగివూరుకుంది. ఒకవేళ బయట రాతిపలక లేకపోయినా ఇంజన్‌జో శరీరం తలుపు అడుగునుంచి బయటపడగలగటం అసంభవం. ఈ సంగతి ఇంజన్‌జోకి తెలుసు. అయినా ఏదో విధంగా దుర్భరమైనకాలం గడపాలి. అందుచేత కత్తితో కొయ్యగడపని గీరుతూ కూర్చున్నాడు.

సాధారణంగా గుహలో అక్కడా యిక్కడా యాత్రికులు వదలివెళ్లిన కొవ్వొత్తి ముక్కలు కనిపిస్తాయి. కాని ఇప్పుడొక్కటైనా లేదు. ఇంజన్‌జో వాటిని తినేశాడు. కొన్ని గబ్బిలాలని కూడా పట్టుకున్నాడు. వాటి పంజాలు మాత్రం వదిలివేసి మిగతాదంతా తినేశాడు. పాపం ఆకలికి మాడిమాడి చచ్చిపోయాడు.

ఆ దగ్గర్లో, ఎన్ని శతాబ్దాలనుంచో ఏర్పడుతున్న రాతి ఊడలున్నాయి. (గుహాకప్పునుంచి తేమనీళ్లు ఊరి బొట్లుబొట్లుగా నేలపడతాయి. ఈ నీటి బొట్లలో కాల్షియం అనే పదార్థం వుంటుంది. నీరు ఇగిరి కాల్షియం మాత్రం మిగిలి కొన్నిఏళ్లకి ఇలా రాతి ఊడలు ఏర్పడతాయి. నేలమీద పడిన నీటిబొట్లు కూడా ఇగిరి కాల్షియం మిగిలి రాతి కమ్ములు పైకి పెరుగుతాయి.) ఇంజన్‌జో దాహం తీర్చుకోటానికి, ఒక ఉపాయంచేశాడు. ఒకచిన్న రాతిపలకని మధ్యలో గుంటచేసి పైనుంచి నీటిచుక్క కిందపడేచోట పెట్టాడు.

ఆ నీటిచుక్క మూడేసి నిమిషాల కొకటి చొప్పున పడుతుంది. 24 గంటల్లో ఒక చెంచా నిండుతుంది.

ఆ నీటిచుక్క ఈజిప్టులో పిరమిడ్లు కట్టబడిన కొత్తలో రాలింది; ట్రాయ్‌నగరం ధ్వంసమైన రోజుల్లో రాలింది; రోమ్ నగరం నిర్మింపబడే రోజుల్లో, ఏసుక్రీస్తును శిలువవేసినప్పుడు, బ్రిటిషు సామ్రాజ్యపు పునాదులు కట్టబడేటప్పుడు, కొలంబస్ అమెరికాను కనిపెట్టినప్పుడు కూడా ఆ నీటిచుక్క రాలుతూనే వున్నది. ఇప్పటికీ అది పడుతూనే వుంది. చరిత్ర గర్భంలో ఇవన్నీ మునిగి మరువబడే రోజులు వచ్చినప్పుడుకూడా ఆ చుక్క అలా పడుతూనే వుంటుంది.

ప్రతి సంఘటనకీ ఫలానా ప్రయోజన మంటూ వుందా? ఈ మానవ కీటకానికి అవసర మొస్తుందేమోనని అయిదువేల ఏళ్లనుంచీ ఆ నీటిచుక్క అలా విసుగు, విరామం లేకుండా పడుతూన్నదా? లేకపోతే పదివేల ఏళ్లపిమ్మటనో ఇంతకంటె మహత్కార్యానికి దేనికో అది నిరీక్షిస్తోందా? ఏమో తెలియదు.

దురదృష్టవంతుడైన ఇంజన్ జో అమూల్యమైన ఆ నీటి చుక్కల కోసం రాతిగిన్నెనుపెట్టి ఎన్నో ఏళ్లు గడిచింది. కాని ఇప్పటికీ మెక్‌డుగాల్ గుహను చూడవచ్చే యాత్రికులు నరకబాధను తలపించే ఆ రాతిగిన్నె కేసీ; మూడు నిమిషాల కొకటిచొప్పున రాలే ఆ నీటిచుక్క కేసి ఎక్కువసేపు చూస్తారు. ఇంజన్ జోగిన్నె గుహలోని వింతలన్నిటికీ వింత. "అల్లాడిన్ భవనం" కూడా దానికి సాటిరాదు.

ఇంజన్ జోని గుహాద్వారం వద్దనే పాతిపెట్టారు. చుట్టుపక్కల ఏడు మైళ్లదూరంనుంచికూడా జనం పడవలెక్కీ, బళ్లెక్కీ వచ్చారు. పిల్లలతోను, భోజన సామగ్రితోను తర్లి వచ్చారు. ఇంజన్ జోని పాతిపెట్టినప్పుడు, ఉరితీస్తే వచ్చేటంత సంతృప్తి కలిగినట్టు వాళ్లంతా ఒప్పుకొన్నారు.

ఇంజన్‌జోను క్షమించ వలసిందని కోరుతూ గవర్నరుకు పిటీషను పెట్టడానికి ఇంతకు ముందే కొందరు నిశ్చయించారు. ఆ పిటీషనుమీద అనేకమంది సంతకాలు చేశారు. గవర్నరు దగ్గిరికి ఏడుస్తూ వెళ్లి, క్షమా భిక్షను వేడటానికి ఒక ఆడవాళ్ళ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. గ్రామంలో అయిదుగుర్ని ఇంజన్‌జో చంపినట్టు పుకారువుంది. అయితే ఏం? వాడు సాక్షాత్తు సైతాను అయినా సరే, క్షమించమని ప్రాధేయపడే మూర్ఖులు అనేకమంది ఉంటారు.

ఇంజన్‌జో చచ్చిపోవటంతో పిటీషను గొడవకాస్తా తుడుచుకుపోయింది.

అంత్యక్రియలు జరిగిన మర్నాడు టామ్ హాక్‌ని చాటుకి పిలుచుకు వెళ్లాడు ఒక ముఖ్య వ్యవహారాన్ని చర్చించటానికి.

వేల్సు దేశస్థుడి ద్వారాను, డగ్లస్ అమ్మగారి ద్వారాను హాక్‌కి ఇదివరకే తెలిసింది టామ్ సాహస కృత్యాల విషయం. అయినా వాళ్లు చెప్పని ముఖ్యవిషయం ఇంకోటి వుందన్నాడు టామ్. హాక్ విచారముఖం పెట్టాడు. ఇలా అన్నాడు:

"టామ్! అదేదో నాకు తెలుసు. నువ్వు నంబర్ 2లోకి వెళ్లావు. విస్కీ తప్ప మరేమీ కనబడలేదు. నువ్వేనని నా కెవరూ చెప్పలేదనుకో. అయినా, విస్కీ విషయం వినగానే నువ్వే అయి వుంటావని నేను గ్రహించాను. నీకు డబ్బు దొరకలేదు. దొరికితే ఇంకెవళ్ళతో చెప్పినా, చెప్పకపోయినా నాతో తప్పకుండా చెప్పేవాడివి. ఆ డబ్బు మనది కాదని నేను మొదటే భయపడుతూనే వున్నాను.

"అదేమిటి హాక్! హోటలువాడి నేరం బయటపెట్టింది నేను కాదా. నేను శనివారం నాడు పిక్నిక్‌కి వెళ్లేటప్పటికి హోటలువాడి నేరం ఎవరికీ తెలియదు. అసలు నువ్వేగా ఆ రాత్రి కాపలా కాసింది?"

"అవు నవును. ఎప్పుడో ఏడాదికిందట జరిగినట్టుంది అదంతా. ఆ రాత్రే నేను ఇంజన్‌జోని అమ్మగారి ఇంటి దాకా వెంబడించాను."

"నువ్వు వెంబడించావా?"

"అవును. కాని ఎవ్వరితోనూ చెప్పకు. ఇంజన్‌జో చచ్చిపోయినా, ఇంకా వాడి స్నేహితు లున్నారు. వాళ్లు నా వెంటపడి ఏడిపించటం నా కిష్టంలేదు. ఆ రాత్రి నేనే గనక లేకపోతే ఇంజన్ జో ఈపాటికి టెక్సస్ రాష్ట్రంలో ఖుషీగా తిరుగుతూ ఉండేవాడు.

తరవాత హాక్ తను చేసిన సాహస మంతా టామ్‌కి వినిపించాడు. టామ్ వేల్సు దేశస్థుడినుంచి కొంతభాగం మాత్రమే విన్నాడు.

"ఏమైతేనేం, నంబర్ 2. లో విస్కీ ఎవరు చూశారో వాళ్లే డబ్బు కాజేసివుంటారు. అది మన కెల్లాగూ దక్కదు," అని నిట్టూర్పు విడిచాడు హాక్.

"హాక్! డబ్బు అసలు నంబర్ 2. లో లేనేలేదు!"

"అరే! మరి అయితే ఎక్కడుంది?"

"గుహాలో వుంది!"

హాక్ కళ్లు తళుక్కున మెరిశాయి.

"మళ్లీ అను ఆమాట."

"గుహాలో వుంది డబ్బు!"

"వేళాకోళమా? నిజమా?"

హాక్ నీతోడు! నాతోడు! దాన్ని కొట్టేయ్యడానికి నాకు సహాయంచేస్తావా?"

"తప్పకుండా! మనకేమీ అపాయం రాకపోతే, తప్పకుండా వెడదాం."

"ఇప్పు డక్కడికి వెళ్ళటం అతి తేలిక. అంత తేలిక పని ప్రపంచంలో మరొకటి లేదు."

"నీ కెల్లా తెలుసు, గుహాలో వుందని?"

హాక్! కాస్త ఆగు. అక్కడ గనక డబ్బు దొరక్కపోతే నా చెవి కోసి ఇస్తాను. నా డప్పు' డాలు, ఇంకా నాకున్నవన్నీ ఇచ్చేస్తాను. పందెమేనా?"

"ఆల్ రైట్, టామ్! ఎప్పుడు వెడదాం?"

"ఇప్పుడే. నీకు ఒంట్లో ఓపిక వుందా?"

"గుహాలో, చాల దూరం పోవాలా? నేను మహా నడిస్తే ఒక మైలు నడవ గలనేమో."

"మ రెవడైనా వెళ్లాలంటే అయిదుమైళ్ల దూరం నడవాలి కాని నాకు దగ్గిర దోవ తెలుసు. నాకు తప్ప ఇం కెవరికీ అది తెలియదు. నిన్ను అక్కడికి పడవలో తీసుకు వెడతాను. నేనే పడవ నడుపుతా. నువ్వు చిటికెనవేలు కూడా కదల్చక్కర్లేదు."

"అయితే బయల్దేరు."

"ఆల్ రైట్. మనకి కొన్ని రొట్టెలు, మాంసం, చుట్టలు, ఒకటి రెండు సంచులు, గాలిపడగదారం, అగ్గిపెట్టెలు కావాలి. నే నిదివరకు అక్కడున్నప్పుడు ఇవన్నీ ఉంటే ఎంత బావుండునో, అనిపించింది."

ఆ మధ్యాహ్నం ఒక చిన్న పడవని "ఎరువు" తెచ్చారు (పడవ యజమాని ఊళ్లో లే డనుకోండి.) వెంటనే నదిమీద బయల్దేరారు. గుహ ద్వారం దాటి కొన్నిమైళ్లు వెళ్ళాక, టామ్ ఇలా అన్నాడు:

"చూశావా, ఇక్కడిదాకా ఈ ప్రాంతం అంతా ఒకే మాదిరిగా వుంది. ఇళ్లు గాని, దొడ్లు గాని ఏమీ లేవు. పొదలుకూడా అన్నీ ఒకే మోస్తరుగా వున్నాయి. కాని నేను ఒక గుర్తు పెట్టుకున్నాను. అక్కడ నేల ఒరిగిపోయినట్టు కనిపిస్తోందే? అక్కడ తెల్లగా లేదూ? అదే నా గుర్తు. ఇప్పుడు ఒడ్డుకు పోదాం పద."

ఒడ్డు చేరారు.

"హాక్! మనం నుంచున్న దగ్గిర్నించి గాలంకర్రతో తడిమి చూడు. నేను ఇవతల కొచ్చిన సొరంగం కనిపిస్తుంది."

హాక్ ఆ చుట్టుపక్కల తెగ వెదికాడు. కాని ఏమీ కనబడలేదు. టామ్ సగర్వంగా ఒక పొదలోకి నడిచాడు.

"ఇదుగో సొరంగం! ఇంత మంచి, గొప్ప, అద్భుతమైన సొరంగం ఈ దేశంలో లేదు. కాని నువ్వు నోటికి తాళం వేసుకుని వుండు. ఎవరికీ చెప్పకు. నేను మొదటినుంచీ గజదొంగ కావాలని అనుకుంటున్నా. కాని ఇలాంటిది దొరకందే గజదొంగ కావటం కష్టం. దీన్ని మనమే అచ్చంగా ఉంచుకుందాం. అయితే మనకి దొంగల ముఠా ఒకటుండాలి గనక జోహార్పర్ని, బెన్ రోజర్సుని మాత్రం రానిద్దాం. "టామ్‌సాయర్ ముఠా" అని దానికి నామకరణం చేద్దాం. బావుంది కదూ, ఈ పేరు?"

"ఓ, చాలా బావుంది టామ్! ఎవర్ని దోచుకుందాం?"

"ఆ, ఎవరైనా దోచుకోవచ్చు. దార్లుకొట్టాలి."

"వాళ్లని చంపేద్దామా?"

"ఉహూ. అందర్నీ చంపగూడదు. వాళ్లని గుహాలో దాచి పరిహారం తీసుకోవాలి."

"పరిహార మంటే?"

"డబ్బు. డబ్బిస్తే గాని వాళ్లని వదిలిపెట్టమని వాళ్ల బంధువులకి ఉత్తరాలు రాయాలి. వీలైనంత డబ్బు గుంజాలి. డబ్బు రాదనుకో. ఒక ఏడాదిదాకా చూసి చంపెయ్యాలి. అది మా మూలుగా చెయ్యాల్సిన పని. కాని ఆడవాళ్లని చంపగూడదు. వాళ్లని ఖైదు చెయ్యాలి; అంతేగాని చంపగూడదు. వాళ్లు అందంగా వుంటారు.

బాగా డబ్బు కూడా వుంటుంది. వాళ్లసలే పిరికివాళ్ళు. నగలు వగైరా సరుకంతా తీసుకోవచ్చు. కాని వాళ్లతో ఎప్పుడు మాట్లాడినా టోపీ తీసేసి నెమ్మదిగా, రామ్యదగా మాట్లాడాలి. దొంగలంత మర్యాదస్థులు మరెవళ్ళూ లేరు. ఏ పుస్తకం చదివినా అది తెలుస్తుంది. రెండు మూడు వారాలయ్యాక ఆడ ఖైదీలు ఏడవటం, తిట్టడం మానేసి, మన్ని ప్రేమించటం మొదలెడతారు. ఇక వాళ్లని పొమ్మన్నా పోరు. బయటికి తోలేసినా సరే, మళ్ళీ వెనక్కి వస్తారు. అన్ని పుస్తకాల్లోనూ అలాగే వుంది."

"బలే, బలే. సముద్రపు దొంగ కావటం కంటే బందిపోటు దొంగ అయితేనే మజాగా వుంటుంది."

"అవును. కొన్ని విషయాల్లో ఇదే బావుంటుంది. ఇంటికి దగ్గరగా ఉండచ్చు. సర్కసులూ, అవీ చూస్తూ ఉండచ్చు."

ఈ లోపల అంతా రెడీ అయింది. ఇద్దరూ సొరంగంలో ప్రవేశించారు. టామ్ ముందు నడిచాడు. సొరంగం చివరిదాకా వెళ్లి, అక్కడ దారం కట్టారు. ఇంకా ముందుకు పోయారు. నీటిబుగ్గ దగ్గిర కొచ్చారు. దాన్ని చూసి టామ్ గజగజ వణికిపోయాడు. అక్కడ గోడమీద ఇంకా మిగిలిన కొవ్వొత్తి వత్తిని టామ్ స్నేహితుడికి చూపించాడు. తానూ, బెకీ అక్కడ కూర్చుని కొవ్వొత్తి రెపరెపలాడుతూ ఆరిపోతుంటే ఎంత బాధ అనుభవించిందీ వర్ణించాడు.

ఇప్పు డిద్దరూ గుసగుస లాడుతున్నారు తప్ప, బిగ్గిరిగా మాట్లాడటం లేదు. ఆ గాఢ నిశ్శబ్దం, ఆ అంధకారం భయంకరంగా వున్నాయి. ఇంకా ముందుకు పోయి, పోయి, ఇంజన్ జో ఆరోజున టామ్‌కు కనిపించిన ప్రాంతం చేరుకున్నారు.

"హక్! ఇప్పుడు నీకు ఒక తమాషా చూపిస్తాను."

టామ్ కొవ్వొత్తిని ఎత్తి పట్టుకున్నాడు.

"నీకు ఆ మూల కనిపించినంత దాకా చూడు. కనిపించిందా? అక్కడ—ఆ పెద్ద బండరాయి మీద కొవ్వొత్తి మసితో గీసిన—"

"టామ్! అదే శిలువ!!"

"ఆ. ఇప్పుడు నీ నంబర్-2. ఏమైంది? 'శిలువ కింద' హా! అదిగో, అక్కడ నాకు ఇంజన్ జో కొవ్వొత్తి పట్టుకుని కనిపించాడు!"

ఆ వింత శిలువకేసి హక్ తేరి చూశాడు. తడబడే కంఠంతో ఇలా గన్నాడు:

"టామ్! పోదాం పద, ఇక్కణ్ణించి."

"అరె. డబ్బక్కర్లేదా?"

"అక్కర్లేదు. ఇంజన్ జో దెయ్యమై తిరుగుతూ వుంటాడు అక్కడ."

"కాదు, ఇక్కడ ఉండదు దెయ్యం. వాడు చచ్చిపోయిన చోటే తిరుగుతూ వుంటుంది."

"కాదు టామ్! నీకు తెలియదు. డబ్బున్న చోటే అది కాపలా వుంటుంది. దెయ్యాల సంగతి నాకు బాగా తెలుసు."

టామ్ కూడా హక్ చెప్పింది నిజమేనని భయపడ్డాడు. ఎల్లాగురా, అనుకున్నాడు. కాని ఇంతలో మంచి ఆలోచన ఒకటి తట్టింది.

"చూడు హక్! మనం వుట్టి తెలివితక్కువ దద్దమ్మలం. పవిత్రమైన శిలువ దగ్గిరికి దెయ్యాలు వస్తాయీ, ఎక్కడన్నా?"

ఇది బలే వాదన.

"అవును, టామ్! నాకీ ఆలోచన తట్టనే లేదు. నిజమే. ఆ శిలువ అక్కడ వుండటం మంచిదే అయింది," అన్నాడు హక్.

ఆ బండరాయి దగ్గిరికి వెళ్ళటానికి 20, 30 అడుగుల గుట్ట అడ్డం వుంది. దాన్నెక్కి దిగారు. నాలుగు మలుపులు తిరిగిన తర్వాత రాయి కనిపించింది. మొదటి మూడు మలుపుల్లోనూ వెదికారు. కాని అక్కడ ఏమీ లేదు. రాయి దగ్గిరగా వున్న మలుపులో ఒక చిన్న గొయ్యి వుంది. దాంట్లో కొన్ని కంబళ్లు కప్పబడి వున్నాయి. అక్కడ ఎంత వెదికినా డబ్బు పెట్టె కనబడలేదు. టామ్ చివరికన్నాడు:

"శిలువ కింద, అని ఇంజన్ జో అన్నాడు. శిలువకింద అంటే మరి ఇదేగా?-రాతికింద ఉండదు గదా!

మళ్ళీ వెదికారు; నిరాశ పుట్టి చదికిల బడ్డారు. హాక్‌కి ఉపాయమేమీ తోచలేదు. కొంతసేపటికి టామ్ అన్నాడు:

"రాతికి ఒక పక్కన మాత్రమే కాలిజాడలూ, కొవ్వొత్తి మసీ కనిపిస్తున్నాయి. మిగతా పక్కల లేవు. కనక డబ్బు రాతి కిందనే ఉండాలి. నేను మట్టి తవ్వేస్తాను."

"అవును తవ్వి చూద్దాం."

టామ్ తవ్వ నారంభించాడు. నాలుగు అంగుళాల లోతు తవ్వాడో లేదో కొయ్య తగిలింది.

"హాక్! హే! వినిపించిందా?"

హాక్ తవ్వ నారంభించాడు. కొన్ని కొయ్యచెక్కలు తవ్వి పైకి తీసేశాడు. వాటికింద ఒక గొయ్యి వుంది. ఆ గొయ్యి రాతికింద దాకా వుంది. టామ్ అందులో దిగి కొవ్వొత్తి పట్టుకుని చూశాడు. రాతి కింద చాలా దూరందాకా చూశాడు. కాని, సొరంగంలాంటి ఆ గొయ్యికి అంతం కనిపించలా. ఇంకా ముందుకు పోదా మన్నాడు. వంగి వంగి ముందుకు నడిచాడు. హాక్ అనుసరించాడు. ఆ ఇరుకు దోవ నెమ్మదిగా భూమిలోకి దిగుతోంది. ముందు కుడివేపుకి, తరవాత ఎడమ వేపుకి, ఆ దోవ మలుపులు తిరిగింది. తరవాత చటుక్కుని మరో మలుపు తిరిగింది. టామ్ కేకేశాడు:

"అరెబాప్! ఇక్కడ చూడు."

అది డబ్బు పెట్టె. నిజంగా, ముమ్మాటికీ, డబ్బుపెట్టె. దాని పక్కన తుపాకి మందు దాచుకునే ఖాళీ డబ్బా వొకటి వుంది. తోలు సంచుల్లో రెండు తుపాకులు, ఒక తోలు బెల్టు, రెండు మూడు పాత జోళ్లు, ఇంకా ఏదో చెత్త, చెదారం చాలా వున్నాయి.

రాముడు స్కూలునుంచి ఉత్సాహంగా వచ్చాడు. చంకలో కొత్తపుస్తకాన్ని చూసి తండ్రి అడిగాడు, ఏం పుస్తకమని.


"నాకు పరీక్షలో ఫస్టు మార్కు వచ్చింది. బహుమానం ఇచ్చారు." అన్నాడు రాముడు.

"ఏం ప్రశ్న వేశారు మాష్టారు?"

"ఉష్ట్రపక్షికి ఎన్ని కాళ్లు, అని అడిగారు. మూడు కాళ్లు అని చెప్పాను."

"ఉష్ట్రపక్షికి రెండేగా కాళ్లు?"

"అవును, నాకా సంగతి తరవాత తెలిసింది. అందరూ నాలుగు కాళ్ళన్నారు. నేను మూడు కాళ్లన్నాను. నాలుగుకంటే మూడు ఎక్కువ రైటుగా!" అన్నాడు రాముడు.



గ్రామంలో హాసన్ అనే యువకుడు ఉండేవాడు. అతడు చాల బీదవాడు. అతనికి సరైన దుస్తులు, ఆహారంకూడ లభించేవి కాదు.

ఒకనాడు హాసన్ ఒక వలను తీసికొని ఊరిబయట వున్న అడవికి బయలుదేరాడు. ఏదైనా జంతువో పక్షియో దానిలో చిక్కుకుంటే చంపితిందామనే ఉద్దేశ్యం తో, అతడువలను ఆ అడవిలో పన్ని ఒక పొదచాటున నక్కి కూర్చున్నాడు. పాపం చాలసేపు అలానే కూర్చున్నాడు. ఏ ఒక్క జీవీ దాంట్లో చిక్కుకోలేదు. ఇక నిరాశచేసుకున్నాడు. ఇంతలో ఏదో రెక్కలు కొట్టుకుంటున్నట్లు ధ్వని వినబడింది. ఆ దిశకేసి చూచాడు. ఒక కాకి దాంట్లో చిక్కుకుని తప్పించుకోటానికి తన్నుకుంటోంది.

"నా కింతకంటె అదృష్టం లేదు" అని అనుకుంటూ ఆ వలను సమీపించి కాకి బంధనాలను వదల్చి దాన్ని చంపటానికని మెడ దగ్గరకు చేతిని పోనిచ్చాడు. విచిత్రం! ఇంతలో కాకి మానవ స్వరంతో ఇలా చెప్పసాగింది.

"హాసన్. నన్ను చంప వద్దు. నన్ను వదలిపెట్టు. నిన్ను అదృష్ట లక్ష్మి వరించేటట్లు చేస్తాను." అని అంది.

కాకి మానవస్వరంతో మాట్లాడటం చూచేసరికి హాసన్‌కి చాల ఆశ్చర్యం కలిగింది. ఆ ఆశ్చర్యాన్ని మరుగు పరచి "నిన్ను ఇప్పుడు చంపి తిని నా ప్రాణాన్ని నిలుపుకోవటమే నా అదృష్టం. ఇంతకంటె అదృష్టం నా కేమీ లేదు. అయినా నీవు నాకుకల్పించే అదృష్టమేమిటి" అని అన్నాడు.

రచన:

శ్రీ చిట్టూరి శ్రీరామ కోటేశ్వరరావు

మరల హాసన్ తన చేతిని కాకి మెడ దగ్గరకు పోనిచ్చాడు చంపటానికి. కాని మరల కాకి హీన స్వరంతో ఇలా అంది. "హాసన్ నీవు ఏం చేస్తున్నావో నీకే తెలియదు. నేను సామాన్యపు కాకిని కాను. నీవు ఈ రోజుకి నన్ను విడచి రేపు ఈ ప్రదేశానికి వచ్చావంటే నా కంటే అనేక రెట్లు విలువగల వస్తువు నీకు దొరుకుతుంది."

"సరే కానియ్. నీ విచారకరమైన పలుకుల నాలకించి నిన్ను ఇప్పుడు విడచిపెట్టడం లేదు. నాకు ఏదో అదృష్టం కల్పిస్తానన్నావే ఆ అదృష్టంమీాది ఆశకొద్ది వదలిపెడుతున్నా" అని అన్నాడు హాసన్.

"నీవు చూద్దువుగానిగా నేను ఎంత నమ్మకస్తురాలినో. అది సరే గాని నీవు మూడు ఈకలను నా రెక్కలనుండి లాగి తీసుకో, నీ కేదైనా ఆపద సంభవిస్తే ఒక రెక్కను తీసి గాలిలోకి ఎగురవేయి.



నేను వచ్చి తగిన సాయంచేస్తా." అని చెప్పింది కాకి.

హాసన్ కాకి చెప్పినట్లు ఊకలు తీసుకుంటూ నవ్వకుండా ఉండ లేక పోయాడు.

"ఇపుడు పరిహాసంగా నవ్విన నవ్వు రేపు నిన్ను అదృష్టం వరించిన తర్వాత సంతోషంతో నవ్వుతావ్." అని చెప్పి కాకి ఎగిరి పోయింది.

ఆ రోజుకు హాసన్ ఇంటికి వెళ్లి పోయి మరుచటి దినం అడవికి వెళ్ళాడు. నిన్నటిదినమున వాను పన్నినచోటను చూచేసరికి సంభ్రమాశ్చర్యాలతో పెద్ద కేకవేశాడు.

ఆ వలలో ఒక అందమైన పక్షి ఉంది. ఆ పక్షిని హసన్ ఎప్పుడూ చూడ లేదు సరిగదా అంతటి అందమైన పక్షి ప్రపంచములో ఉంటుందని ఎప్పుడూ గూడా ఊహించలేదు. దాని రెక్కలన్నీ వెండిని పోలి వున్నాయి. వాటిమీద ఇంద్ర ధనుస్సు రంగులతో ఈకలు వున్నాయి. దాని కళ్ళు వజ్రాలు మాదిరిగా ఉన్నాయి. అబ్బ... దాని అందాన్ని వర్ణించడం ఆదిశేషునకు కూడ అలవి అవుతుందా అవదా అనేది అనుమానాస్పదం.

"ఇది భక్షించటానికి తగినదా? తగదు. రాజుగారికి కానుకగా సమర్పింప తగినది. నా ఈ కానుకకు రాజుగారు అమితమైన ధనం ఇస్తారు. ఆ ధనంతో కాకి చెప్పినట్లు అదృష్టలక్ష్మి నన్ను వరించిన దవుతుంది. అని అనుకొని హసన్ గబగబా తన ఇంటికి పోయి ఒక పంజరం తెచ్చి ఆ వింత పక్షిని అందులో పెట్టి దానిమీద గుడ్డ కప్పి తీసుకపోతున్నా డింటికి. ఎవరైనా చూస్తే పక్షికి దృష్టి దోషం కలుగుతుందని ఆ పంజరంమీద గుడ్డ తప్పాడు హసన్.

సరే, ఇక హసన్ రాజుగారి భవనానికి బయలు దేరాడు. ఎంతో కష్టంమీద హసన్ రాజుగారి సమక్షానికి పోయి పంజరంమీద ఉన్న వస్త్రాన్ని తొలగించాడు.

ఆ పక్షిని చూడగానే రాజుగారికి ఆశ్చర్యం అమితంగాకలిగింది. అంత అందమైన పక్షిని రాజుగారు కూడ ఎప్పుడూ చూడలేదు. రాజుగారు ఆదుర్దాగా నీవీ పక్షిని ఎక్కడ పట్టావ్? ఎప్పుడు పట్టావ్? ఎలా పట్టావ్? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హసన్ తాను పక్షిని ఎలా పట్టిందీ అంతా వివరంగా రాజుగారికి చెప్పేశాడు.

"దీంట్లో ఏదో వింత ఉండాలి" అన్నారు రాజుగారు. ఇంకా ఇలా అన్నారు. "నాకు నీ కానుక అమిత సంతోషాన్ని ఇచ్చింది. ఆకాకి చెప్పినట్లు నిన్ను అదృష్టం వరించింది."

రాజుగారు హసన్‌కి మంచి దుస్తులు, ఆభరణాలు, పెద్ద భవనం, సేవకులను ఇచ్చి బంగారం కూడా ఇచ్చారు. హసన్ అందగాడు, తెలివిగలవాడు, బలవంతుడు, ధైర్యశాలి అగుటచేత రాజుగారు ప్రతిదినం అతనితో కాలక్షేపం చేయటం, ఆలోచించడం జరిపేవారు. కొద్దికాలంలోనే హసన్ రాజుగారివద్ద మంచి నమ్మకము గల సేవకు డైనాడు.

"విజయం శత్రువులను సృష్టిస్తుంది" అని అన్నట్లుగా హసన్ యొక్క విజయం రాజుగారివద్ద అంతకు ముందు ఉన్న ఆంతరంగికులకు అసూయను, శత్రుత్వాన్ని, కల్పించింది.

రాజుగారి ఆంతరంగిక సేవకులంతా కలసి హసన్‌ను వెళ్ళగొట్టడానికి లేదా చంపివేయటానికి కుట్ర పన్నుతున్నారు. ఒక రోజున వీరు రాజుగారి వద్దకు పోయి "అయ్యా హసన్ తెచ్చినటువంటి ఆసుందరమైన పక్షికి ఆ ఇనప పంజరమా? ఆ ఇనుప పంజరం ఆపక్షి యొక్క అందాన్ని గూడ చెడగొడ్తోంది చక్కగా దానికి ఒక దంతపు పంజరం ముండి దాంట్లోకి మీరు స్వేచ్ఛగా వెళ్లడానికీ, రావడానికీ ఏర్పాటు వుంటే చూడండి ఎంత అందంగా ఉంటుందో" అని పురిగొల్పారు.

"అది నిజమేకాని ఆ భవనం తయారు చేయించడం ఎలా? నా రాజ్యములో ఒక భవనానికి సరిపడు దంతాన్ని ఇవ్వగల ఏనుగులు గూడ లేవు'' అని అన్నాడు రాజు.

"అది చాల సులభం" అన్నారు హసన్ శత్రువులు. వారు ఇంకా ఇలా అన్నారు. "హసన్ ఇందుకు సమర్థుడు. అత డనేక మాయలు తెలిసినవాడు. అతడు తప్పక చేయగలడు. అతడు ఒకవేళ నిరాకరిస్తే చంపిస్తానని బెదిరించండి కొలది దినాలలోనే భవనం తయారవుతుంది"

పాపం రాజుగారు ఇదంతా నమ్మి అలా చేయడానికి నిశ్చయించుకున్నారు.

కొంతసేపైన తర్వాత రాజుగారు హసన్ కోసరం కబురు పంపారు హసన్ రాజుగారి సమక్షానికి వచ్చాడు.

హసన్ నీవు నాకు అందమైన పక్షిని ఇచ్చి సంతోష పరిచావ్ ఇప్పుడు ఇంకొక సాయం చేసి సంతోషపరచాలి. ఆ పక్షికొఱకు ఒక దంతపు భవనం తయారు చేయాలి

కొంట్లోకి నే పోతూ, వస్తూండేటందుకు తగిన ఏర్పాటు చేయాలి'' అన్నారు రాజుగారు. "ఇదెలా సాధ్యమవుతుంది మహాప్రభూ! నా దగ్గర అంత దంతాన్ని ఇవ్వగల ఏనుగులే లేవు. చివరకు మీ రాజ్యంలోగూడ లేవు. నేను ఎలా తయారు చేయగలను మహాప్రభూ'' అని విన్నవించుకున్నాడు హసన్.

"తప్పక నీవు తయారు చేసి ఇవ్వాలి లేదా నీ ప్రాణం నీనుండి వేరవుతుంది" అన్నారు రాజుగారు

హసన్ విచారంతో స్వగృహం చేరుకున్నాడు. అతని దగ్గర ఒక భవనం కట్టగల ఏనుగు దంతాలు ఎచ్చట లభిస్తాయి. కనుక చావు తప్పదని నిశ్చయించుకున్నాడు. తలవని తలంపుగా అతనికి ఆ కాకి ఈకల విషయం జ్ఞప్తికి వచ్చింది. కాని అవి జ్ఞాపకం రాగానే అవి తప్పక ఎచ్చటనో పోయిఉంటా యనుకున్నాడు. కాని ఆశతో తన పాతగృహానికి పోయి ఇల్లంతా వెదకాడు. అదృష్టవశాత్తు అవి ఒక మూల దొరికినాయి. అతడు వాటిలోని ఒక ఈక తీసి గాలిలో ఎగురవేశాడు కాకికోసరమై.

కొలది నిముషాలలోనే కాకి వచ్చి హసన్ ప్రక్క వ్రాలింది. "నీ కేమి కావాలి, నన్నెందుకు పిలిచావ్? నీవు ఏదైనా ఆపదలో ఉన్నావా?'' అని అడిగింది కాకి.

"కావలసినంత కష్టం. నా ప్రాణానికే ముప్పు వచ్చింది'' అన్నాడు. తర్వాత రాజుగారికోరిక తెలిపి అది ఎలా సాధ్యపడుతుందో తెలపమని ప్రార్థించాడు హసన్.

"ఏం విచారపడకు. ఇది నీ వనుకున్నంత కష్టమైన పని గాదు. నీవు పోయి నలభై పీపాల సారా, నలభై మంది భటులను అడిగి తీసుకుని నాతో వచ్చేసెయి. తరువాత కార్యక్రమం నే చెపుతా" నని కాకి చెప్పింది.

హసన్ రాజుగారి వద్దకు పోయి కాకి చెప్పిన వన్నీ అడిగాడు. రాజుగారు వాటి నన్నిటినీ ఇచ్చాడు. వాటితో హసన్ అడవి చేరుకున్నాడు. అచ్చటనుండి కాకి పైన ఎగురుతూ వీరికి మార్గం చూపుతోంది. కొంతదూరం పోయిన తరువాత వారు ఒక చిన్న చెరువు వద్దకు వచ్చారు. ఆ చెఱువుకు ప్రతి రోజూ ఏనుగులు నీరు త్రాగటానికి వస్తాయి. కాని ఇపు డా చెఱువు లోని నీరు దాదాపు ఇగిరి పోయింది

కాకి యొక్క సలహాపై హసన్ తాను తెచ్చిన సారా నంతటినీ ఆ చెఱువులో గుమ్మరించాడు. తరువాత హసన్ సేవకులు అంతా కొంతదూరం పోయి దాగికొని ఏనుగుల రాకకు నిరీక్షిస్తూ ఉన్నారు. కొన్ని గంట లయిన తర్వాత ఒక ఏనుగుల గుంపు ఆ చెరువు దగ్గరకు వచ్చింది. అవి చాలా దప్పిగొని ఉన్నాయి. కొన్ని దినములనుండి సరిగా నీరు లేని ఆ చిన్న చెఱువులో నీరు ఉండటం చూచి ఏనుగు లన్నీ సంతోషంతో ఆ చెఱువులో దిగి కడుపు నిండా సారా త్రాగేశాయి. గట్టుమీదకు వచ్చి స్మృహతప్పి పడిపోయాయి ఏనుగు లన్నీ.

ఏనుగు లన్నీ స్మృహతప్పి పడిపోయిన తర్వాత హసన్ నలుబది మంది భటులతోనూ వచ్చి వాటి దంతా లన్నిటినీ కోసేశాడు. బండ్లు తెప్పించి వాటి మీద వేసుకు పోయాడు ఆ కోసిన దంతా లన్నిటిని.

హసన్ దంతపు శకటాలతో నగరమందు ప్రవేశించగానే హసన్ శత్రువు లంతా అసూయతోనూ, కోపంతోనూ, చలించిపోయారు. "అది మాకు తెలుసు,హసన్ సాధించరాని కార్యం ఈ ప్రపంచంలో లేదు" అన్నారు రాజుగారితో హసన్ శత్రువులు.

దంతపు భవనం తయారయింది. రాజుగారు సంతోషంతో భవనం లోనికి పోతూ వస్తూ కాలం గడుపుతూ హసన్‌ను ఇదివరకటికంటె ఎక్కువ ప్రేమతో చూస్తున్నారు.

హసన్ శత్రువులు దీనితో ఊరుకోలేదు. మరల ఇంకొక కుయత్నం పన్నారు. వారు రాజుగారియొద్దకు పోయి "అయ్యా హసన్ తెచ్చిన పక్షి ఇంత అందంగా ఉండి గూడ ఒక్క పలుకుగాని, పాటగాని ఎందు

చేత పాడదండి? హాసన్ దీన్ని పాడించగలడు. ఇది బహుశా, పాత యజమాని కోసం దిగులొంది ఉంటుంది. కాబట్టి హాసన్ చేత ఆ పాత యజమానిని కోటకు రప్పించండి పక్షి చక్కటి మాటల్లు, మీతో పల్కులు పలుకుతుంది. అపుడు దానియొక్క అందం, మీరు దాని కిస్తున్న ఆదరణ సార్థక మౌతాయని'' నూరిపోశారు హాసన్ యొక్క శత్రువులు.

పాపం రాజుగారు ఇదంతా నమ్మి "అవును నిజమే అది చక్కటి మాటలు, తియ్యని పాటలు పాడకపోవడం ఒక లోపమే" సరే ఇప్పుడే హాసన్‌ను అడుగుతా అనని హాసన్ కోసం కబురు పంపారు.

రాజుగారు యావద్విషయము హాసన్ కెరింగించి అందమైన పక్షి యొక్క పాత యజమానిని కోటకు తీసుకురావలసిన దని, లేకపోతే మరణశిక్ష తప్పదని చెప్పారు.

"అయ్యా ఈ పక్షిని ఎక్కడ పట్టుకున్నానో, ఎలా పట్టుకున్నానో సమస్త విషయం మీకు తెలిసిందే మరల మీరు దీని పాత యజమానిని హాజరుచేయించవలె నని నన్ను నిర్బంధించటం భావ్యంగాదు. ఇంకా ఆ ప్రాంతాలలో ఇల్లెక్కడా లేదు పోనీ ఆ ఇంటిలోనివారి కెవరికైనా ఈ పక్షి చెందియుంటుందేమో కనుక్కోడానికి. కాన ఈ కోరికను ఉపసంహరించుకొనవలయు నని ప్రార్థించుచున్నాను" అని దీన వదనుడై రాజుగారికి విన్నవించుకున్నాడు.

కాని హాసన్ యొక్క శత్రువుల ప్రోద్బలం వల్ల రాజుగారు హాసన్ పలుకులను పెడచెవిని పెట్టారు.

ఇక లాభం లేదనుకొని హాసన్ విచారంతో రాజుగారి సమక్షం నుండి తన యింటికి చేరుకున్నాడు. కాకి సాయంవల్ల ఆపద గట్టెక్కవచ్చు నన్న ఉద్దేశంతో మిగిలిన రెండు ఈకలలోని ఒక ఈక తీసి గాలిలోనికి ఎగురవేసి కాకిని పిలిచాడు.

వెంటనే కాకి వచ్చి హాసన్ ప్రక్కన వ్రాలింది. "నీకు నాతో ఏమి అవసర మొచ్చింది. నన్ను పిలిచావ్. మరల ఏవైనా కష్టాలు వచ్చినవా ఏమిటి?" అని ప్రశ్నించింది.

"కష్టా లేమిటి ప్రాణంమీదకు వస్తేను" అని రాజుగారి కోరికను హాసన్ కాకికి ఎరింగించాడు.

"ఈ పని ముందుసాధించినదానికంటె కష్టతర మైనది. సరే, కానియ్, ప్రయత్నిద్దాం. నీ విపుడు రాజుగారియొద్దకు పోయి ఒక ఓడను సిద్ధంచేయించమని చెప్పు. ఆ ఓడ ఎలా ఉండాలో విను. తెరచాపలు చక్కటి సిల్కు తో తయారు చేసి యుండవలె. ఓడ గోడ లన్నీ బంగారు రేకుతో తాపడం చేసినవై యుండవలె. ఓడలో భోజనశాల, చక్కటి అలంకారములతో కూడినదై యుండవలె. ప్రత్యేకముగా ఒక స్నానాలగది అంతయు పాలరాతితో చేయబడి, ఆ గదిలో పాలరాతిచే నిర్మింపబడిన ఒక తొట్టి యుంచవలె. ఇంత శోభాయమానంగా ఓడను తయారుచేయించి ఈయవలె నని రాజుగారితో చెప్పి తయారుచేయించు. తరువాత చేయవలసిన పని తరవాత చెపుతా నని" చెప్పి కాకి ఎగిరిపోయింది.

హాసన్ రాజుగారి వద్దకు పోయి కాకి వర్ణించిన విధంగా పడవను తయారుచేయించుటకు అనుమతి పొందాడు.

కొలది కాలంలోనే ఓడ తయారు చేయబడింది. ఓడ పూర్తి అయిన తర్వాత హాసన్ ప్రయాణానికి సిద్ధపడ్డాడు. కాకి వచ్చి ఓడ ప్రయాణానికి మార్గదర్శకత్వం వహించింది. వారు ఏడు రాత్రులూ, ఏడు పగళ్లు ప్రయాణంచేసి కనుచూపు మేర

ఒక దీవిని చూచారు. ఆ దీవి మిగుల అందముగా ఉంది,

"అటు చూడు హాసన్! ఆ దీవియే మన గమ్యస్థానము. ఇపుడు నే చెప్పబోయేది నీవు జాగ్రత్తగా విను. ఎందుచేత నంటే నీ వీ కార్యం సాధించే టప్పుడు నే నీ ఓడలోగాని, ఈ పరిసర ప్రాంతం లోగాని ఉండటానికి వీలు లేదు. అది ఎందుచేత నని ఇపుడు నీవు నన్ను అడగవద్దు. సమయమొచ్చి నప్పుడు నీకు తెలియగలదు. నీవు నా సలహాలను సక్రమంగా పాటించావంటే మన మొచ్చిన కార్యం జయప్రదముగా నెరవేరగలదు" అని చెప్పి హాసన్‌కు కాకి కొన్ని సలహాలను చెప్పింది.

హాసన్ కాకి ఇచ్చిన సలహాల నన్నిటిని పాటించెదనని కాకికి మాట ఇవ్వగానే కాకి ఎగిరి పోయెను. తరువాత హాసన్ ఓడ నావికునకు ఓడను ఆ కనుబడు దీవి యొక్క తీరమునకు తీసుకపొమ్మని ఆజ్ఞ ఇచ్చెను.

ఓడ ఆ దీవికి చేరగానే అచ్చటి ప్రజ లంతా గుంపులు గుంపులుగా వచ్చి ఆ ఓడను చూడటం మొదలు పెట్టారు. ఆ ప్రజ లంతా చక్కటి దుస్తులు ధరించి చాల అందంగా ఉన్నారు. కొలది సేపటికి ఆ దీవి యొక్క రాణివద్దనుండి కొందరు సేవకులు వచ్చిరి. అనగా ఆ దీవి ఒక స్త్రీ అధీనములో నున్న దన్న మాట.

రాణి సేవకులు హాసన్‌ను అనేక ప్రశ్నలు అడుగసాగారు. కాని హాసన్ కాకి సలహాపై ఆ సేవకుల ప్రశ్నలకు సమాధానము లివ్వలేదు. ఆ దీవి రాణికి కొత్తవిషయములనుగూర్చి తెలిసికొనవలె నన్న ఆతురత మెండు.

కాని హాసన్ వారితో ఒక్క మాటమటుకు చెప్పాడు "కావాలంటే మీ రాణిని వచ్చి చూడమను" అని.

ఆ సేవకులు అసంతృప్తితో తిరిగిపోయి హాసన్ యొక్క పలుకులను తమ రాణికి నివేదించిరి. కొలది సేపటిలోనే రాణి తన పరివారముతో ఓడ దగ్గరకు వచ్చి "నేను నా బృందముతో వచ్చి మీ యోడ చూడవచ్చునా?" అని ప్రశ్నించింది. ఆమెయొక్క అందచందాలను చూచి ఆమెయొక్క కోరిక ఎలా నిరాకరించాలో తెలియలేదు. కాని కాకియొక్క సలహా ప్రకారము నడచితీరాలని తన మనస్సును అధీనంలో ఉంచుకొని ఇలా అన్నాడు. "మీరు నా పడవ మీదకు రావడం చాల సంతోషం. ఈ ఓడ ఈ ఓడలోని వస్తువులు మీ సొంత విగానే భావించుకొనవచ్చు. కాని మీరు తప్ప మీ సేవకులు ఈ ఓడ లోనికి రాకూడదు. నా ఈ షరతునకు మీరు ఒప్పుకున్నచో నిరభ్యంతరంగా ఈ ఓడమీదకు వచ్చి సందర్శింపవచ్చును." అని అన్నాడు.

హాసన్ పలుకులకు రాణి చాల నిరాశ చెందింది. కాని ఓడ లోపల ఎంత అందంగా ఉన్నదో చూడాలన్న ఆదుర్దాతో ఆమె యొక్కర్తె ఓడలోనికి వచ్చింది.

(మిగతా కథ వచ్చేవారం)

పేపర్లో ఒక వ్యాసాన్ని శ్రద్ధగా చదుతున్న భర్త భార్యతో అన్నాడు:

చూశావా? చాలా మంచి వ్యాసం రాశా డెవడో. 'తండ్రి ప్రజ్ఞావంతుడు కావటం కొడుకులపూర్తి వికాసానికి అడ్డం వస్తుంది' అని రాశాడు. సరిగ్గా నా అభిప్రాయంకూడా అదే."

భార్య:— అయితే మన అబ్బాయి ప్రజ్ఞావంతుడు కావటాని కేమీ అడ్డం లేదన్న మాట.

* * * *

"మా ఆవిడకి నామీద చాలా అనుమానం. అస్తమానం నన్ను సాదిస్తూనే వుంటుంది. మీ ఆవిడా అంతేనా?"

"ఏమో తెలియదు. మా ఆవిడ నీ పేరెప్పుడూ ఎత్తలేదు."

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(31-వ పేజీ తరువాయి)

1811 లో అరెస్టు చేశారు. అప్పటినుంచీ నన్ను విడుదల చెయ్యాలని ఇటాలియన్ ప్రభుత్వాన్నీ, ఫ్రెంచి ప్రభుత్వాన్నీ కూడా అడుగుతున్నాను.

"ఫ్రెంచి ప్రభుత్వాన్నెందుకు అడుగుతున్నారు?" అన్నాడు గవర్నరు.

"ఎందుకంటే? నన్ను పియాంబినోలో అరెస్టు చేశారు. మిలాన్, ఫ్లారెన్స్‌ల మాదిరిగానే పియాంబినో కూడా ఫ్రెంచి ప్రభుత్వం కిందికి వచ్చిందికదా!" (నెపోలియన్ జయించిన ప్రాంతాలివి).

"అబ్బో! ఏనాటిమాట నువ్వు చెప్తున్నది?"

"నేను అరెస్టయిన రోజు నున్న పరిస్థితి అది. భగవంతుడిచ్చిన కొడుకు కోసమని నెపోలియన్ చక్రవర్తి రోమ్‌లో ఒక రాజరికాన్ని సృష్టించారు. నెపోలియన్ విజయాలు ఈపాటికి మెకియావెలీ, సీజర్ బార్గియాలు కన్నకలల్ని కూడా మించిపోయుండాలి. వాళ్లు ఇటలీ నంతటినీ ఒక్క ప్రభుత్వం కిందికి తేవాలని కలలు కనేవారు."

తనిఖీ ఆఫీసరు అన్నాడు: "నే చెప్పేది విను. భగవంతుడు కనికరించబట్టి చక్రవర్తి బ్రహ్మాండమైన కార్యక్రమాలకి అడ్డుపుల్ల తగిలింది. పాపం నీకలలు కూలిపోయాయనుకుంటాను."

"ఇటలీని బలీయమైన రాజ్యంగా చెయ్యాలంటే, దేశాన్ని ఐక్యపరచడం ఒక్కటే మార్గం. అప్పుడే ఇటలీకి స్వాతంత్ర్యం, అభ్యున్నతి లభిస్తాయి."

"కావచ్చును. కాని, పెద్దపెద్ద రాజకీయాల్ని గురించి నీ ఉపన్యాసాలు వినడానికి రాలేదు. నేను నీ ఆహారంగురించి కాని, మరొక దాన్నిగురించి కాని నువ్వు అడగవలసిన దేదైనా ఉంటే అడుగు. అది వినడానికి వచ్చాను."

"ఆహారం ఎలావుంటుంది? ఖైదుల్లో ఉన్నట్లే ఉంటుంది. అంటే బొత్తిగా పాడుగా ఉంటుందన్నమాట. వసతిమాట అడిగితే, చూశారుగా, ఎంత తేమగా ఉందో. బొత్తిగా అసహ్యంగా ఉంది. కాని, కూపమంటే ఇలాకాక ఇంకెలా ఉంటుంటిది? కాని, ప్రభుత్వానికి తెలపవలసిన కొన్ని ముఖ్య రహస్యా లున్నాయి. అందువల్లనే మీరొచ్చినందుకు చాలా సంతోషిస్తున్నాను— న్యూటన్ సిద్ధాంతాల్ని బోల్తాకొట్టించే ఒక లెక్క వేస్తున్నాను; నా ధ్యానం పాడు చేసినందుకూడా మిమ్మల్ని ఏమీ అనడం లేదు. మీతో ఒకరహస్యం చెప్పాలి. వింటారా?"

"అబ్బే! అది కుదరదు."

"పోనీ, బోలెడుధనం గురించిన రహస్యం అనుకోండి, మాట వరసకి ఏభైలక్షల ఫ్రాంకులు ప్రభుత్వానికి లభిస్తుందనుకోండి. ఇప్పుడైనా రహస్య వింటారా?"

"ఓయబ్బో!" అంటూ తనిఖీఆఫీసరు గవర్నరు వంక తిరిగాడు. "మీరు చెప్పిందినిజమే. లెక్క కూడా సరిగ్గా చెప్పారు."

తనిఖీఆఫీసరు వెళ్లిపోతున్నాడనిచూసి ఫెరయా అన్నాడు. "కాని, నామాటవినండి. పోనీ మీ ఒక్కరికే రహస్యంగా చెప్పాలనను. గవర్నరుకూడా వినవచ్చును."

గవర్నర్ అన్నాడు: "నువ్వు ఏంచెప్తావో మాకు ముందే తెలుసునోయ్, నీ ధన నిక్షేపాన్ని గురించి ఏకరువు పెడతావు. అంతేనా?"

పరిహాసంచేస్తున్న గవర్నర్ని ఫెరయా నిశ్చలదృష్టితో చూశాడు. మరెవరైనా అతన్ని చూసినట్లయితే అతను సత్యమే పలుకుతున్నాడని, మతితప్పిన వాడు కాదని భావించేవారే.

"అవును. అదికాకపోతే మరి దేన్నిగురించి మాట్లాడతాను?" అన్నాడు.

తనిఖీ ఆఫీసరన్నాడు: "దేవుడిదయావల్ల ప్రభుత్వానికి కావలసినంత ధనంఉంది. నీధనం అక్కర్లేదు. ఆ నిక్షేపాన్నంతనీ నువ్వు విడుదలయే రోజుకి దాచుకో."

"కాని, న్యాయానికి విరుద్ధంగా నన్ని నిర్బంధంలో ఉంచితే, రహస్యాన్ని ఎవ్వరికీ చెప్పకుండా నేను చచ్చిపోతే, ఏమాతుంది? ఈ నిక్షేపమంతా నష్టమై పోతుంది. అంతకంటె దాన్ని ప్రభుత్వం తీసుకోడం మేలుకాదూ? ఇంకా కావాలిస్తే అరవై లక్షలిస్తాను. అవును అరవైలక్షలూ ఇచ్చేసి, నేను మిగిలిందే తీసుకుంటాను. నన్ను విడుదల చేస్తేచాలు."

"నిజంగా, ఇతను పిచ్చివాడని ముందు చెప్పకపోతే, నిజమే చెప్తున్నాడనిపిస్తుంది సుమా! అంత నమ్మకంగా చెప్తున్నాడు" అన్నాడు తనిఖీ ఆఫీసరు.

"నేను పిచ్చివాణ్ని కాను. నిజమే చెప్తున్నాను. ఈ ధన నిక్షేపం నిజంగా ఉంది. నేను మీకు వ్రాసిఇస్తాను. నన్నా చోటికి తీసుకువెళ్లండి. మీరు చూస్తుండగానే నేల తవ్విద్దాం. అక్కడేమీ కనిపించక, నేను మిమల్ని మోసంచేసిన వాడినైతే, నేను పిచ్చివాడినే అయితే, నన్ను తిరిగి ఇక్కడికి తీసుకొచ్చి మళ్ళీ నిర్బంధంలో ఉంచండి. ఇక్కడే చివరిదాకా ఉంటాను. మిమ్మల్ని ఇంకా మీ అడక్కుండా, ఇక్కడే చచ్చిపోయే వరకూ ఉండిపోతాను."

గవర్నర్ నవ్వాడు: "ఎక్కడుందీ నిక్షేపం?"

"ఇక్కడికి మూడువందల మైళ్లదూరంలో."

"మంచి ఉద్దేశమే! ఈ ప్రయాణానికి ఒప్పుకుంటే, నీకు పారిపోడానికి చక్కని వీలు దొరుకుతుంది."

"సరే. నువ్వు చెప్పింది విన్నాం. ఇంక చెప్పు. నీ ఆహారం ఎల్లావుంది?"

ఫెరయా అన్నాడు: "నేను చెప్పింది సత్యమైతే, మీరు నన్ను విడుదల చేస్తారని ప్రమాణం చెయ్యండి. అదెక్కడ పాతిపెట్టిఉందో మీకు చూపిస్తాను.

"నీకు ఆహారం సరిగ్గా ఉందా?" అన్నాడు మళ్లీ తనిఖీ ఆఫీసరు విసుగుతో.

ఫెరయా అన్నాడు: "మీకు రాగల ప్రమాద మేమీ లేదు. పని పూర్తయేవరకూ నేనిక్కడే ఉంటాను."

"నా ప్రశ్నకి జవాబుచెప్ప వన్నమాట?"

"మీరూ నా ప్రశ్నకి జవాబు చెప్పడంలేదు. నా మాట నమ్మనివాళ్లందరితోపాటు నువ్వూ విరగడైపో. నా బంగారం తీసుకోవు. పోనీ! నాకే ఉంటుంది. నాకు స్వేచ్ఛ నివ్వవు. నాకు దేవుడే ఇస్తాడులే. వెళ్లు. నీకింక చెప్పవలసింది లేదు" అన్నాడు ఫెరయా బిగ్గరగా.

తనిఖీ ఆఫీసరు మెట్లెక్కి వెడుతూ గవర్నర్‌తో అన్నాడు: "ఇతనికి ఒకప్పుడు భాగ్యం ఉండిఉంటుంది."

"ఉందని కలగన్నాడేమో! తీరా మేలుకు నేసరికి మతిపోయి ఉంటుంది."

"అవును. నిజంగా భాగ్యమే ఉంటే, ఖైదులో ఎందుకుంటాడు?"

ఫెరయా బందీగానే ఉండిపోయాడు. ఎప్పటికంటె మరింత సుఖంగా ఉంటున్నాడని పేరు పడ్డాడు.

డాంటే విషయంలో తనిఖీ ఆఫీసరు తనమాట నిలబెట్టు కున్నాడు. రిజిస్టరు తెప్పించి చూశాడు. అందులో ఇలా వుంది:-

ఎడ్మండ్ డాంటే: బోనపార్టిస్ట్. దౌర్జన్యపరుడు. ఎల్బానించి నెపోలియన్ తిరిగిరావడానికి తోడ్పడ్డాడు. దిట్టమైన గస్తీతో, రహస్య ప్రదేశంలో నిర్బంధించాలి.

రిజిస్టర్ లో మిగతా వాక్యాల దస్తూరికీ, ఈ వాక్యాల దస్తూరికీ వ్యత్యాసం కనిపించింది. అంటే డాంటెని నిర్బంధంలోకి తీసుకొచ్చిన తరవాత ఇది వ్రాశారన్నమాట. నేరం తోసివెయ్య గలిగింది కాదు. అందువల్ల దానికింద తనిఖీ ఆఫీసరు "ఇంకేం చేసేది లేదు." అని వ్రాశాడు.

ఈ దేవత దర్శనంతో డాంటేకి ఆశ పుట్టింది. నిర్బంధంలో ఉన్నందువల్ల ఇదివరలో రోజులలెక్క మరిచిపోయాడు. తనిఖీ ఆఫీసరు వచ్చి తేదీ చెప్పివెళ్లాడు. డాంటే అది మర్చిపోలేదు. గోడ పైన సున్నంతో వ్రాశాడు: "1816 జూలై 30" ఆతరవాత ప్రతిరోజూ ఒక్కొక్క గీత గీసేవాడు. రోజులుగడిచాయి. వారాలు గడిచాయి. మాసాలు గడిచాయి. ఇంకా డాంటే నిరీక్షిస్తూనే ఉన్నాడు. పది హేనురోజుల్లో తనకి ముక్తి వస్తుందని మొదట లెక్కవేసుకు న్నాడు. తనిఖీ ఆఫీసరు ఎంత అశ్రద్ధతో ఉన్నా, కనీసం పదిహేను రోజుల్లోనైనా పని నెరవేరక పోదనుకున్నాడు. పదిహేను రోజులు గడిచిపోయినప్పుడు, ఆఫీసరు పారిస్ వెళ్ళేవరకూ ఏమీ చెయ్యలేడుకదా అనుకున్నాడు. కారాగారాల తనిఖీ అంతా పూర్తయితేకాని పారిస్ వెళ్లడు. అది ఒకటి, రెండు మాసాలు పట్టవచ్చును. అందువల్ల ఈమారు మూడు మాసాలు గడువు కట్టాడు. మూడు మాసాలూ గడిచాయి. అప్పుడింకొక యోచన తట్టింది. ఈమారు ఆరు మాసాలుగడువు పెట్టుకున్నాడు. అది కూడా గడిచిపోయిన తరవాత లెక్క చూసుకున్నాడు. అతనిప్పటికి పదిన్నర మాసాలనించి వేచి ఉన్నాడు. ఈ పదిన్నర మాసాల్లోనూ అతని జీవితంలో ఎటువంటి మార్పూ లేదు. ఉపశమనం ఇవ్వగల వార్తేదీ అతనికందలేదు. జైలర్ని ఎన్ని సార్లడిగినా మౌనంగానే ఉన్నాడు.

డాంటే తనకి మతి పోలేదుకదా అని అనుమానించాడు. తన ఆశకి ఆధారమైన ఆ విషయం కేవలం తన భ్రమాకల్పన కాదుగదా? దేవతవలె బందిఖానాలోకి వచ్చిన ఆవ్యక్తి, స్వప్నంలో చూసిన రూపం కాదుగదా?

ఏడాది అనంతరం కొత్త గవర్నరొచ్చాడు. అతనికి ఖైదీలందరి పేర్లూ తెలుసుకోడం కష్టం. అందువల్ల ఖైదీల నంబర్లు మాత్రమే తెలుసుకున్నాడు. నిర్భాగ్యుడైన ఆ యువకుని పేరు ఎడ్మండ్ డాంటే అన్న విషయం విస్మరించబడింది. అతని నంబరు 34. ★

బలిగం

(23-వ పేజీ తరువాయి)

(23-వ పేజీ తరువాయి)

కేదో తగలగా ఉలిక్కిపడిలేచింది. దీపం తగ్గి వెలుగుతోంది. లేచి హెచ్చు జేసింది. రామమ్మగారూ లేదు; లక్ష్మీ లేదు. తనొక్కత్తే ఉంది రోగి గదిలో. ఉక్కపోస్తుందని సావిట్లో పడుకున్నారేమో అనుకొని రోగికేసి చూసింది.

చూడంగానే కంగారుపడ్డది. కాళ్లు బిగదీసుకుంటున్నయ్; చేతివేళ్లు కొంకర్లు పోతున్నయ్.

"అమ్మగారూ!" అని ముఖంలో ముఖం పెట్టి పిలిచింది. పళ్ళు కొరుక్కుంటున్నయ్.

దాసీది రెప్పలు తెరచింది. కాని, అవి వెంటనే మూసుకున్నయ్.

దాసీదాని గుండె దడదడ కొట్టుకుంది. పాతికేళ్లనుంచీ తను పనిచేస్తున్న యజమానురాలు. ఎప్పుడూ కడుపులో పెట్టుకొని చూసుకునేది.

"రామమ్మగారూ!" అని పిలిచింది.

జవాబురాలేదు. సావిట్లోంచి గుర్రులు వినబడుతున్నయ్.

"లక్ష్మమ్మగారూ!" అని పిలిచింది.

జవాబురాలేదు.


"అంతా అయిపోయింది" అని అలిచింది.

వసారాలో పడుకున్న యజమాని కంగారుగా లేచాడు. బజారులో వీధి కుక్క చంద్రుడిని చూసి అలుస్తోంది. యజమానురాలి మృతశరీరంపై చీమలు పాకుతున్నయ్. కాళ్లకుపడ్డ గాయాలపై దోమలు ముసురుకుంటున్నయ్.

అవతల ఆమె ఆస్తిపాస్తులపై ముసురుకుంటున్న చుట్టపక్కాలు, లక్ష్మి, రామమ్మ గాఢనిద్రల్లోంచి లేచి, క్షణం సేపులో ఇల్లంతా ఎగిరేట్టు పెడబొబ్బలు పెట్టారు.

ముసిలిదాసీది చిమల్ని చేతులతో తోలేస్తూ, దోమల్ని తోలుతూ, ఎవరో ఇచ్చిన కర్పూరం చుట్టూ చల్లుతోంది. మెల్లగా ఆ శవపు తలవద్ద ఎవ్వరో దీపం వెలిగించారు. రామమ్మకు, లక్ష్మికి ఆ దీపపు వెలుతురులో క్రమేపి, మూగవడిన పెదవులపై నీరసంగా, స్పష్టాస్పష్టంగా అదే పూర్వ మందహాసం కనబడుతోంది.

చనిపోయిన ఇల్లాలుకు దినవారాలు బ్రహ్మాండంగా జరిగినయ్. ఊర్లో అంతా ప్రశంసించారు. "ఆమె కేమమ్మ... బోలెడంత బలగం. లక్ష్మి కన్న కూతురు కన్న ఎక్కువ. పాపం ఎలా నడుంకట్టుకొని నిర్వహించింది చాకిరి! సయాన చెల్లెలు కాకపోయినా పాపం రామమ్మ స్వంత తోబుట్టువులా తోడికోడలుకు ఉపచారం చేసింది. దత్తతకూడా చెసుకోటంతో దేవుడు వెంటనే స్వర్గద్వారాలు తెరచాడు ఆవిడకేం... బోలెడంత బలగం." ★



"తిలోత్తమ"

(24-వ పేజీ తరువాయి)

తుణ్ణి చేసినట్టు కనబడదు. ఇది జనసామాన్య దృష్టిలో అంత సంతృప్తికరంగా ఉండక పోవచ్చు.

కథలో ఏ యేలోపా లున్నప్పటికీ ఈ చిత్రంలో పాత్రలను, కథ అనుమతించినంతలో, బాగా ఉపయోగించుకున్నారు. ఇది చెప్పుకోదగిన సంగతి. అంజలీదేవి ధరించిన మూడు పాత్రలూ తిలోత్తమా, రాజకుమారీ, కిరాతకీ కూడా దేని కది తగినంత ప్రాముఖ్యం ఇవ్వబడి విస్పష్టంగా ఉంచబడ్డాయి. దేని అనుభవం, దేని మనస్తత్వం, దేని కష్టసుఖాలు దానికి చక్కగా కేటాయించబడ్డాయి. వసంతసేన పాత్ర కూడా మొదటినుంచి చివరదాకా చక్కగా చిత్రించబడింది. ఈ పాత్రకుగల ప్రాముఖ్యం కూడా అవగింజంతైనా తగ్గించబడలేదు.

దేవదత్తుడి పాత్రకుకూడా ఎట్టి లోపమూ జరగలేదు. ఈ పాత్రకూడా ఎక్కడికక్కడ కథలో తన ప్రాముఖ్యాన్ని గట్టిగా రుజువు చేసుకుంటుంది.

కథలో తిలోత్తమ రాజకుమారి మేనమామ పాత్రకు అవసరమైనదానికన్న కూడా ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వబడిందని చెప్పాలి. ఉన్న ప్రాముఖ్యం ఏమాత్రమూ తగ్గించబడలేదు.

కనకం ధరించిన మాలతిపాత్రా, రామ్మూర్తి ధరించిన కోమటబ్బాయిపాత్రా, కే. వీ. సుబ్బారావు ధరించిన కోమటిపాత్రా, స్వర్గలోక తిలోత్తమ చెలికత్తె పాత్రకూడా చక్కగా, నిండుగా చిత్రించబడటం ప్రశంసనీయం. మన చిత్రాలలో అనేక పాత్రలకు ప్రాధాన్యం ఉన్నప్పుడు ఒక పాత్రకోసమో, రెంటికోసమో మిగిలినవి త్యాగం చెయ్యటం తరుచు జరుగుతూ ఉంటుంది.

"తిలోత్తమ" చిత్రంలో అన్నిటికన్న ఎక్కువగా చెప్పుకోదగిన ఆకర్షణ అంజలీదేవి నటనా, నృత్యాలూ. దేవతాస్త్రీగానూ, స్త్రీగానూ, కిరాతకిగానూ కూడా ఆమె చాలా ప్రతిభావంతంగా నటించి చిత్రానికి ఎంతో జీవంపోసింది. ఆమె నృత్యాలు బాగున్నందుకు ఆమెనూ, వేదాంతం రాఘవయ్యనూ అభినందించవలసిందే గాని దేవలోక నృత్యాలు అమెరికన్ చిత్రాలలో చూపించే విజాతీయ నృత్యాలులాగా ఉన్నట్టు చూపటంలో ఔచిత్యం ఏమిటో తెలియటంలేదు. తెల్లవాళ్లు మన నెత్తికెక్కించిన భావదాస్యం ఇవాళ ఇంకా ఈ విధంగా వ్యక్తం అవుతూ ఉండటంకన్న శోచనీయం మరొకటి ఉండబోదు. వేదాంతం రాఘవయ్య భరతనాట్యంలో నిధి. స్వర్గాన్నీ, అక్కడి కళలనూ ఉదాత్తంగా చూపదలిస్తే భరతనాట్యం బాగా ఉపయోగించి ఉండవలసింది. భరతనాట్యంకన్న దక్షిణ అమెరికా నృత్యాలు జనరంజకమవుతాయని చిత్రనిర్మాతలు భ్రమపడిఉంటే ఆ భ్రమ కేవలం వారిదే.

దేవదత్తుడి పాత్రను అన్ని దశలలోనూ నాగేశ్వర్రావు విజయవంతంగా పోషించాడు. అయినప్పటికీ కిరాతుడుగా అతను చూపిన చురుకు అంతకుపూర్వం చూపలేకపోయినాడు. దానికి కారణం ఆ పాత్రలో, ఆ దశలలో సహజత్వం లోపించటం కావచ్చు. ఎందుకంటే స్వర్గలోక తిలోత్తమ మెడలో హారమైపోయినది మొదలు భూలోకంలోకి పతనమయేదాకా దేవదత్తుడు కేవలం పరిస్థితుల కీలుబొమ్మ. అతనిలో ఏ చైతన్యమూ లేదు. అప్పటికీ ఆ పాత్రను ఆ దశలోకూడా సరిగా పోషించటానికి చేతనైనంత కృషి చేశాడు. స్క్రిప్టు అనుకూలించనప్పుడు నటుడి జయాపజయాలు కేవలం దైవాధీనాలు.

నటులలో బి. ఏ. సుబ్బారావూ, సూర్యప్రభాకూడా చక్కగా నటించారు. వసంతసేన పాత్రలోని గాంభీర్యాన్ని సూర్యప్రభ అడుగడుగునా బాగా వ్యక్తం చేసింది. కనకం, రామ్మూర్తి, కే. వీ. సుబ్బారావూ, రాఘవన్ తమ పాత్రలను బాగానే పోషించారు.

చిత్రంలో ఆదినారాయణ ఇచ్చిన సంగీతమూ, నేపథ్యసంగీతమూ బాగున్నాయి. పాటలూ, వాటి మట్లూ కూడా బాగున్నాయి. అంజలీదేవికి ప్లేబాక్ పాడిన జోలపాట చెవికి చాలా ఇంపుగా ఉంది. నృత్యాలు ఎక్కడైనా పానకంలో పుడకల్లాగా పడ్డాయి గాని పాటలు సందర్భోచితంగానే ఉన్నాయి.

మొత్తంమీద "తిలోత్తమ" ప్రజాదరణ పొందగల జానపద చిత్రాలలోకే వస్తుంది.

★

అదీ - ఇదీ

(8-వ పేజీ తరువాయి)

చైనాతో యుద్ధానికి దిగేటట్లయితే నేను చైనా పక్షానే వుంటాను. నాతోపాటు ఇంకా చాలమంది బ్రిటిష్ ప్రజలు నిలిచి బ్రిటిష్ ఐక్యతకు గొప్ప భంగం కలిగించగలరని ఆశిస్తున్నాను.

పశ్చిమ జర్మనీని పునరాయుధీకరించటానికి బ్రిటన్ ఒప్పుకునే పక్షంలో— ఏ విధంగా చూసినా ధర్మయుద్ధం కానేరని యూరపియన్ యుద్ధానికి ఆయుధాలు ఉత్పత్తి చెయ్యవలసిందని బ్రిటిష్ కార్మికులను నేను ప్రోత్సహించను.

నే నేదో మహానాయకుణ్ణని గాని, నా చర్యలవల్ల గొప్ప మార్పులు తేగలనని గాని అహంభావంతో ఈ మాటలు వ్రాయటం లేదు, సరియైన సోషలిస్టులు, ప్రజాస్వామ్యవాదులు పలువురు నామాదిరిగానే భావిస్తున్నారని చూపటానికి, ఆ భావాలను అచ్చులో ఎవరో ఒకరు ప్రకటించవలసిన సమయం వచ్చిందనీ, ఈ మాటలు వ్రాస్తున్నాను.

రష్యన్ ఒత్తిడిని తగ్గించటానికి బ్రిటన్ అమెరికాతో చేరవలసిందే నని వాదించే వాళ్లు కొంద రున్నారని నాకు తెలుసు. కాని, అమెరికా మనని మరో ప్రపంచ యుద్ధంలో ముంచాలని చూస్తున్నా, దాని అడుగులకు మడుగు లొత్తాల్సిందేనా అని ప్రశ్నిస్తున్నాను.

మరో యుద్ధమంటే మన వినాశమని అని నా ఉద్దేశ్యం. ప్రపంచానికి, ముఖ్యంగా బ్రిటన్‌కు ఒకటే మార్గం వుంది. యుద్ధాన్ని ఆగించాలి; కమ్యూనిజమ్‌ను, సోషలిజమ్‌ను, కాపిటలిజమ్‌ను దేని దోవన దాన్ని బతక నివ్వాలి. చేతనైనంత వరకూ యుద్ధప్రమాదాన్ని దూరానికి నెట్టుతూ వుండటం, ప్రపంచాన్ని శాశ్వతంగా రెండు శత్రు శిబిరాలుగా చీలదియ్యాలని అమెరికా చేసే ప్రయత్నాలని భగ్నపరచటం—ఇదే ప్రజాస్వామిక సోషలిస్టుల కర్తవ్యం.

★

ఆ రాత్రి బాగా మబ్బుపట్టి ఉరుములు ఉరుముతున్నాయి. ఇంతలో ఎక్కడో పిడుగుపడింది. నిద్రపోతున్న కుర్రాడు లేచి ముసుగులోనించే అన్నాడు: 'నాన్నా! ఇంత రాత్రివేళ రేడియో పెట్టావేమిటి, నిద్రపట్టకుండా?'

Regd. No. M. 4479

బొమ్మలులేనిదే రాణింపులేదు

బొమ్మలు లేనిదే నేడు పత్రికలుగాని, పుస్తకాలుగాని, కాలెండర్లుగాని

రాణింపడంలేదు. మంచి బొమ్మలకు మంచి బ్లాకులు ఆధారం.

కనుక ఎవరికి ఏ బ్లాకులు కావలెనన్నా

★

లైను, హాఫ్‌టోన్, కలరు

★

అన్నిరకాల బ్లాకులు, అన్నిరకాల ముద్రణకూ

అనుకూలంగా ముచ్చటగా తయారుచేసి ఇస్తాము.

వివరాలకు వ్రాయండి:

మేనేజరు, ఆంధ్రపత్రిక మద్రాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras.